ఓం నమో భగవతే వాసుదేవాయ

## భక్త జయదేవ కవి ప్రణీత

# గీత గోవిందం

భక్తి, శృంగార రసభరిత మహాకావ్యం

(సరళ తెలుగు వచనం)


**రచయిత**

**పింగళి పాండురంగ రావు**



**ప్రచురణ**

**తిరుమల తిరుపతి దేవస్థానములు**

**తిరుపతి.**

**2017**

# GĪTA GOVINDAM

*By*
**PINGALI PANDURANGA RAO**

T.T.D. Religious Publications Series No. 1215
© All Rights Reserved

*First Print : 2017*

*Copies : 1000*

*Published by :*
**Sri ANIL KUMAR SINGHAL**, I.A.S.,
Executive Officer,
Tirumala Tirupati Devasthanams,
Tirupati.

***D.T.P:***
Publications Division,
T.T.D, Tirupati.

*Printed at :*
Tirumala Tirupati Devasthanams Press,
Tirupati.

# ముందుమాట

బహుళ శాస్త్రరహస్య వివేకంతోపాటు ఆధ్యాత్మికమైన మోక్షవిద్యను రంగరించి మన పూర్వకవులు కావ్యనిర్మాణం చేసేవారు. దీనినే **'వినిర్మాణము','నిర్మాణమార్మికత'** అని ఆలంకారికులు చెప్పారు. అటువంటి బహుముఖీన శాస్త్రపాండిత్యనైపుణ్యంగల మహాకవులలో గీతగోవింద మహాకావ్యకర్త విలక్షణుడు, విశిష్టుడు. విశ్వవిఖ్యాతిగాంచిన నాట్యనాటక ప్రయోక్త!

'నాట్యం భిన్నరుచేర్జనస్య బహుధాప్యేకం సమారాధనమ్' అని భరతుని నాట్యశాస్త్ర నిర్వచనం. "The Bharata Natya is a Composite form of Art" నాట్యం లలితకళల సమాహారస్వరూపం! జయదేవ మహాకవి గీతగోవిందం అపూర్వసృష్టి, అమృతవృష్టి అని ఎందుకన్నారంటే సహృదయ సామాజికులు ఈ మహాకావ్యంలో సంగీతం, కవిత్వం, నృత్యం, నాట్యం, చిత్రలేఖనం, ఆలంకారికులు చెప్పే అష్టవిధనాయికా స్వరూపాలు, నాయకాభేదాలు, రతిశాస్త్రరహస్యాల సంపుటీకరణంగా రచింపబడిందేగాక భక్తిసంప్రదాయంలో విశేషించి, శ్రీరాధాకృష్ణభక్తితత్త్వం ఆధ్యాత్మికస్థాయికి తీసుకువెళ్లి దాన్ని విశ్వజనీన భూమికలో ప్రదర్శింపజేసి **'మధురభక్తి'** అని భాగవతమహాపురాణంలో ప్రతిపాదింపబడిన గోపికలభక్తిమార్గంతో సంలీనం చేయబడింది. **'భక్తిశృంగార'**మని చెప్పినా **'శృంగారభక్తి'** అన్నా గోపికల మధురభక్తిమార్గమే! ఇది లోకంలో అందరూ చెప్పే **"భ్రష్టస్య కా వా గతిః"** అనే నైతిక పతనస్థాయికాదు, మరి, **కామస్య వామాగతిః** (గీతగోవిందం, 12సర్గ) అని చెప్పబడిన **"కామిగాక మోక్షగామి కాడు"** అని ప్రసిద్ధికెక్కిన మధుర శృంగారభక్తిచేత మోక్షాన్ని చూరగొనే పద్ధతి. **"పుమాన్ విష్ణురితి ఖ్యాతః, స్త్రీప్రాయం ఇతరం జగత్"** స్త్రీపురుషవివక్షలేకుండా సృష్టిలోని **జీవులందరూ స్త్రీలే.** పురుషోత్తముడైన **ఆ విష్ణువొక్కడే పురుషుడు** అని

భాగవత మహాపురాణం, విష్ణుపురాణాలు చెప్పాయి. ఆ దృష్టితో శ్రీరాధాకృష్ణుల శృంగారం **“జీవేశ్వరుల నిత్యశృంగారం”** గా గ్రహించినప్పుడే ఆధ్యాత్మిక సమన్వయం కుదురుతుంది. ఇది ఆత్మరమణమే తప్ప భౌతికరమణం కాదు. జయదేవుని గీతగోవిందం **రాధామాధవ రహస్యకేళీస్మరణ రూపచిత్రణం** కనుకనే రచనా విన్యాసం చిత్ర విచిత్ర సరస మనోవిలాస కలా కుతూహలంతో మధురకోమలకాంత పదావళులతో ఆద్యంతమూ సాగింది.

సాధారణ పాఠకులకుసైతం అర్థమయ్యేరీతిలో ఈ గ్రంథాన్ని సిద్ధంచేసిన రచయితకు నా శుభాకాంక్షలు.

*సదా శ్రీవారి సేవలో...*



**కార్యనిర్వహణాధికారి**
తిరుమల తిరుపతి దేవస్థానములు
తిరుపతి.

# ఆముఖము

భగవదర్చన కంటె భాగవతార్చనయే మిన్న అని ఆర్యోక్తి. భగవంతుని సేవించడం కన్నా భాగవతోత్తములను సేవించడమే గొప్ప అని తెలుస్తోంది. భాగవతుల జీవిత విశేషాల్ని అవగాహన చేసికొంటూ, వారి భక్తి భావ రసామృతాన్ని తాను గ్రోలుతూ, ఆ భక్తి పారవశ్యాన్ని భక్త జనావళికి సులభగ్రాహ్యంగా అందిస్తే మానవుని జీవితం సార్థకమౌతుంది.

ఇదే విషయాన్ని పరమేశ్వరుడైన శ్రీకృష్ణుడు భగవద్గీతలో “ఈ పరమ రహస్యమైన బోధను ఎవడు నా భక్తులకు వివరిస్తాడో, అతడు నా మీద పరమ భక్తి కలిగి, నిస్సందేహంగా నన్ను పొందుతాడు. భువిలో అతని కన్నా నాకు ప్రియం చేసేవాడు వేరొకడు లేడు. అన్యులెవరూ నాకు ప్రియతములు కాబోరు. ఈ ధర్మ సంవాదాన్ని అధ్యయనం చేసేవాడు నన్ను జ్ఞాన యజ్ఞంతో పూజ చేస్తున్నాడు. ఇది నా నిశ్చయం. అసూయ లేకుండా, శ్రద్ధ కలవాడై ఈ బోధామృతాన్ని వినేవాడు కూడా ముక్తుడే, పుణ్యకర్మలు చేసేవారు శుభలోకాలకు వెళుతారు” అని బోధ చేశాడు.

ఆ జగన్నాటక సూత్రధారి గోవిందుని అభయమే నా ఈ ఆధ్యాత్మిక రచనా వ్యాసంగానికి మూలాధారం. అదే నాకు శక్తిని ప్రసాదిస్తోంది. ఇదే కోవలో నేను భక్త జయదేవ మహా కవీశ్వరుని ఆరాధనలో, ఈ గ్రంథరూప కల్పన చేశాను.

“గీత గోవింద” కావ్యాన్ని గురించి క్లుప్తంగానైనా చెప్పాల్సి వుంది.

జయదేవకవి తన మృదుమధురమైన “గీత గోవింద” మనే భక్తి, శృంగార కావ్యాన్ని, శ్రీ మహావిష్ణువుయొక్క అవతార మూర్తుల స్మరణతోనే ఆరంభిస్తాడు. ఈ కావ్యం ప్రపంచ ప్రజల గుండెల్లో అజరామరమై నిలిచింది. మహావాగ్గేయకారులైన నారాయణతీర్థులు మున్నగు వారెందరికో స్ఫూర్తిదాయకమై అలరారింది.

ఈ కావ్యాన్ని ఆంగ్లం, జర్మని, ఫ్రెంచి, లాటిన్ మున్నగు విదేశీ భాషల్లోకి అనువదించారు. ప్రప్రథమంగా విలియం జోన్స్ చేసిన ఆంగ్లానువాదం గొప్ప సంచలనమే సృష్టించింది. ప్రసిద్ధికెక్కింది.

జయదేవకవి ఈ కావ్యంలో కావ్యాత్మను అద్భుతరీతిలో కాపాడుకొంటూ వచ్చాడు. ఇహపరాల్ని రెండింటినీ సమన్వయ పరచి భక్తి అభినివేశాన్ని లోకానికి పంచిపెట్టాడు. లౌకిక తత్త్వాన్ని ప్రదర్శిస్తూనే, ఆధ్యాత్మిక చింతనను రగిల్చి, పెంచి పోషించడంలోనే మహాకవి నేర్పరితనం పరిఢవిల్లుతోంది.

ఇందులో మనం మూడు పాత్రలనే చూస్తాం. శ్రీకృష్ణుడు, రాధ, సఖి. కావ్య మూలవస్తువు విరహవేదన. లౌకికంగా శృంగారమయంగా కన్పించినా, ఆధ్యాత్మికతయే మూలాధారం. అద్వైతమే ఆయువు. భక్తి, శృంగార భావాల్ని అద్భుతంగా మేళవించిన అద్వితీయ కవి. ఆయనదీ మధుర భక్తి శృంగారమే.

ఇందులో సఖి పాత్ర కీలకం. నాయికా నాయకుల విరహ వేదనను పరస్పరం తెలియజేస్తూ, వారిద్దరినీ సన్నిహితం చేస్తూ, వారిని మధుర సంగమానికి సిద్ధపరచే నైపుణ్యం ప్రదర్శిస్తోంది ఈ సఖి. ఈ కావ్యంలో 83 గీతాలున్నాయి. ఇవన్నీ 12 సర్గలుగా, 24 అష్టపదులుగా సమ్మిళితమై వున్నాయి. మొదటి కీర్తన తప్పించి, మిగతా అష్టపదులు 10 చరణాలుగా వ్రాయబడ్డాయి. ఈ కావ్యం అష్టపదులుగా కూడా సుప్రసిద్ధం. ప్రతి సర్గ శ్రీకృష్ణారాధనతో ప్రారంభమౌతుంది. – 1. సామోద దామోదర, 2. అక్లేశ కేశవ, 3. స్నిగ్ధ మధుసూదన, 4. ముగ్ధ మధుసూదన, 5. సాకాంక్ష పుండరీకాక్ష, 6. ధన్య వైకుంఠ 7. నాగర నారాయణ, 8. విలక్షణ లక్ష్మీపతి, 9. ముగ్ధ ముకుంద, 10. ముగ్ధ మాధవ, 11. సానంద గోవింద, 12. సుప్రీత పీతాంబర.

తర్జుమాలు, వ్యాఖ్యానాలు అసంఖ్యాకం. ఒరియా భాషలోకి కొన్ని తర్జుమా చేస్తే, మరికొంతమంది ఒరియా కవులు బెంగాలీ భాషలోకి తర్జుమా చేశారు. ఈ తర్జుమాలు, వ్యాఖ్యానాలు ఎక్కువగా 16, 17 శతాబ్దాల్లో జరిగాయి. 17, 18 శతాబ్దాల్లో ఒరియా కవులు బెంగాలీలోకి ఎక్కువగా తర్జుమా చేశారు.



దాదాపు 100 వ్యాఖ్యానాలు, 50కు మించి అనుసరణలు 14వ శతాబ్దం నుండి 20వ శతాబ్దంవరకు వెలువడ్డాయి. అందులో ఉదన్యకార్య (12వ శతాబ్దం), జగద్ధర (14వ), నారాయణదాస (16వ), లక్ష్మీధర (16వ), శంకరమిశ్ర (16వ), ధనంజయ (17వ), భగవద్దాసనారాయణ పండిత (17వ), పూజారిగోస్వామి (16,17వ), లక్ష్మణ భట్ట (18వ), కృష్ణదాస కవిరాజ్ (18వ), ది సీగల్ (ఆక్స్‌ఫర్డ్ 1975), ఎస్.ఆర్. శ్రీనివాస అయ్యర్ (1963), పండిట్ హరికృష్ణ ముఖోపాధ్యాయ (4వ ముద్రణ, కలకత్తా 1965) మొదలైనవారు రచించిన 15 గ్రంథాలు సుప్రసిద్ధమైనవి.

అంతేకాదు, జయదేవ కవి భక్తి సాహిత్యాన్ని గురించి ఎందరో వ్యాఖ్యాతలు, పండితులు, కవులు, సామాజిక వేత్తలు, తమ తమ ఉత్తమ వ్యాసాల్ని ప్రచురించారు. 20వ శతాబ్దంలో అజిత్ కుమార్ త్రిపాఠి, డా॥ కె.సి.మిశ్రా, ఇందుభూషణ్‌ఖర్, తారాకాంత మహంతి, డా॥ జె. నారాయణధర్, అరుణ్ కుమార్ ఉపాధ్యాయ, డా॥ బి.ఎల్. మల్లా, నిమాయ్ చరణ్ మహంతి, సోమనాథ జెనా, డా॥ దీనబంధు మహారాణా, దీన కృష్ణ జోషి, కె.సి. పట్నాయక్, డా॥ సత్యవ్రత దాస్, శశాంక్ శేఖర్ పాండే, రాజ్ కిశోర్ మిశ్రా, డా॥ భగవాన్ పాండా, నిరుపమ్ మహాపాత్ర, ప్రభాత కుమార్ నందా, డా॥ జ్యోత్స్న సాహు, డా॥ సత్యకామ్‌సేన్ గుప్తా, డా॥ ఆశీష్ కుమార్ చక్రవర్తి, డా॥ ఎన్.ఎస్.ఆర్. అయ్యంగార్, డా॥ హెచ్.ఎన్. దత్తా, గదాధర్ మహాపాత్ర, ప్రఫుల్ల చంద్ర త్రిపాఠీ, జయంతి రాధ, ప్రొఫెసర్ హరేకృష్ణ శతపథి, డా॥ చిత్రసేన పసాయత్, గురు కల్యాణ్ మహాపాత్ర మున్నగు ఉద్దండు లెందరో పరిశీలించి గొప్ప రచనలు చేశారు.

వీరందరు వ్యక్తీకరించిన అభిప్రాయాల్లో భిన్నత్వం గోచరిస్తుంది. లోతుగా పరిశోధించి వెలువరించిన అభిప్రాయాలే కావచ్చు. అయితే వారందరూ జయదేవ కవి జననం, నివాస స్థానం, ఈ విభిన్న దృక్పథాల్ని విస్తారంగా తెలియజేయాలంటే బృహద్గ్రంథమే అవుతుంది. పైగా దాని వల్ల, సామాన్య పాఠకులకు ఒనగూడే మేలు శూన్యమని నా అభిప్రాయం. భక్త జనావళికి ప్రముఖాంశాలనే అందించాలి. అవి వారి పరిమిత అవగాహనకు అనుకూలంగా ఉండాలి. భక్తిభావాన్ని పెంపొందించాలి. భగవదారాధనలో నిమగ్నులై, భక్తులు భక్తి రసానందాన్ని అనుభవించాలంటే, వారికి అనుకూలమైన సరళ భాషలో భావాల్ని విపులీకరించాలి. వారి హృదయాల్ని చూరగొనే భావసౌందర్యాన్ని ప్రోది చేసి అందించాలి. భక్తి రసానందాన్ని, అభినివేశాన్ని వారి భక్తి భావాలను హృదయాల్లోకి చొప్పించి, వారిని ఆనంద హృదయుల్ని చేయాలి. అపుడే వారు ఆధ్యాత్మికోన్నతిని సాధించగలరు. ఈశ్వర కృపకు పాత్రులు కాగలరు.

నా రచనా వ్యాసంగం ఏకైక లక్ష్యం కూడా ఇదే. అందుచేతనే, నేను ఈ గ్రంథంలో జయదేవ కవి జీవిత విశేషాల్ని చాల సంక్షిప్తంగా చెప్పాను. విస్తారమైన చోటు యివ్వలేదు. 'గీత గోవింద' కావ్యాన్ని కూడ సరళమైన తెలుగులోనే ఉంచాను. కారణం ఎంతోకాలంగా ఈ అష్టపదులను ఎందరో సుమధుర గాయనీ గాయకులు ఆలపిస్తూ, భక్తజనావళి హృదయాల్లో స్థిరపడేట్లు చేశారు. ఈ పుస్తక పఠన సమయంలో, భావాన్ని మాత్రమే చదివి ఆనందించడంకాక, అష్టపదిని కూడా పాడుకుంటూ మరింత ఆనంద హృదయులౌతారనే తలంపుతో 24 అష్టపదులూ ఉంచాను. గీతగోవింద మూలగ్రంథకర్త 83 శ్లోకాలను ప్రతి అష్టపది ముందూవెనుకలా వ్రాసియున్నారు. అవి ఒక ప్రత్యేక ప్రయోజనాన్ని ఉద్దేశించినవి. ఈ 83 సంస్కృతశ్లోకాలను చేర్చి, ఆశ్లోకాలకు తాత్పర్యాలను శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయ ప్రాచ్యపరిశోధన సంస్థలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేసి



విశ్రాంతులైన సంస్కృతాంధ్ర సాహితీవేత్తలు **డా॥ ముదివేడు ప్రభాకరరావు** గారి సహకారంచేత వ్రాయించి అనుసంధానం చేయడం జరిగింది. వారే విపుల విషయసూచికనుకూడా సిద్ధంచేశారు. వారి అవ్యాజసాహితీశ్రమకు నా హృదయపూర్వక ధన్యవాదాలు.

జయదేవుని జననం, జన్మస్థలం, జీవిత ప్రథమార్ధం, "గీత గోవింద" రచనా వైశిష్ట్యం, గీత గోవిందం కావ్యమా? నాటకమా? అనే మీమాంస, జయదేవుని ఇతర రచనలు (ప్రకృతి, నృత్యం, సంగీతం, నాటకం గురించి), అస్సాం, ఒరిస్సాలో 'గీత గోవిందం' ప్రాచుర్యం, ప్రభావం మున్నగు అంశాలను క్షుణ్ణంగానే పరిశీలించి, యధాశక్తి క్లుప్తంగానే ఇందులో చేర్చాను. చివరగా 'గీత గోవిందం' ఎలా మహనీయ భారతీయ సంస్కృతికి ప్రతీకగా విశ్వవిఖ్యాతి నార్జించిందీ చెప్పడానికి ప్రయత్నించాను.

జయదేవకవి అనన్య భక్తుడు. రాధామాధవుల ప్రేమలీలను శృంగారపరంగా వర్ణించి తన్మయుడయ్యాడు, తరించాడు. రాధాకృష్ణుల రాసలీలలను మృదుమధురంగా గానంచేసి, తాను రసావేశానందాన్ని పొందటమే గాక, శ్రోతలను, పఠితలను కూడా శృంగార రసావేశంలో ముంచి, మాధవుని అనురాగానికి చేరువగా తీసికొని వెళ్ళి, భక్తుల్ని తరింప చేశాడు.

ఈ రచన రూపకల్పన నా భక్తి జనితఫలం. శ్రీహరి పాదాలకు నేను శరణాగతుడను. ఆ విశ్వేశ్వరుడు జగతికి శ్రేయస్సు ప్రసాదించు గాక!

**-: లోకాస్సమస్తా స్సుఖినో భవంతు :-**

**పింగళి పాండురంగరావు**

# భక్త జయదేవ మహాకవి జీవిత రేఖలు

ఒరిస్సా (ఉత్కళ) రాష్ట్రంలో పూరి దగ్గర "బిందుబిల్వం" అనే గ్రామంలో జయదేవ కవి జన్మించాడు. ఆ గ్రామం బావిపతన్ పంచాయతి సమితిలో వుంది. ఖుర్దా జిల్లా. 12వ శతాబ్దం ప్రథమార్ధంలో జన్మించినట్లుగా భావింపబడుతోంది. అపుడు ఆ ప్రాంతం చోళగంగదేవ రాజ్యపాలనలో వుండేది. ఇక్కడ ఎక్కువగా బ్రాహ్మణులు నివసిస్తుండేవారు. భోజదేవ, రమాదేవి వీరి తల్లిదండ్రులు.

జయదేవుడు సంస్కృతంలో, సంగీతంలో ఉన్నత విద్య నభ్యసించడానికై **'కూర్మపటక'**కు వెళ్ళాడు. విద్య పూర్తి కాగానే ఉపాధ్యాయుడుగా పనిచేశాడు. అందుచేతనే జయదేవునికి **'కూర్మపటక ప్రవర', "సాధుప్రధాన్"** అని రెండు బిరుదులుండేవి. ఈ విధంగా జయదేవునకు కామనాయక కుటుంబంతోనూ, కూర్మపటక విద్యా సంస్థలతోను అవినాభావ సంబంధాలు ఉండేవి. "గీత గోవిందం" జయదేవ కవి రాధామాధవులకు సమర్పించుకున్న దివ్యమైన కానుక.

భక్త జయదేవుని జన్మస్థల విషయమై పశ్చిమ బెంగాల్ చరిత్రకారులది, సాహితీవేత్తలది ఒక వాదనగా వుంటే, ఒరిస్సా రాష్ట్ర సాహితీవేత్తలది మరొక వైపు. జానపదులది, సాంస్కృతికవేత్తలది మరొక వాదన వుంది. ఇలా అనేక వాదనల మధ్య ఆయన జన్మస్థలాన్ని నిర్ణయించడం కష్టమే అయిపోయింది. చివరకు భువనేశ్వర్‌లోని జయదేవ సాంస్కృతిక పరిషత్, ఒరిస్సా స్టేట్ మ్యూజియం వల్ల, అనేక సుప్రసిద్ధ పండితుల సమాలోచనల మేరకు పశ్చిమ బెంగాల్ మరియు ఒరిస్సా రాష్ట్ర పండితులే కాదు, భారతదేశంలోని పండితులు, విద్వాంసులు, అందరూ నిష్పక్షపాతంగా వెలిబుచ్చిన అభిప్రాయం మేరకు జయదేవుని జన్మస్థలం కళింగ రాజ్యంలోనిదే. కెందువీ అని నిర్ణయించబడిన గ్రామం పశ్చిమ బెంగాల్‌లో పూర్వం ఉండేది, అది ఇప్పుడు **బిందు బిల్వగా** ఒరిస్సాలోని ప్రాచీలోయలో వుంది. మరొక ఆసక్తికరమైన విషయం ఏమంటే జయదేవుని రచనలన్నీ బెంగాల్ రాష్ట్రంలో జానపదుల మధ్య, వారి సాంస్కృతిక సభల్లో అసలు వినిపించవు. దీన్నిబట్టి జయదేవ జన్మస్థానం బీరభాకులోగల **కెందువీ** కాదని తెలియవచ్చు. జయదేవుని మరణానంతరం 50 సం॥లకు ఒరియా విద్వాంసులు ఆయన రచనల్ని వెలుగులోకి తెచ్చారు. కాని, బెంగాలీ పండితులు మాత్రం 400 సం॥లు తర్వాతనే ఆ పనిని చేపట్టారు. అయినా 20వ శతాబ్దం వరకు ఈ వివాదం కొనసాగుతూనే వుంది. బెంగాల్ రాజైన లక్ష్మణసేన ఆస్థానంలో జయదేవుడు ఆస్థాన కవి అని చెప్పడం కూడా అసత్యంగానే వుంది. కాని పండిట్ కేశవ మిశ్రా, చంద్రదత్త, నరోజీ, మహాపాటి కవి, పండిట్ మల్లాది సూర్యనారాయణ శాస్త్రి మున్నగు పండిత విమర్శకులు జయదేవుని జన్మస్థలం **"కెందువీ"**గానే నిర్ధారించారు.

## మరొక కథనం

జయదేవుని అసంఖ్యాక అనుచరులుండేవారు. ఒంటరిగా సన్న్యాస జీవితం గడుపుతుండేవాడు. ఒక బ్రాహ్మణుడు తనకు భగవంతుడు అనుగ్రహించిన **'పద్మావతి'** అనే తన కుమార్తెను దివ్యప్రసాదంగా భావించి శ్రీ జగన్నాథస్వామి ఆలయానికి తీసికొని వచ్చాడు. ఆమెను స్వామివారికే సమర్పించుకోవాలని భావించి, పద్మావతిని స్వామిముందు వదిలి వెళ్ళిపోయాడు. దాన్ని దైవాజ్ఞగా భావించాడు తండ్రి. పద్మావతిని జయదేవునికి భార్యగా దానం చేస్తానని, కాని సాంసారిక బంధం ఉండకూడదని చెప్పాడు. ఇలా ఆమెను జయదేవునికి అప్పగించాడు. అపుడు జయదేవుడు "నిన్ను నీ తండ్రి నా వద్ద వదలి వెళ్ళాడు. నాతో నీవు వుండవద్దు. నీకు ఎక్కడికైనా వెళ్ళాలని వుందో చెప్పు, నేను నిన్ను అక్కడికి చేరుస్తాను" అని అడిగాడు. అందుకు పద్మావతి, "నన్ను నా తండ్రి దైవాజ్ఞ మేరకు నీ వద్ద వదలి వెళ్ళాడు. కనుక నేను నీ భార్యగా, ఆత్మీయంగా వుంటూ నీకు

సేవ చేసుకొంటాను.” అని సమాధానమిచ్చింది. జయదేవుడు ఆమెను అనాథగా ఎలా వదలి వేయడమని భావించి దైవానుగ్రహంగానే తానూ భావించి, ఆమెను వివాహం చేసికొన్నాడు. వీరిద్దరి దాంపత్య సంబంధంతో వారిలో ప్రవృద్ధమైన శృంగార రసావేశాలు తుదకు **‘గీత గోవిందం’**గా రూపుదిద్దుకున్నాయని తెలుసుకోవడంలో ఆశ్చర్యమేమీ లేదు. బెంగాలీ పండితులు సహజంగా బెంగాలీ స్త్రీలను మాత్రమే వివాహ మాడతారు. కాని, జయదేవుడు మాత్రం ఒరియా వనితను భార్యగా చేసుకుని ఆదర్శప్రాయుడైనాడని తెలుసుకుందాం.

11వ శతాబ్దం ఉత్తరభాగంలో, భారతీయ సమాజానికి దిశానిర్దేశం చేసే నాయకత్వం లేకుండాపోయింది. జైన మతం, బౌద్ధ మతం అదృశ్యమయ్యే స్థాయికి చేరుకొన్నాయి. కాని, పూర్తిగా అదృశ్యం కాలేదు. బ్రాహ్మణత్వం మీద వ్యతిరేకత బలంగానే ఉండేది. ఆదిగురువు శంకరాచార్యుల అనుయాయులు బౌద్ధ మతాన్ని పతనం చేయాలనే సంకల్పంతో స్థూపాలను, ఆరామాలను, విహారాలను ధ్వంసం చేయడం మొదలు పెట్టారు. ఆదిశంకరులు బుద్ధుని విష్ణు అవతారంగా ప్రకటించినప్పటికి, అనుయాయులు శివాలయాలను నిర్మించే పనిలో నిమగ్నమై, మత దురహంకారానికి మార్గదర్శకులైనారు. మతాంతరీకరణలు ఊపందుకున్నాయి. వేదాలు, ఉపనిషత్తుల జ్ఞానం ఎవరికీ లేదు. హిందూమతంలో వైష్ణవ సంప్రదాయాన్ని జనసామాన్యం దగ్గరకు తీసికొనిపోవడం ఒక్కటే మార్గాంతరంగా భావించబడింది.

దక్షిణ భారతంలో రాధాకృష్ణుల ప్రేమ విషయం ప్రచారంలోకి వచ్చింది. కాని, బలంగా నిలవలేదు. సరిగ్గా ఇదే సమయంలో శ్రీ జయదేవ కవి ఈ శూన్యాన్ని పూడ్చేందుకు ఉద్యమించాడు. ‘గీత గోవింద’ శృంగార కావ్యాన్ని రాధామాధవుల రాసలీల వేదికగా చేసి అద్భుత కల్పన చేశాడు. ఇది వైష్ణవులకు వేద సమానంగా నిలిచింది. దేశం అంతా ఈ రచనా విశేషం



పాకిపోయింది. ఈ కావ్యం సంగీతం, నృత్యం, నాటకరంగాలపై అద్భుత ప్రభావం చూపింది. జయదేవుడు ప్రారంభించిన ఈ ప్రహసనం బాగా అభివృద్ధి సాధించింది. **‘గీత గోవిందం’** చారిత్రాత్మక ఆవశ్యకతగా గుర్తింపు పొందింది. పూరీ జగన్నాథుని ఆలయంలో ప్రారంభమైన ఈ కార్యక్రమం అతివేగంగా ప్రయాణించి, అస్సాం నుండి గుజరాత్ వరకు, కన్యాకుమారి నుండి కాశ్మీరం వరకు అమోఘమైన ప్రజాదరణ సంతరించుకుంది.

ఈ విధంగా జయదేవుడు రాధామాధవ సంస్కృతిని ఆలంబనగా చేసుకొని భాగవతాన్ని **“గీత గోవిందం”**తో సమన్వయం చేసి కృష్ణుడు, విష్ణువు సంగమమే గోపీనాథ రూపంగా ప్రవేశపెట్టాడు. ఇది బహుళ ప్రజాదరణ పొందింది. ఇలా వైష్ణవ భక్తియే ఒరిస్సా రాజ్యభక్తిగా స్థిరపడి పోయింది. విష్ణుమూర్తి దశావతారాలను సంగీత, నృత్య రూపాల్లోను, సాహిత్య మీమాంసల్లోనూ విరివిగా జయదేవుడు ప్రచారం చేశాడు.

జయదేవుడు లక్ష్మణసేన తండ్రియైన వల్లాలసేన (బల్లాలసేన) సమకాలీనుడు. (1119–1169). గీత గోవింద రచన, డా॥ ఎస్.ఎస్. రాజగురు అభిప్రాయం ప్రకారం, 1146–1150 మధ్య కాలంలో జరిగినట్లు తెలుస్తుంది. లక్ష్మణసేన ఆస్థానంలో జయదేవునిలా మిగతా అందరు ఆస్థాన కవులుగా పనిచేయలేదు. దేవాలయాల శాసనాలను బట్టి తెలుసుకోవలసింది ఏమంటే, **కురుమ పాటక** రాజులనుండి జయదేవునికి **కుమి నాయక్, మోడిందేవి, నగ్మాదేవి** తదితరుల కుటుంబాలతో సాన్నిహిత్యం ఉండేది. ఇదే అభిప్రాయం ప్రకారం పద్మావతి అనే దేవదాసి కేవలం జగన్నాథ ఆలయానికే పరిమితమైంది కాదని, ఆమె తండ్రి దేవశర్మ ఈమెను జయదేవునకు ఇచ్చి వివాహం జగన్నాథ ఆలయానికే పరిమితమైంది కాదని, ఆమె తండ్రి దేవశర్మ ఈమెను జయదేవునకు ఇచ్చి వివాహం జరిపించాడని తెలియవస్తుంది. అంతేకాదు, ఆమె ఆ కాలంలో దక్షిణాదిన గూడ సుప్రసిద్ధ నృత్య కళాకారిణిగా ప్రసిద్ధి చెందింది.

కేదారనాథ్ మహాపాత్ర అభిప్రాయం ప్రకారం జయదేవుని కాలం నుండి నిత్య 'గీత గోవింద' పఠనం, నృత్య ప్రదర్శనలు జగన్నాథ మందిరంలో సాగుతూ ఉండేవి. ఈ నిత్య కార్యక్రమాన్ని అధికారికంగా ప్రకటిస్తూ సంగీతానికి, నృత్యానికి తగిన వారిని గూడ నియామకం జరిపించేవాడు చోడగంగ దేవ చక్రవర్తి.

## ఒక సన్నివేశం

లక్ష్మణసేన మహారాజు తన దర్బారును గంగానది ఒడ్డున అశోక వృక్షం క్రింద జరిపించేవాడు.

అదే సమయంలో గంగానదీ స్నానం ముగించుకొని జయదేవుని భార్య పద్మావతి సభామండప ధ్వనులను విని నేరుగా సభామండపంలోకి ప్రవేశించింది. సంగీతం పోటీలో తనను గెలిచిన వారికే 'విజయ పత్రాన్ని' ఇవ్వాలని ప్రకటన చేసింది. ఒక ముస్లిం సన్యాసి సభలో వున్నాడు. పద్మావతిని ఒక మధుర గీతాన్ని ఆలపించమని కోరాడు. గాంధార రాగంలో ఒక శ్రావ్యమైన గీతాన్ని పద్మావతి పాడటం మొదలుపెట్టింది. గంగా ప్రవాహం మీద వున్న పడవలన్నీ వాటంతట అవే తీరానికి చేరుకొన్నాయి. సభాసదులు ఆశ్చర్యపోయారు. బుధన్ మిశ్రా పోటీగా పాడటానికి తిరస్కరించగా, పద్మావతి భర్త జయదేవుని పిలిపించి, పాడించండని షేక్ ఆజ్ఞాపించాడు. జయదేవుడు వసంత రాగంలో ఆలపించగనే అశ్వత్థ వృక్షం చిగుళ్ళు వేయడం ప్రారంభించింది. మిశ్రాకు ఇలా 'విజయ పత్రం' తిరస్కరించబడింది, కాని జయదేవుడు సంస్కృత వ్యాకరణ నియమాలు పాటించలేదనే విమర్శ గూడ ప్రచారంలో వుంది.

జయదేవుడు, పద్మావతి ఇద్దరూ అపూర్వ కృష్ణభక్తులు. భారతదేశం గర్వించదగ్గ మహాకవి జయదేవుడు. శ్రీహర్ష, మాఘ, భవభూతి, కాళిదాసు పరంపరలో వారసుడిగా రాణించాడు. సంస్కృత కావ్య సంప్రదాయంలో జయదేవునే చివరి గొప్ప కవిగా అభివర్ణిస్తారు. దేవదాసి సంప్రదాయాన్ని



ప్రవేశపెట్టి ఆ సంప్రదాయానికి దేవాలయాల్లో గొప్ప స్థానాన్ని కల్పించి, స్థిరపరచింది కూడా జయదేవ కవే. నృత్య సంగీత విభావరులు నిర్వహించడానికి 'నట మందిర్'లు ఏర్పాటు చేయించాడు. ఒరిస్సాలో వైష్ణవ సంప్రదాయం స్థిరపడి అత్యంత గౌరవం లభించడం జయదేవుని కృషివల్లనే సాధ్యమైంది.

'గీత గోవింద' కావ్యానికి చరిత్రాత్మక గ్రంథంగా, సాహిత్య, మతపరమైన ఉద్గ్రంథంగా గుర్తింపు, ఆదరణ లభించాయి. పూరి జగన్నాథ దేవాలయంలో ఈ కావ్య సంబంధమైన నృత్య, సంగీత, నాటకానికి సంబంధించిన నిరంతర కార్యక్రమాల వల్ల పూరి జగన్నాథ దేవాలయానికే దేశీయులలో గొప్ప ఆదరణ లభించింది.

పూరి జగన్నాథ దేవాలయ చరిత్రలో 'గీత గోవింద ప్రాచీన మత గ్రంథాల సరసన స్థానాన్ని స్థిరం చేసికొంది. 'గీత గోవింద' గానం, నృత్యం, సంగీత సమ్మేళనాలు నిత్యకృత్యమై పోయాయి. జనాన్ని గొప్పగా ఆకర్షించాయి. దేవదాసీలు వారి అభినయ క్రమంతో మరింత శోభ చేకూర్చారు. ఈ దేవాలయ సందర్శనకు దేశం నలుమూలలనుండి భక్తులు విరివిగా వస్తుండేవారు. జగన్నాథ దేవాలయంలో 'గీత గోవింద' రీత్యా సేవా కార్యక్రమాలు కూడ జయదేవునితోనే ప్రారంభమయినాయి. కామార్ణవ దేవ చక్రవర్తి కాలం నుండి కొనసాగి, సూర్య వంశ గజపతి ప్రతాప రుద్రదేవ అధికారికంగా ఈ సంప్రదాయానికి చట్టబద్ధత కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేశాడు.

బెంగాలీ వైష్ణవుల సాధికార గ్రంథమైన **'భక్తమాల'** జయదేవుడు అతి సాధారణ గ్రామీణ జీవితాన్ని గడిపాడని, తన ఇష్టదైవాలైన రాధా మాధవులను సేవించేందుకు కావలసిన ధనాన్ని ప్రోగు చేసేందుకు బెంగాల్‌లో వున్న సేన్ వంశజుల కొలువుకు వచ్చాడని, తూర్పు భారతదేశంలో వున్న మరెన్నో కొలువులను దర్శించాడని చెప్తుంది. బెంగాల్ రాజులైన సేన్ వంశం వారు

కాని, మరెవరు జయదేవుని ఆస్థాన కవిగా నియమించలేదు. కాని, అతని విశిష్ట వ్యక్తిత్వాన్ని, రాధా మాధవ సేవా తత్పరతను గుర్తించి, కావలసినంత ద్రవ్య సహాయం చేసినట్లు చెప్పబడింది.

రాధా మాధవుల ప్రేమతోను, గోపికాంగనల రాసక్రీడలతోను రసమయమై సుప్రసిద్ధమైన బృందావనానికి వెళ్ళాలని జయదేవునికి తీవ్ర ఆకాంక్ష ఉండేది. ఉత్కళ రాజు శెలవు తీసికొని, మెడలో రాధామాధవుల చిత్రపటాల్ని అలంకరించుకొని బృందావనం చేరాడు. గీత గోవింద మధుర భక్తి రసగానంతో అక్కడి వారిని పులకితులను చేశాడు.

దీనితో **'గీత గోవిందం'** ఉత్తర భారతంలో మారుమ్రోగిపోయింది. ముఖ్యంగా ఆనాటి ఘూర్జర రాజ్యంలో వున్న ద్వారకలో మరియు ముఖ్య నగరాల్లో వ్యాప్తి చెందింది. మతపరంగాను, సంగీత, సాహిత్యపరంగాను ప్రజలపై తీవ్ర ప్రభావాన్ని చూపింది. కేశీఘాట్ వద్ద వున్న రాధామాధవుల విగ్రహాలను, జయదేవుడు బృందావనంలో వున్నంత కాలం దర్శించి, నిత్యం పూజలు, ప్రార్థనలు నిర్వహించేవాడు. జయదేవ ప్రభావం ఎంతవరకు వెళ్ళిందంటే, ఆయన భక్తుడొకడు రాధామాధవుల విగ్రహాలను తెప్పించి, ఒక దేవాలయం నిర్మించి, అందులో ఆ విగ్రహ ప్రతిష్ఠాపన కావించాడు. తర్వాతి కాలంలో జయపూర్ మహారాజ్ ఈ విగ్రహాలను జయపూర్ ఘాటీ అనే స్థలంలో దేవాలయం నిర్మించి, అందులో ప్రతిష్ఠించాడు. జయదేవుడు అంతిమ దశలో తన ఊరికి తిరిగివచ్చాడని, ప్రతి రోజు స్నానం చేయడానికి 72 మైళ్ళ దూరంలో ఉన్న గంగానదికి వెళ్తుండేవాడని చెప్తారు. గంగానదియే ఆయన వద్దకు వచ్చిందనే వాదాన్ని విమర్శించినవారూ ఉన్నారు.

జయదేవునకు జయ, విజయ అనే ఇద్దరు అందగత్తెలైన భార్యలున్నారని చెప్తారు. జయదేవుడు విజయతో నృత్య, సంగీత సభల్లో తిరుగుతూ వుంటే, జయ ఇంటి వ్యవహారాలు చూసుకునేది. జయయే పద్మావతిగా గాంధర్వ ప్రక్రియ, వేదాల్లో విజ్ఞానవంతురాలుగా వుండేది.



'గీత గోవిందం' యొక్క ఉపోద్ఘాత గీతాన్ని స్మరించుకొని ఆనందించడం మన భాగ్యమే. అదీ డా॥ ఎన్.ఎస్. అయ్యర్‌గారు ఇంగ్లీషులోనికి అనువదించిన తీరు హృద్యంగా, మనోహరంగా, మధురంగా ఉంది : చదువుదామా?

"The Cloud - dark Sky, darkens the woods
The lofty shade of tamālā trees
Deepens the darkness.
This uneasy night frightens him, Rādhē!
Get him home, beseeched Nanda
Trudging along the thickets,
Rādha and Mādhava long for each other.
And Unite on the banks of Yamuna."

**భావం :** "The overcast sky darkens the shady woodlands, the green 'tāmāla' trees look frighteningly dark and such a dark and stormy evening induces fear in the child. (Krishna). Therefore, his foster father, Nanda beseeches Rādha to take him home. Rādha and Krishna, being as directed trudge along the thickets on the banks of Yamuna, where they secretly unite. The dark cloud, rain and storm are elements enough to rouse their longing for union. Their relative loneliness too provide an opportune privacy for the consummation of their love". ఇదే అద్భుతమైన ప్రారంభ గీతం.

రాధను చూడగానే నందునకు గార్గేయ మహర్షి చెప్పిన మాటలు స్ఫురణకు వచ్చాయి. తన బిడ్డయైన శ్రీకృష్ణుడు రాధ, శ్రీహరి దంపతుల స్వరూపాలే, వేరు కాదు. కాని నందుని భ్రమ వీడలేదు. అందుచేతనే నందుడు రాధతో ఇలా అంటాడు.

"Gentle Rādha! Takeyour dearest love and go happily, And give back my son after fulfilling your desire."

నిజానికి కృష్ణుడు నందునకు చిన్న పిల్లవాడు. కాని, రాధ దృష్టిలో శ్రీకృష్ణుడు చాల అందగాడుగా కన్పిస్తాడు. ఇలా ఉంటేనే శ్రీకృష్ణ రాధల సమాగమానికి, సంగమానికి అర్థం దొరుకుతుంది. మాయ, లీలలయొక్క ఏకరూపమే రాధామాధవులు అనే భావంమీద కూడ ఆధారపడి జయదేవ కవి **'గీత గోవిందం'** ప్రారంభిస్తాడు.

జయదేవుని దూరదృష్టి, దృఢమైన నిర్ణయాత్మక విశేషాలు ఎన్నో మనకు గోచరిస్తాయి.

జయదేవుడు శాస్త్రాల్లో, పురాణాల్లో, సంగీతంలో, నృత్యంలో అఖండ ప్రజ్ఞావంతుడు. తన కావ్యశైలిని **'మధుర కోమల కాంతపదావళి'**గా అభివర్ణించుకొన్నాడు. ఒరిస్సాలో మూడు ప్రదేశాలనుండి 1980 ప్రారంభంలో తాళపత్రాల్లో ఆయన దస్తూరితో సేకరించబడి, గ్రంథరూపాన్ని సంతరించుకొంది. 30-40 సంవత్సరాలలోనే భారత దేశమంతా బహుముఖ వ్యాప్తిలోనికి వచ్చింది గీత గోవిందం. వేదాంతం, సాహిత్యం, సంగీతం, నృత్యం కళింగ సంప్రదాయ పద్ధతిలో జయదేవ రచనల్లో తీర్చిదిద్దబడ్డాయి. 24 అష్టపదుల్లో జయదేవకవి వాడిన 13 రాగాలపేర్లు

| | | | |
|---|---|---|---|
| 1. | మాలవరాగం | - | 1,13 అష్టపదులు |
| 2. | భైరవిరాగం | - | 2,17 అష్టపదులు |
| 3. | వసంతరాగం | - | 3,14 అష్టపదులు |
| 4. | రామక్రియారాగం | - | 4,24 అష్టపదులు |
| 5. | ఘూర్జరీరాగం | - | 5,7,11,15,18 అష్టపదులు |
| 6. | మాలవగౌడరాగం | - | 6వ అష్టపది |
| 7. | కర్ణాటరాగం | - | 8వ అష్టపది |
| 8. | దేశాక్షీరాగం | - | 9వ అష్టపది |
| 9. | దేశవరాళీరాగం | - | 10,16,19 అష్టపదులు |
| 10. | గుణకరీరాగం | - | 12వ అష్టపది |
| 11. | బంగాళవరాళీరాగం | - | 21వ అష్టపది |
| 12. | వరాళీరాగం | - | 22వ అష్టపది |
| 13. | విభాసరాగం | - | 23వ అష్టపది ఇమిడ్చి, |



సుధామధురంగా ఆలపించి, ఆనందించడానికి వీలుగా రూపొందించిన జయదేవుని ఘనత అనితర సాధ్యం.

ఒరియా సాహిత్యం మీద 'గీత గోవింద' ప్రభావం ప్రస్ఫుటంగా, బలీయంగా కన్పిస్తోంది. భారతదేశంలో సంస్కృత సాహిత్యంపై జయదేవుని ప్రభావం ఎక్కువస్థాయిలో కన్పిస్తోంది. దేశంలోని వివిధ భాషల్లోని చాలమంది కవులు జయదేవ కవి శైలీ విన్యాసాన్ని అనుకరించారు. ముఖ్యంగా ధరణీధర దాసా అనే అతి ప్రాచీన కవి ప్రజాబాహుళ్యంలో గొప్ప ఆదరణ కల్గినవాడు. ఇతని "గీత గోవింద" ఒరియా అనువాద రచన విభిన్న రీతుల్లో సాగింది. ఇతను 16వ శతాబ్దం వాడని తెలుస్తోంది. సరళమైన ఒరియాలో అనువాదం కావడంతో పామర జనులుకూడా ఎక్కువగా ఆదరించారు. బృందావన్ దాస అనే మరొక కవి 'రసదారధి' అనే పేరుతో ఒరియాలోకి అనువదించాడు. దినకృష్ణ దాస అనే కవి (రాజపుత్రుడు, ఒరిస్సాలో స్థిరపడినవాడు) 17వ శతాబ్దం వాడు. ఇతను తన **'అమృత సాగర్'** అనే గ్రంథంలో భాగవతంలోని 10వ స్కంధం సారాంశమైన గోప లీలను 45 అధ్యాయాల్లో అద్భుతంగా రచన చేశాడు. రాధాకృష్ణ రాసలీలను ఆధారం చేసికొని వ్రాసిన గీత గోవిందం తాను రచించిన భాగవతంలో చేర్చాడు. ఈ రెండు గ్రంథాలు ఒరియా భాషలో బహుళ ప్రచారాన్ని పొందాయి.

ఉత్తర భారతదేశం నుండి వచ్చిన సాధువు, వజారిదాస, ఒరిస్సాలో స్థిరపడ్డాడు. 'అర్ధి గోవింద' అనే పేరుతో ఈయన గీత గోవిందాన్ని ఒరియాలోకి 1624లో అనువదించాడు. ఉధబదాసు అనే కమర్ కులస్థుడు 'గీత'ను ఒరియాలోకి అనువదించాడు. దానికి అతని గురువైన శ్రీ జగన్నాథ మిశ్రా వ్యాఖ్యానం చేశాడు. అనంతరథ వాణిభూషణ్ 'గీత'ను వచనంలో అనువదించాడు. ఇంకా కూడ జగన్నాథ్ మిశ్రా, వాసుదేవ మిశ్రా, పిండికి శ్రీచంచన్, శ్యామసుందర్ భంజా మున్నగువారు 'గీత'ను వచన రూపంలోకి అనువదించారు. ఈ ఒరియా భాషలోనికి అనువదింపబడిన గ్రంథాలన్నీ ఆ భాష, సాహిత్యంపై గొప్ప ప్రభావాన్ని ప్రసరింపచేశాయి. విశేషమేమంటే – ఒరియాలోని కావ్య కవులందరు గీత గోవింద కావ్యశైలినే అనుసరించి రచనలు చేశారు. ఇలా చేయడం మిగతా భారతీయ భాషల్లో కనిపించదు.

జయదేవుని ఇతర రచనలను గురించి చెప్పవలసి వస్తే, భవిష్యపురాణ, దశావతార స్తోత్ర, జ్యోతిష మొదలైన భౌగోళికమైనవే కాకుండా, ధన్వంతరి, ఖగోళ శాస్త్రాలకు సంబంధించిన మరికొన్ని గ్రంథాలను కూడ రచించినట్లు తెలుసుకోబడింది. సుదీర్ఘకాలయానంలో వాటిని అన్వేషించి, నిర్ధారించడం విమర్శకులకు, పరిశోధకులకు మిక్కిలి కష్టసాధ్యమైపోయింది.

జయదేవ కవి ప్రాచీనులలో ఆఖరివాడుగాను, నవీన ఇండో ఆర్యన్ సాహిత్యంలో ప్రథముడుగా నిలబడిపోయాడు. జయదేవుడు ఎంత సామాజిక ప్రేమికుడుగా కన్పిస్తాడో, అంతే అద్వైత ఆధ్యాత్మిక ప్రియుడుగా రాణిస్తాడు. **'గీత గోవిందం'** దీనికి సాక్ష్యంగా నిలుస్తోంది. ఇందులోని సమున్నత సౌందర్యం, శబ్ద శ్రావ్యత, సాహచర్యం, సంగీత మాధుర్యం ఉన్నది ఉన్నట్లుగా మరి ఏ తర్జుమా చేసిన గ్రంథంలోనూ మనకు లభించదు. 'గీత' వల్ల లభించే శృంగార భావనలు (భౌతిక ప్రేమ సంగమం) సాహిత్యపరంగా మరొకచోట ఇంత గొప్పగా లభించడం జరగదనే చెప్పాల్సి వుంది. ఇందులోని



ప్రేమభావన విశ్వజనీనం, విశ్వేశ్వరునిపై ప్రేమకు ప్రతీకగా శిల్పకళా నైపుణ్యంతో శాసనాలు వెలిశాయి.

రాధను, శ్రీకృష్ణుని శక్తిస్వరూపులుగా భావించి, ఇద్దరిని అద్వైత దివ్యమూర్తిగా ప్రబోధించిన శ్రీ రామానుజ, శ్రీ విష్ణుస్వామి, శ్రీ నింబార్కుడు, తదితరుల ఆరాధనా భావాలతో ప్రభావితమైన జయదేవుడు జగన్నాథ స్వామినీ అదే దివ్యదృష్టితో ఆరాధిస్తూ, వారిని 'గీత' లో ప్రతిష్ఠించాడని తెలుసుకోవచ్చు.

ఇంతకుముందు చెప్పినట్లు, జయదేవుని వివాహం గురించి ఒక ఐతిహ్యం ఉంది. ప్రభువు జగన్నాథునికి ఈ జయదేవ భక్తుడంటే అమిత ప్రేమ. దేవశర్మ తన కుమార్తె పద్మావతిని జగన్నాథుని సేవలకై అర్పించుకోవాలని నిశ్చయించుకున్నాడు. ఈ నిశ్చయానికి కారణం కూడా జగన్నాథుడే. శర్మ కలలో కనిపించి, ఆయన కుమార్తె పద్మావతిని తన భక్తుడైన జయదేవునికిచ్చి వివాహం జరిపించమని చెప్పాడని, దానికి అనుగుణంగానే శర్మ పద్మావతిని జయదేవుని కిచ్చి పెండ్లి జరిపించాడని చెప్తారు. తిరుపతి సంస్కృత విశ్వవిద్యాలయ ఉపకులపతి డా॥ హరేకృష్ణ శతపథిగారు ఇలాంటి చాల కొత్త కొత్త విషయాలు వీరి వివాహం గురించి ప్రస్తావించారు. సత్యమేమంటే, జయదేవుడు, పద్మావతి ఇద్దరూ జగన్నాథ సేవలో నిమగ్నులై తరించారు.

జయదేవుడు అమరుడై విశ్వ విఖ్యాతి సాధించాడని డా॥ దీనబంధు మహారాణా ప్రస్తుతిస్తాడు. భారతీయ సామాజిక, మతపరమైన, నైతికపరమైన ఆధ్యాత్మిక విలువలను కాపాడటమే కాదు, పెంచిపోషించిన ఘనత జయదేవునిదే అయినా, ఇది ఈశ్వర సంకల్ప ఫలమేనని ఆయన అభిప్రాయం. జయదేవ పరమ శ్రీకృష్ణభక్తుడే కాదు, అఖండ శక్తివంతుడైన మహాకవి కూడానని శ్లాఘిస్తాడు. శ్రీ దినకృష్ణ జోషి **"కూర్మావతార ప్రవర్"**గా

వర్ణించబడిన జయదేవునికి నృత్య ప్రధాన కుటుంబాలతో సన్నిహితానుబంధం ఉండేదని చెప్తారు.

ఒరిస్సా నృత్యం 2000 సంవత్సరాల ప్రాచీనత కలిగినదిగా వుంది. ఈ నృత్యం ప్రారంభ దశలో సామాజికంగా వున్నా కూడా క్రమంగా దేవాలయాల్లో బహుళ ప్రాచుర్యాన్ని పొందింది. జగన్నాథుని ఆలయంలోనే కాదు ఒరిస్సాలోని అన్ని శైవ, వైష్ణవ, శక్తి దేవాలయాల్లో నిత్యం ఈ నృత్యాలను నిర్వహించేవారు. చివరకు ఇది బౌద్ధ ఆరామాల్లోకి కూడా ప్రవేశించినట్లు తెలుస్తోంది. 1150 నుండి 1300 వరకు గల 150 సంవత్సరాల్లో 'గీత గోవిందానికి నృత్య, సంగీతాలతో పూరీ జగన్నాథుని నిత్య సంసేవన కార్యక్రమాల్లో స్థిరమై పోయింది. ఆదిశంకరుని **'జగన్నాథాష్టకం'** కూడ సంగీత నృత్య సమ్మిళితమై జగన్నాథాలయంలో స్థిర స్థానాన్ని సంపాదించుకొంది. భారతదేశంలో దాదాపు అన్ని హిందూ దేవాలయాల్లో నృత్య సంగీత వేడుకలు సర్వ సాధారణమై పోయాయి. చివరకు జైన మత సన్యాసులు కూడ ఈ నృత్య ప్రదర్శనలకు తోడ్పడ్డారని ప్రతీతి. వీరిలో ప్రసిద్ధిచెందిన సాధు ప్రధాన్ జయదేవుని భువనేశ్వరాలయంలో సన్మానించారు కూడ. దక్షిణ, ఉత్తర భారత దేవాలయాల్లో నృత్య ప్రధానమైన దేవదాసి సంప్రదాయం మొగలాయిల దండయాత్రలతో అదృశ్యమైనట్లు తోస్తోంది.

అస్సాం కళా సాహిత్య రంగాల్లో కూడా 'గీత గోవిందానికి మహనీయ ప్రజాదరణ లభించడం విశేషం. డా॥ హెచ్.ఎన్. దత్తా పరిశీలనలు విస్తారంగా ఉన్నాయి. అస్సాంలో నృత్య సంగీతాలకు అమితాదరణ ఉంది. ఇవి రెండు అత్యంత ప్రాధాన్యత కలిగిన కళాస్వరూపాలు. సంప్రదాయ రీతుల్లో కూడా సుప్రసిద్ధమైనవి. నృత్య సంగీతాలకు అస్సాం స్వర్గసీమగా వర్ణిస్తారు. వివిధ రీతుల్లో ప్రాచీనతను సంతరించుకొని ఉంటాయి కూడా. కాని, ఇటీవలి కాలంలో అస్సామీ నృత్యం భారతీయ శాస్త్రీయ నృత్యంగా



గుర్తించబడింది. అదేవిధంగా అస్సామీ శాస్త్రీయ సంగీతానికి కూడ ప్రజల సాంస్కృతిక జీవనంలో గుర్తింపు లభించింది. శంకర దేవ మరియు మాధవ దేవ అనే సంగీత పండితులు భక్తిగీతాల్ని రచించారు. కన్నడ, కేదార, కళ్యాణి, గౌరి, తోడ, తోడి, వసంత మొదలైన 20 రాగాల్లో వారు భక్తి కీర్తనలను సృష్టించి ఆలపించారు. వైష్ణవ గురువైన **శ్రీశ్రీఅనిరుద్ధ దేవుడు** (1553–1626) అనేక భక్తి గీతాలను రచించగా, వాటికి ప్రజాదరణ గొప్పగా లభించింది. 'గీత గోవింద' కావ్యాన్ని అస్సామీ లోనికి తర్జుమా చేసిన మూడు రచనలు ప్రముఖంగా వున్నాయి. ముగ్గురు వైష్ణవ ఆస్థాన కవులు **– మహారాజా నారాయణ్ ఆస్థాన కవి కవిరామ సరస్వతి, కవిరాజ చక్రవర్తి, ధర్మదేవ భట్టు – వీటిని తర్జుమా చేసిన ప్రముఖులు.** మహారాజ్ శుక్ల ధ్వజ, ధృతిదాసు, రత్నాకర్ కండోరి అను ముగ్గురు వ్యాఖ్యాతలు కూడ 'గీత'పై గొప్ప విమర్శనా గ్రంథాలను రూపొందించారు. కాని, అస్సాంలో బయలుదేరిన నూతన వైష్ణవ సంప్రదాయానికి అనుగుణంగా చాల మార్పులు చేసి వ్రాశారు. ఈ మార్పులు చేర్పులతో వీరి గ్రంథాలు అస్సాంలో ప్రసిద్ధి చెందాయని చెప్పాలి. జయదేవ కావ్యంలోని విభిన్న మధుర భావాల్ని అంగీకరించి స్వీకరిస్తూనే, ఈ అస్సామీ కవులందరు తమ ప్రజల అభిరుచులకు, సాంస్కృతిక, కలాభినివేశాల కనుగుణంగా తమ రచనలను సృష్టించుకోవడం చేతనే, జయదేవుని కీర్తివర్ధిల్లుతూ వచ్చింది. వీరి రచనా వైభవం జనాదరణకు నోచుకొని ప్రజానురంజకంగా స్థిరపడి పోవడం గొప్ప విశేషమనే చెప్పాలి.

ప్రకృతి రామణీయక వర్ణనలకు 'గీత గోవిందం'లో అగ్రస్థానం లభించిందనే చెప్పాలి. ప్రకృతి సౌందర్యాన్ని జయదేవుడు వివిధ భంగిమల్లో, అతి మనోహరంగా, లలిత పదాలతో, సుకుమార శైలిలో వర్ణించి చూపించాడు. ప్రతి దృశ్యం మన కళ్ళముందు కదలాడుతున్నట్లే అనుభూతి చెందుతాం. ఇది సజీవ చిత్రాలుగా రాణించాయి. శైలీ నైపుణ్యమే ఇక్కడ

ప్రభావ చమత్కృతిగా తెలుస్తుంది. బిభూతి భూషణ్ మహాపాత్ర ఈ అంశాన్ని విస్తృతంగా అధ్యయనం చేసి, మంచి వ్యాసాన్ని రచించాడు.

జయదేవ కవి **'గీత గోవిందాన్ని'** ప్రబంధ కావ్యంగా పేర్కొన్నారు. కాని, అందులో కావ్యలక్షణాలు తక్కువగానే ఉన్నాయని చెప్పాల్సి ఉంది. అందులో గీతరచనా సౌష్టవమే అధికంగా గోచరిస్తుంది. సంస్కృత నాటక విధానంలోకి తొంగిచూచినట్లు కనిపిస్తుంది. కావ్యాల్లో ఒకటి దృశ్యం, రెండోది శ్రావ్యం. శ్రావ్య కావ్యం మళ్ళీ మహాకావ్యమని, లఘు కావ్యమని రెండు విధాలు. అందులోంచి విభజన పొందినదే ఖండకావ్యం, గీత కావ్యం, చంపూ కావ్యం మొదలైనవి. దృశ్య కావ్యంలో కూడా రెండు విభాగాలు – నాట్యం, నృత్యం. ఈ దృశ్య కావ్య లక్షణాలన్నింటిని ఎక్కువగానే 'గీత గోవింద' కావ్యానికి అన్వయించవచ్చు. ఇది స్వచ్ఛ గేయం, స్వచ్ఛ నాటకం మధ్యంతర దశలో నడుస్తుంది. 'గీత గోవిందం'. ఈ గేయ నాటిక మిగతా నాటకాల లాగా జనాదరణ పొందిందని చెప్పాలి. రాధామాధవుల దివ్య ప్రేమ గాథ, వారి రాసలీల ప్రధాన వస్తువుగా నడుస్తుంది.

**'గీత గోవిందం'**లో నాటకీయత గురించి చెప్పాల్సి వుంది. ఇందులోని 24 అష్టపదులు 'గీతం'లో నాటకీయ దృశ్యాన్ని ప్రవేశపెట్టడానికి రచించబడ్డాయి. ఈ విషయం వేరువేరుగా వున్న 83 శ్లోకాల్లో విశదమవుతుంది. నాటకంలో నిర్వచించకపోయినా, అందులోని పాత్ర పోషణ, వారి పరస్పర సంభాషణా చాతుర్యాలు నాటకీయతకే మొగ్గదల చూపుతున్నాయి. అందలి సంభాషణలు ఆసక్తికరంగా వుంటాయి. దేహం, మనసు ప్రదర్శించే విన్యాసాలను 'అభినయం' అనుకొన్నపుడు, ఆ అభినయం కూడ ఇందులో ద్యోతకమవుతుంది. 12 సర్గలు, 10 నాటక సన్నివేశాలుగా రూపుదిద్దుకున్నాయి. ఇది గొప్ప రంగస్థల నాట ప్రదర్శనకు బాగా అనువుగా ఉండగలదు.



**మొదటి చిత్రకథ**

(ఉపాఖ్యానము). ఇక్కడ యమునా నదీ తీరంలో తమాల వృక్షచ్ఛాయలో సాయం సమయంలో రాధ, మాధవుడు, నందుడు రంగస్థలం మీద కన్పిస్తారు. చీకటికి భయపడుతున్న శ్రీకృష్ణుని ఇంటికి తీసికొని పొమ్మని నందుడు (శ్రీకృష్ణుని తండ్రి) రాధను కోరుతాడు. వెళ్ళిపోతాడు. తరువాత రాధ మాధవులు ఇద్దరు **'తమాలకుంజ్'**లో ప్రేమాయణాన్ని రహస్యంగా ప్రారంభిస్తారు. ఇదీ ప్రారంభ దృశ్యం. పాత్రధారులు – నందుడు, కృష్ణుడు, రాధ.

**రెండవ చిత్రకథ**

వసంత ఋతువు వస్తుంది. మలయమారుతం. వనంలో సౌరభాల గుబాళింపు పుష్ప సౌందర్యం. కోయిలల మధుర గీతాలు, తుమ్మెదల ఝుంకారాలు, అప్పుడు ప్రేమ బారిన పడిన రాధ తన చెలికత్తెతో ప్రవేశిస్తుంది. చెలికత్తె శ్రీకృష్ణుడు బృందావనంలో గోపికలతో రాసక్రీడలు సల్పుతున్నాడని రాధతో చెప్తుంది. శ్రీకృష్ణుని రాసలీలల్లోని దృశ్యాల్ని, నృత్యాన్ని కూడా వర్ణిస్తూ చెబుతుంది.

**మూడవ చిత్రకథ**

అసూయతో బాధాతప్తయైన రాధ ప్రక్కకు వెళుతుంది. రంగస్థలం మీదనే వుంటుంది. పొదరింట్లో ఒంటరిగా దుఃఖంతో కన్పిస్తుంది. రాధ తన ప్రథమ ప్రేమ పురాణం శ్రీకృష్ణునితో ఎలా జరిగిందో అంతా చెలికి వర్ణించి చెబుతుంది.

**నాలుగవ చిత్రకథ**

శ్రీకృష్ణుడు కూడ ప్రేమ బాధితుడై రాధను అనునయించడానికి ప్రయత్నిస్తాడు. యమునా నదీ తీరంలో ఒక పొదరింట్లో కృష్ణయ్య మన్మథ బాణాల బాధను భరిస్తూ కన్పిస్తాడు. రాధ తన తప్పుడు రాసలీలలతో బాధపడటం వలన తనకు ఈ విరహం బాధిస్తోందని ఆవేశ పడతాడు.

**ఐదవ చిత్రకథ**

దుఃఖాక్రాంతుడై పొదరింటిలో వేదనతో వున్న శ్రీకృష్ణుని దగ్గరకు రాధ చెలికత్తె వస్తుంది. రాధ విరహ వేదనను, దయనీయ స్థితిని శ్రీకృష్ణునికి విన్నవిస్తుంది.

**ఆరవ చిత్రకథ**

రాధ సఖి శ్రీకృష్ణుని కలిసి వచ్చినట్లు రంగస్థలం మీద కన్పిస్తుంది. ఆమె శ్రీకృష్ణుని విరహ వేదనను అమోఘంగా రాధకు తెలుపుతుంది. ఎంతో ఆవేదనతో, ఉత్సుకతతో ఎదురు చూస్తున్న కృష్ణయ్యను యమునా నదీ తీరంలోని పొదరింటిలోనికి వెళ్ళి కలుసుకోమని సలహా ఇస్తుంది.

**ఏడవ చిత్రకథ**

రాధ కోసం ఎదురు చూస్తున్న కృష్ణుడు, నిస్పృహతో వేదనాభరితుడుగా వున్న ఆ సమయంలో రాధ రంగస్థల ప్రవేశం చేస్తుంది. కృష్ణుని కలుస్తుంది. ఇక్కడే సందర్భోచితంగా అమోఘమైన సాత్త్విక భావనలను జయదేవుడు పాడుకొల్పాడు.

**ఏనిమిదవ చిత్రకథ**

రాధ పొదరింట్లో కదలలేని స్థితిలో వుంది. తన ప్రియుని కోసం వేయి కళ్ళతో నిరీక్షిస్తుంది. కాని, కృష్ణుడు సమయానికి రాలేదు. ఆయన ఇతర గోపికాంగనల సరస సల్లాపాల్లో మునిగి తేలుతున్నాడు.

**తొమ్మిదవ చిత్రకథ**

రాత్రి గడిచిపోయింది. పొదరింట్లోని రాధ వద్దకు కృష్ణయ్య వచ్చాడు. కృష్ణయ్య క్షమాపణలు, బ్రతిమాలటాలు, ప్రాధేయపడటాలు – అన్నింటినీ రాధ తిరస్కరిస్తుంది. కాని, రాధ సఖి మాత్రం రాధను అనేక విధాలుగా బ్రతిమలాడుతూ, నెమ్మదిగా ఉండమని ప్రాధేయపడుతోంది. మాధవుని



పాదాలమీద పడి ప్రాధేయపడమని ప్రార్థిస్తుంది. శ్రీకృష్ణుడు మళ్ళీ సాయం వేళ వచ్చి రాధను బ్రతిమాలగా, రాధ సంతోషంతో ప్రేమార్ద్ర హృదయంతో మాధవుని కలుసుకొంటుంది.

**పదవ చిత్రకథ**

రాధామాధవు లిద్దరూ పరిపూర్ణ సంగమానికి ముందు ప్రేమతో సమాధాన పడతారు. అపుడు ఒక నృత్య ప్రదర్శన జరుగుతుంది. ఇందులో రాధామాధవులు, గోపికలు పాల్గొంటారు. ఆ తరువాత రాధ మాధవులు తాత్కాలిక నివాసం (కుంజ)లోకి వెళతారు. మళ్ళీ ప్రేక్షకుల ముందుకు 'యుగళ' రూపంలో వస్తారు.

ఈ విధంగా చూచినట్లయితే **'గీత గోవిందం'** గొప్ప కావ్య నాటకం కాక మరేమౌతుంది? అష్టరసాలు పోషించబడ్డాయి. రూపకాల్లాగా భావించరాదు. దీన్ని **'నాట్య రసిక కావ్యం'** అని చెప్పడమే సమంజసం. ఎందుకంటే రాధామాధవ లీల **'ఒక గీతికా భజన'**గా ఒరిస్సాలో తరువాతి కాలంలో సుప్రసిద్ధమైంది. కనుక 'గీత గోవిందం' కావ్యం అనడంకంటే 'నాటక'మనే చెప్పాలి.

చివరిగా తెలుసుకోవాల్సిన ప్రముఖమైన విషయ మేమంటే పూరీ జగన్నాథుని పరిపూర్ణ సాంస్కృతిక వైభవం 'గీత గోవిందం'లో స్థిరపడి, విశ్వవ్యాప్తమై పరిఢవిల్లుతోంది.

డా॥ కపిల వాత్సాయన్ మాటలతో ముగింపు పలుకుదాం.

"There is no gain saying that, Orissa is the richest repository of the tradition of the Geetha Govinda in the literary, pictorial and performing arts alike."

"So the importance of Gita Govinda isn't limited within the literary sphere of the Indian Society. It has gained the status of eternal

traditional glory securing the permanent ritual status in the temple of Lord Jagannath." P.P. Rao

ఈ విధంగా భక్త జయదేవ మహాకవి యొక్క 'గీత గోవిందం' వైభవ విశేషాలే కాకుండా, వారి విభిన్న జీవిత విశేషాల్ని గూడ క్లుప్తంగా ఇక్కడ పొందుపరచగలిగాను. నాకు ఈ శక్తిని ప్రసాదించిన పరమేశ్వరుని పాదాలను ఈ అక్షరమాలతో అలంకరిస్తున్నాను. శ్రీ జయదేవ మహాకవి పావన నామస్మరణతో నాలో ఆయన రగిలించిన దివ్యస్ఫూర్తి ఈ రచనకు దోహద పడిందని భావిస్తూ, ఆ భక్తాగ్రేసరునకు అంజలి ఘటిస్తూ, ఈ వ్యాసాన్ని ముగిస్తున్నాను.

శుభం భవతు

**- పింగళి పాండురంగరావు**

## అంకితం

జగన్మంగళాకారులైన
శ్రీ పద్మావతీ శ్రీనివాసుని చరణ కమలాలకు
ఈ కృతి సమర్పితం

*సదా శ్రీహరి పాదాశ్రితుడు*

**పింగళి పాండురంగరావు**

# విషయానుక్రమణిక


| | **పుటలు** |
|---|---|
| ముందుమాట | iii |
| ఆముఖము | v |
| భక్త జయదేవ మహాకవి జీవితరేఖలు | x |
| **ప్రథమసర్గ-సామోదదామోదరం** | **1-21** |
| అష్టపది - 1 ప్రళయపయోధి జలే... | 4 |
| అష్టపది - 2 శ్రితకమలా కుచమండల... | 8 |
| అష్టపది - 3 లలితలవంగ లతా... | 11 |
| అష్టపది - 4 చందన చర్చిత... | 16 |
| **ద్వితీయసర్గ - అక్లేశకేశవం** | **22-31** |
| అష్టపది - 5 సంచరదధర సుధా... | 22 |
| అష్టపది - 6 నిభృత నికుంజగృహం... | 26 |
| **తృతీయసర్గ - ముగ్ధమధుసూదనం** | **32-39** |
| అష్టపది - 7 మా మియం చలితా... | 32 |
| **చతుర్థసర్గ - స్నిగ్ధమధుసూదనం** | **40-49** |
| అష్టపది - 8 సా విరహే తవ దీనా... | 40 |
| అష్టపది - 9 స్తన వినిహిత మపి... | 44 |
| **పంచమసర్గ - సాకాంక్ష పుండరీకాక్షం** | **50-61** |
| అష్టపది - 10 వహతి మలయసమీరే... | 50 |
| అష్టపది - 11 రతి సుఖసారే... | 53 |
| **షష్ఠసర్గ - ధన్యవైకుంఠకుంకుమం** | **62-66** |
| అష్టపది - 12 పశ్యతి దిశిదిశి... | 62 |

**సప్తమసర్గ - నాగరనారాయణం** **67-84**

అష్టపది - 13 కథిత సమయేఽపి... 67

అష్టపది - 14 స్మర సమరోచిత... 71

అష్టపది - 15 సముదిత మదనే... 74

అష్టపది - 16 అనిల తరళ కువలయ... 79

**అష్టమసర్గ - విలక్షణ లక్ష్మీపతి** **85-89**

అష్టపది - 17 రజని జనిత గురుజాగర... 85

**నవమసర్గ - ముగ్ధముకుందం** **90-94**

అష్టపది - 18 హరి రభిసరతి... 90

**దశమసర్గ - చతుర చతుర్భుజం** **95-103**

అష్టపది - 19 వదసియది కించిదపి... 95

**ఏకాదశసర్గ - సానంద దామోదరం** **104-117**

అష్టపది - 20 విరచిత చాటువచన... 104

అష్టపది - 21 మంజుతర కుంజతల... 108

అష్టపది - 22 రాధావదన విలోకన... 111

**ద్వాదశసర్గ - సుప్రీత పీతాంబరం** **118-127**

అష్టపది - 23 కిసలయ శయనతలే... 118

అష్టపది - 24 కురు యదునందన... 125

**ఉపసంహారం** **127**

శ్రీజయదేవకవి విరచిత

# గీత గోవిందకావ్యం

(సరళ తెలుగు వచనం)

## ప్రథమ సర్గ

**(సామోద దామోదరం-ఆనంద హృదయుడైన దామోదరుడు)**

**రాధామాధవ రహస్యకేళీస్మరణ రూపం-మంగళాచరణ శ్లోకం**

**మేఘైర్మేదుర మమ్బరం వనభువశ్శ్యామా స్తమాలద్రుమైః**
**నక్తం భీరురయం త్వమేవ తదియం రాధే! గృహం ప్రాపయ ।**
**ఇత్థం నందనిదేశతశ్చలితయోః ప్రత్యధ్వ కుంజ ద్రుమం**
**రాధామాధవ యోర్జయన్తి యమునాకూలే రహః కేళయః ॥ 1**

**తాత్పర్యం :** "ఓ రాధా! ఆకాశంలో మేఘాలు దట్టంగా ఆవరించాయి. అరణ్యభూములన్నీ, చీకటి కానుగచెట్లచే అంధకారబంధురాలైనాయి. కృష్ణుడు రాత్రివేళల్లో ఊరకే భయపడుతుంటాడు. కాబట్టి, నీవే త్వరగా అతణ్ణి ఇంటికి చేర్పించాలి." అని నందుడు, కృష్ణుని రాధకు అప్పగించి పంపగా బయలుదేరి సవిలాసంగా యమునానది ఒడ్డునపోతూ త్రోవలో మనోహరకుంజద్రుమ ప్రదేశాలలో విహరిస్తున్న శ్రీరాధాకృష్ణుల రహస్యక్రీడలు సర్వోత్కృష్టంగా ఉన్నాయి.

**విశేషాలు :** రీతి-వైదర్భి; రసం-శృంగారం; వృత్తి-కైశికీ; లయం-మధ్యం; గుణం-ప్రసాదం; నాయకుడు-అనుకూలుడు; నాయిక-స్వాధీనభర్తృక.

**భాగవతులకు ముక్తిప్రాప్తి-ఇష్టదేవతా ప్రార్థనం**

**శ్లో॥ వాగ్దేవతా చరిత చిత్రిత చిత్త సద్మా**
**పద్మావతీ చరణ చారణ చక్రవర్తీ**

**శ్రీవాసుదేవ రతికేళి కథా సమేత**
**మేతం కరోతి జయదేవకవి ప్రబంధమ్ ॥ 2**

**తా:** మనోహారులైన వాగ్విలాసాలచే చిత్రింపబడిన మనోగృహం కలవాడునూ (అంటే ఇంటిగోడపై చిత్రలేఖనాలు వ్రాయబడి ఉన్నట్లు, సరస్వతీ విలాసాలు కవిహృదయ మందిరంలో నిలిచి ఉన్నాయట) తాను గీతాలాపన చేయగా తన భార్యయైన పద్మావతిచే అర్థానికి తగిన అభినయంతో నాట్యం చేయించేవాడైన జయదేవకవి అనే నేను శ్రీకృష్ణుని శృంగార క్రీడలను వివరించే గీత గోవిందమనే ఈ శృంగార ప్రబంధాన్ని రచిస్తున్నాను.

**భావం :** వాగ్దేవత యైన సరస్వతీ దేవి విలాసాలు తన హృదయంలో కలిగి, గీతాలకు తన భార్య పద్మావతితో నాట్యం చేయించే జయదేవుడను నేను, శ్రీకృష్ణుని శృంగార కేళిని వివరించు ప్రబంధాన్ని రచిస్తున్నాను.

**అధికారి ప్రయోజనం (ఎవరికోసం ఈ గ్రంథం వ్రాయబడిందంటే...?)**

**శ్లో॥ యది హరిస్మరణే సరసం మనో**
**యది విలాస కలాసు కుతూహలమ్ ।**
**మధుర కోమల కాన్త పదావళీం**
**శ్రుణు తదా జయదేవ సరస్వతీమ్ ॥**

**తా:** ఓ సజ్జనులారా! మీ మనస్సు శ్రీమన్నారాయణుని స్మరించడంలో అనురాగం కలిగివుంటే, మీకు శృంగార విద్యల్ని తెలుసుకోవడంలో అభిలాష గలిగివుంటే వింటుంటే వీనులవిందుగా, అనుభవిస్తే అమృతోపమానంగా, ఎంతో మనోహరంగా ఉండే జయదేవకవి శ్రీసూక్తుల్ని ఆలకించండి.

**సమకాలీన కవి పండితప్రశంస-స్వప్రశంస**

**వాచః పల్లవయత్యుమాపతిధర స్సందర్భ శుద్ధిం గిరామ్**
**జానీతే జయదేవ ఏవశరణః శ్లాఘ్యో దురూహ ద్రుతేః ।**



**శృంగారోత్తర సత్ప్రమేయ రచనై రాచర్యగోవర్ధన**
**స్పర్థోకో౭పిన విశ్రుత శ్రుతిధరో ధోయీ కవిక్ష్మాపతిః ॥**

**తా:** ఈ లోకంలో ఉమాపతిధరుడనే కవి అభిప్రాయ గర్భాలైన విశేషణాలు పొందుపరచి గద్యపద్యరూపాలైన కావ్యాలను రచించడంలో నిపుణుడు. జయదేవకవి సందర్భానుసారంగా పదగుంఫన చేయడంలో ఎంతో నేర్పరి. శరణకవి మిక్కిలి గంభీరాలైన భావాలతో ప్రబంధాన్ని రచించడంలో సమర్థుడు. శృంగారరసమే ప్రధానంగా కలిగి, దోషరహితమై మధురమైన కావ్యరచనలో గోవర్ధనాచార్యునికి సమానమైన వాడెవ్వడును లేడు. శ్రుతిధరుని పాండిత్యానికి సమానమైన వాడెవ్వడును లేడు. శ్రుతిధరుని పాండిత్యం జగత్ప్రసిద్ధమే. ధోయీకవి కవులందరికీ శిరోభూషణం.

**అవతారిక :** శ్రీమన్నారాయణుడు భక్తులను అనుగ్రహించడానికి తన సంసిద్ధతను భగవద్గీతలో యిలా స్పష్టీకరించాడు.

**"పరిత్రాణాయ సాధూనాం వినాశాయచ దుష్కృతామ్ ।**
**ధర్మ సంస్థాపనార్థాయ సంభవామి యుగే యుగే ॥**

ఓ అర్జునా! సాధువుల్ని సంరక్షించడానికి, దుర్మార్గుల్ని శిక్షించడానికి, ధర్మాన్నిలోకంలో నిలుపడానికి, ప్రతియుగంలో నేను భూమిపై అవతరిస్తాను. అనే వాగ్దానాన్ని అనుసరించి దివ్యావతారాలను మొట్టమొదట జయదేవకవి ప్రశంసిస్తున్నాడు. ఈ దశావతార ధ్యానకీర్తనంచేత తన గీతగోవిందకావ్యం నిర్విఘ్నంగా పరిసమాప్తి పొందాలని, నర్తకీమణి ప్రదర్శించిన వేళల్లో సామాజికులు తాదాత్మ్యంతో తిలకించి పులకించి పునీత హృదయులవుతారనే అభిలాషతో, ఆశంసతో శ్రీమన్నారాయణుని దశావతార కీర్తిధవళ పతాకాన్ని ఎగురవేస్తున్నాడు.

## అష్టపది - 1
## దశావతార కీర్తిధవళము
### (స్వచ్ఛమైన కీర్తితో ప్రకాశించే దశావతారాల సంకీర్తనం)
**మాలవరాగం - రూపకతాళం**

ప్రళయపయోధిజలే ధృతవా నసి వేదం
విహితవహిత్రచరిత్ర మఖేదమ్.
కేశవ! ధృతమీనశరీర! జయ జగదీశ హరే! (ధ్రువమ్) ౹౹జయ౹౹ 1

క్షితి రతివిపులతరే తవ తిష్ఠతి పృష్ఠే
ధరణిధరణకిణచక్రగరిష్ఠే
కేశవ! ధృతకచ్ఛపరూప! జయ జగదీశ! హరే! ౹౹జయ౹౹ 2

వసతి దశనశిఖరే ధరణీ తవ లగ్నా
శశిని కళంకకలేవ నిమగ్నా
కేశవ! ధృతసూకరరూప! జయ జగదీశ! హరే! ౹౹జయ౹౹ 3

తవ కరకమలే నఖ మద్భుతశృంగం
దళితహిరణ్యకశిపుతమభృంగమ్
కేశవ! ధృతనరహరిరూప! జయ జగదీశ! హరే! ౹౹జయ౹౹ 4

ఛలయసి విక్రమణే బలి మద్భుతవామన!
పదనఖనీర జనితజనపావన!
కేశవ! ధృతవామనరూప! జయ జగదీశ! హరే! ౹౹జయ౹౹ 5

క్షత్రియరుధిరమయే జగదపగతపాపం
స్నపయసి పయసి శమితభవతాపం
కేశవ! ధృతభృగుపతిరూప! జయ జగదీశ! హరే! ౹౹జయ౹౹ 6



వితరసి దిక్షు రణే దిక్పతికమనీయం
దశముఖమౌళిబలిం రమణీయం
కేశవ! ధృతరామశరీర! జయ జగదీశ! హరే! ౹౹జయ౹౹ 7

వహసి వపుషి విశదే వసనం జలదాభమ్
హలహతిభీతిమిళితయమునాభమ్
కేశవ! ధృతహలధరరూప! జయ జగదీశ! హరే! ౹౹జయ౹౹ 8

నిన్దసి యజ్ఞవిధే రహహ శ్రుతిజాతం
సదయహృదయదర్శితపశుఘాతమ్
కేశవ! ధృతబుద్ధశరీర! జయ జగదీశ! హరే! ౹౹జయ౹౹ 9

మ్లేచ్ఛనివహనిధనే కలయసి కరవాలం
ధూమకేతు మివ కిమపి కరాలమ్
కేశవ! ధృతకల్కిశరీర! జయ జగదీశ! హరే! ౹౹జయ౹౹ 10

శ్రీజయదేవకవే రిద ముదిత ముదారం
శృణు శుభదం సుఖదం భవసారమ్
కేశవ! ధృతదశవిధరూప! జయ జగదీశ! హరే! ౹౹జయ౹౹ 11

మీ మనస్సు శ్రీహరిని స్మరించడంలో రసవంతమైతే, రాధాకృష్ణుల విలాస దివ్యక్రీడల్ని తెలుసుకోవాలనే కుతూహలం ఉంటే, మధురాలు, కోమలాలు, మనోహరాలైన అష్టపదుల మాధుర్యాన్ని ఆస్వాదించగోరితే – జయదేవుని ఈ క్రింది అష్టపదులను విని కాని, చదివి కాని రంగస్థలంపై నర్తకీమణి ప్రదర్శించినప్పుడుగాని చూచి ఆనంద హృదయంతో తన్మయులుగా ప్రకాశించండి.

**భావం :** ఓ శ్రీకృష్ణా! జగదీశా! శ్రీహరీ! కేశవా! జలప్రళయ కాలంలో సముద్రంలో మునిగిపోయిన వేదాలను సునాయాసంగా ఓడవలె

పునరుద్ధరించడానికి దివ్య మత్స్య రూపుడవై ఈ భువిపై అవతరించావు. విశ్వప్రభువైన శ్రీహరికి జయము, జయము.

సువిశాలమైన ఈ భూమిని నీ మూపుపై మునిగిపోకుండా దివ్యమైన తాబేలు రూపంలో అవతారమూర్తిగా మోస్తున్నావు. విశ్వప్రభువు శ్రీహరికి జయము జయము.

నీ కోరకొనపై అంటి వున్న ఈ భూగోళం చంద్రునిలోని మచ్చవలె నల్లగా ఉంది. వరాహరూపంలో భూమిని తన కోరలపై నిలిపినవాడవైన ఓ శ్రీహరీ! నీకు జయము జయము.

నరసింహ రూపాన్ని దాల్చిన ప్రభూ! నీ కరకమలాలతో చీల్చబడిన ఆ రాక్షస రాజు హిరణ్యకశిపుని శరీరం తుమ్మెద వలె కనబడుతోంది. నీ వ్రేలి గోరు మొన అద్భుతంగా ప్రకాశిస్తున్నది. శ్రీహరీ! నీకు జయము జయము.

స్వామీ! నీవు బాలబ్రహ్మచారిగా వామనావతారం ధరించి ఆకాశానికి ఎత్తిన పాదంయొక్క గోటికి అంటిన నీరే జనావళికి పరమ పవిత్రమైనది (గంగానదిగా). రాక్షస రాజైన బలి చక్రవర్తిని మూడడుగుల స్థలాన్ని దానంగా ఇమ్మన్నావు. నీ ఆ మూడడుగులతో విశ్వాన్నే కొలిచావు. నీ పరాక్రమమే బలిచక్రవర్తిని పాతాళానికి నెట్టి వేసింది. శ్రీహరీ! నీకు జయము జయము.

మానవ జాతి పాపాలను హరించి, ఇహలోక బాధలను తొలగించి కాపాడటానికి చేతిలో గొడ్డలి ధరించి పరశురామావతార మెత్తిన శ్రీహరీ! నీవు క్రూరులైన క్షత్రియ రాజులను సంహరించావు. రక్తపు మడుగులను సృష్టించి ప్రపంచాన్ని కాపాడావు. అట్టి నీకు జయము జయము.

యుద్ధంలో రావణుని పది తలలను నరికి, దిక్పాలకులను బలిగా ప్రసాదించిన శ్రీరామావతారరూపా! హరీ! జయము జయము.



ఓ బలరామావతారా! నీ నాగలి దెబ్బకు భీతిల్లి పరుగులెత్తిన యమునా నది వలె వున్న నల్లని పట్టుపుట్టం ధరించినవాడా! శ్రీహరీ! నీకు జయము జయము.

యజ్ఞ యాగాదుల్లో పశుబలిని ఖండించిన కరుణామయుడు బుద్ధుని అవతారం దాల్చిన హరీ! వేద ప్రతిపాదిత యజ్ఞయాగాదుల్లో పశువధను నిషేధించిన స్వామీ! శ్రీహరీ! నీకు జయము జయము.

జగదీశా! కలియుగాంతంలో దుష్ట సంహారాన్ని వీరోచితంగా, విజయవంతంగా, ముగించేందుకు తోకచుక్కలాగా భీకరమైన కరవాలం ధరించి కల్కి అవతారంగా ఈ భువిపై అవతరిస్తావు. శ్రీహరీ! నీకు జయము జయము.

ఈ విధంగా జయదేవ కవి ఆది విష్ణువైన శ్రీకృష్ణుని పది అవతారాలను వర్ణిస్తున్నాడు.

శ్రీకృష్ణా! దశావతారధారీ! భక్తులు నీ అవతార రహస్యాల్ని విని, ఆకళింపు చేసుకొని, సర్వ సౌఖ్యాలను, సర్వైశ్వర్యాలను, నిజమైన జీవిత సార్థకతను, జయదేవ కృతమైన ఈ కృతుల ద్వారా, శ్రీహరి కృపావిశేషంతో సాధింతురు గాక!

కేశవా! స్వామీ! ఈ జయదేవ కృతిని విను. జగదీశా! జయము. జయము.

**దశావతార సంకీర్తన - భావ సంగ్రహీకరణం**

**వేదా నుద్ధరతే జగన్నివహతే భూగోల ముద్బిభ్రతే**
**దైత్యాన్దారయతే బలిం ఛలయతే క్షత్రక్షయం కుర్వతే ।**
**పౌలస్త్యం జయతేహలం కలయతే కారుణ్యమాతన్వతే**
**మ్లేచ్ఛాన్ మూర్ఛయ తేదశాకృతికృతే కృష్ణాయతుభ్యంనమః ॥**

**తా:** వేదాలను ఉద్ధరించి, భూమిని మోసి, భూమండలాన్ని పైకెత్తి, హిరణ్యకశిపుని సంహరించి, బలిచక్రవర్తిని మోసంచేసి, క్షత్రియులను చంపి, రావణుని తలలు త్రుంచి, నాగేటిని ధరించి, అహింసను బోధించి, మ్లేచ్ఛులను చంపబోయే దశావతార ధారియైన శ్రీకృష్ణా! నీకు నమస్కారం!

## అష్టపది - 2

## హరివిజయ మంగళాచారము

కావ్యారంభంలో దశావతారమనే మంగళాన్ని సంకీర్తించి, శ్రీకృష్ణుని స్వరూప రూపగుణ విభూతుల్ని నిరూపిస్తూ మంగళాశాసనం చేస్తున్నారు.

**భైరవిరాగం - త్రిపుటతాళం**

శ్రిత కమలా కుచమండల! ధృత కుండల! ఏ
కలిత లలిత వనమాల! జయ జయ దేవ! హరే! (ధ్రువమ్) ॥

దినమణిమండల మండన! భవ ఖండన! ఏ
మునిజనమానస హంస! జయ జయ దేవ! హరే! ॥

కాళియ విషధర గంజన! జన రంజన! ఏ
యదుకుల నళిన దినేశ! జయ జయ దేవ! హరే!

మధు ముర నరక వినాశన! గరుడాసన! ఏ
సురకుల కేళి నిధాన! జయ జయ దేవ! హరే! ॥

అమల కమల దళ లోచన! భవ మోచన! ఏ
త్రిభువన భవన నిధాన! జయ జయ దేవ! హరే! ॥

జనకసుతా కుచ భూషణ! జిత దూషణ! ఏ
సమర శమిత దశకంఠ! జయ జయ దేవ! హరే! ॥

అభినవ జలధర సుందర! ధృత సుందర! ఏ
శ్రీముఖ చంద్ర చకోర! జయ జయ దేవ! హరే! ॥



తవ చరణే ప్రణతా వయమితి భావయ ఏ
కురు కుశలం ప్రణతేషు జయ జయ దేవ! హరే! ॥

శ్రీజయదేవ కవేరిదం కురుతే ముదం ఏ
మంగళముజ్జ్వల గీతం జయ జయ దేవ! హరే! ॥

ఈ అష్టపదిలో జయదేవుడు శ్రీకృష్ణుని స్వరూపాన్ని, గుణవిశేషాల్ని, కార్యాలను మరియు వైభవ విశేషాల్ని వర్ణిస్తున్నాడు.

**భావం :** శ్రీలక్ష్మీదేవిని కౌగిలించిన ప్రభూ! కుండలాలనుధరించిన శ్రీహరీ! పాదపర్యంతం తులసీమాలను ధరించి ప్రకాశించే వాడవు. మానవాళి పాపాలను హరించు దేవా! నీకు జయము జయము.

సూర్యమండలంలో దివ్య తేజస్సుతో వెలుగొందు ప్రభూ! మునుల మనసులనే సరస్సులో విహరించే రాయంచవు. మానవుల ప్రాపంచిక భావాలను తొలగించే ప్రభువువు నీవు. నీకు జయము జయము.

శ్రీకృష్ణా! నీకు జయము. విషధరుడైన కాళీయుని సంహరించి జనులకు ఆనందం కలిగించినవాడవు. యాదవ కులానికి నీవు సూర్యునివంటి వాడవు. యదుకుల కమలానికి శోభ తెచ్చిన సూర్యభగవానుడవు నీవు. జయము. జయము.

శ్రీహరీ! నీవు మధుసూదనుడవు, మురాసురుని మరియు నరకాసురుని వధించిన వాడవు. నీవు గరుడ వాహనం అధిరోహించినవాడవు. దేవతలకు ఎలాంటి ఆటంకాలు కలగకుండా, వారిని కాపాడిన స్వామివి. జయము. జయము.

శ్రీకృష్ణా! నిర్మలమైన తామర రేకులవంటి నేత్రాలు కలవాడా! మా పాపాలను తొలగించి మోక్షం ప్రసాదించు ప్రభూ! ముల్లోకాలు ప్రాదుర్భవించడానికి మూలకారకుడవైన స్వామీ! నీకు జయము. జయము.

శ్రీరామునిగా జానకి వక్షఃస్థలమున శోభిల్లినవాడవు. రాక్షసులను హతమార్చినవాడవు. యుద్ధంలో దశకంఠుని వధించినవాడవు. శ్రీహరీ! నీకు జయము. జయము.

ప్రభూ! ప్రకాశవంతమైన తెల్లని మేఘం వలె అందమైన వాడవు. గోవర్ధన పర్వతాన్ని పైకెత్తిన వాడవు. పండు వెన్నెలలో చకోరపక్షిలా నీవు చంద్రుడవై, శ్రీదేవి సౌందర్యాన్ని ఆనందించే వాడవు. ఆ శ్రీహరి పాదాలకు నా సాష్టాంగ నమస్కారాలు. దేవా! మాకు సకల శుభాలను ప్రసాదించు. నీకు జయము. జయము.

స్వామీ! జయదేవ కవి రచించిన ఈ మంగళ మనోహర గీతం నీకు ఆనందం కలిగించు గాక! నీకు జయము. జయము.

**విశేష వర్ణన**

వేదాలను పునరుద్ధరించి, జగత్తును మోసి, భూగోళాన్ని పైకెత్తి హిరణ్యకశిపుని సంహరించి, బలిచక్రవర్తిని పాతాళానికి పంపి, పరశువు ధరించి క్రూరులైన క్షత్రియ రాజుల మదమణిచి, రావణుని సంహరించి, గోపాలకుడవై, కారుణ్య బోధ చేసి, మ్లేచ్ఛులను మూర్ఛిల్ల జేయగల దశావతారధారివైన శ్రీకృష్ణా! నీకు జయము. జయము.

లక్ష్మీదేవిని ఆలింగనం చేసుకోవడంవల్ల అంటిన కుంకుమ వల్ల శ్రీకృష్ణుని హృదయానురాగం జగతిలో ప్రకాశిస్తున్నదా అనిపిస్తూ మదన కేళీ విలాసం వల్ల ఏర్పడిన స్వేదబిందువులతో వెలుగొందే శ్రీవక్షం మనకు శ్రేయోదాయక మగుగాక!

**ఇది హరివిజయ మంగళాచారమనే ద్వితీయ అష్టపది.**

**శ్రీకృష్ణుని విలాసక్రీడలే భక్తులకు ఇష్టార్థసిద్ధి**

**పద్మాపయోధర తటీ పరిరంభలగ్న**
**కాశ్మీర ముద్రిత మురో మధుసూదనస్య ।**



**వ్యక్తానురాగ మివ ఖేల దనఙ్గ ఖేద**
**స్వేదామ్బుపూర మనుపూరయతు ప్రియం వః ॥**

**తా:** శ్రీదేవి చనుగొండలను కౌగిలించుకోవడంవలన అంటిన కుంకుమం హృదయంలోపల ఉండే అనురాగం వెలుపలికి ప్రకాశిస్తోందా అనేటట్లుగా మన్మథ క్రీడలవలన గలిగిన అలసటచే చెమటల బిందువులు ముత్యాలవలె ప్రకాశించుచుండగా రమణీయమైన శ్రీకృష్ణుని వక్షఃస్థలం మీకును మాకును ఇష్టార్థాలను అనుగ్రహించుగాక!

**శ్రీకృష్ణుని విరహంచే సంతప్త చిత్తయైన రాధావృత్తాంతాన్ని ప్రస్తావిస్తున్నాడు**

**వసన్తే వాసన్తీ కుసుమ సుకుమారై రవయవైః**
**భ్రమన్తీం కాన్తారే బహు విహిత కృష్ణానుసరణామ్**
**అమన్దం కన్దర్పజ్వర జనిత చిన్తాకులతీయా**
**వలద్బాధాం రాధాం సరస మిద మూచే సహచరీ ॥**

**తా:** వసంతకాలంలో కృష్ణుడు దగ్గరలేనందున విరహతాపాన్ని తాళలేక మిక్కిలి బాధ పొందుతూ, బండిగురివింద పూలవలె కోమలాలైన అవయవాలు అరణ్య సంచారంవలన నొప్పిపుడుతుండగా, అనేకరీతులుగా కృష్ణుని వెదకి వెదకి వేసారుతున్న రాధను చూచి ఓదార్చాలనుకొని ఆమెచెలికత్తె, శృంగారరస వర్ణనతో వీనులకు విందయ్యేటట్లుగా ఈ విధంగా చెప్పసాగింది.

## అష్టపది - 3

## మాధవోత్సవ కమలాకరము

మన్మథ బాధచే పీడింపబడుతున్న రాధను ఓదార్చుతూ, కృష్ణుని వనవిహారాలను వర్ణిస్తూ, స్వామి సన్నిధికి వెళ్లవలసిందిగా రాధకు చెలికత్తె ఉపదేశించడం.

## వసంతరాగం - ఆదితాళం

లలిత లవంగ లతా పరిశీలన కోమల మలయ సమీరే ।
మధుకర నికర కరంబిత కోకిల కూజిత కుంజ కుటీరే (ధ్రువమ్) ॥

విహరతి హరిరిహ సరస వసంతే నృత్యతి
యువతీ జనేన సమం సఖి! విరహి జనస్య దురంతే ।

ఉన్మద మదన మనోరథ పథిక వధూజన జనిత విలాపే ।
అలికుల సంకుల కుసుమ సమూహ నిరాకుల వకుళ కలాపే ॥

మృగమద సౌరభ రభస వశంవద నవదళ మాల తమాలే
యువజన హృదయ విదారణ మనసిజ నఖ రుచి కింశుక జాలే ॥

మదన మహీపతి కనక దండ రుచి కేసరకుసుమ వికాసే ।
మిళిత శిలీముఖ పాటల పటల కృత స్మర తూణ విలాసే ॥

విగళిత లజ్జిత జగదవలోకన తరుణ కరుణ కృత హాసే ।
విరహి నికృంతన కుంత ముఖాకృతి కేతక దంతురితాశే ॥

మాధవికా పరిమళ లలితే నవ మాలతి జాతి సుగంధౌ ।
ముని మనసామపి మోహనకారిణి తరుణా కారణ బంధౌ ॥

స్ఫురదతిముక్త లతా పరిరంభణ ముకుళిత పులకిత చూతే ।
బృందావన విపినే పరిసర పరిగత యమునా జలపూతే ॥

శ్రీ జయదేవ భణితమిద ముదయతి హరిచరణ స్మృతి సారం ।
సరస వసంతసమయ వనవర్ణన మనుగత మదన వికారమ్ ॥

వసంత ఋతువులో మన్మథ తాపంతో కలిగిన వ్యథతో మానసిక కల్లోలం చెందిన వాసంతీ పుష్పం వలె, అవయవ సౌకుమార్యంతో,



ముగ్ధమోహనంగా రూపుదిద్దుకున్న రాధ అరణ్యంలో శ్రీకృష్ణుని వెతుకుతోంది. అపుడు రాధ చెలికత్తె ఆమెపై సరసోక్తులు వెదజల్లుతోంది.

**భావం :** లలితాలైన లవంగ తీగెలపై నుండి చల్లని గాలులు వీస్తున్నాయి. కోకిలలు మధురంగా కూస్తున్నాయి. తుమ్మెదలు ఝుంకారం నలుదెసలా మ్రోగుతోంది. వీణా గాన మాధుర్యంతో పొదరిండ్లు పులకించి పోతున్నాయి. ఈ వసంత ఋతువు విరహిణులను అమితంగా బాధిస్తోంది. ఇలాంటి వసంత ఆనందహేలలో శ్రీకృష్ణుడు బృందావనంలో ప్రియురాండ్రతో ఆడుతూ పాడుతూ వినోద విహారం చేస్తున్నాడు.

రాధా! అలాంటి కమ్మని ప్రదేశానికి పోదాం రా! ప్రియులు పరదేశాలకు వెళ్ళిపోవడంతో ప్రియురాండ్ర హృదయాల్లో కామేచ్ఛ తుమ్మెద ఝుంకారంలా విజృంభిస్తోంది. అలాంటి తుమ్మెదలు గల పుష్పగుచ్ఛాలతో తేజోమయమైన వృక్షాలతో విరాజిల్లే వసంత ఋతువులో శ్రీకృష్ణుడు ఆనందిస్తున్నాడు.

కస్తూరి పరిమళం గల చిగురాకులతో కానుగ చెట్లు విలసిల్లుతున్నాయి. యౌవన హృదయాల్ని చీల్చే మన్మథుని గోళ్ళలాంటి మోదుగు పూలతో అందగిస్తున్న వసంతంలో శ్రీకృష్ణుడు విహరిస్తున్నాడు.

మన్మథుని రంగులు కలిగినట్టి బంగారు దండం కేసర కుసుమాలు వికసించగా, పాటల కుసుమాలనే మన్మథ బాణాల అమ్ములపొది గల వసంతంలో, బృందావనంలో శ్రీకృష్ణుడు విహరిస్తున్నాడు.

అడవిలో తెల్లగా పూచిన కరుణ వృక్షాలు, మన్మథ బాధతో సిగ్గువిడిచిన వియోగులను చూస్తూ, హేళన చేస్తున్నట్లనిపిస్తోంది.

విరహ బాధాతప్త హృదయాలను ముక్కలు ముక్కలు చేయగల మన్మథుని కుంతమనే ఆయుధంలా మొగలి పువ్వులు వికసించి ఉన్నాయి. అలాంటి వసంత శోభలో శ్రీకృష్ణుడు విహరిస్తున్నాడు.

మాలతి, మాధవి పుష్ప సుగంధంతో పరిమళశోభితమైన, మహర్షుల హృదయాలను సైతం ఇట్టే ఆకర్షించగల తరుణీమణులకు అకారణంగా బంధువైన వసంత ఋతువులో శ్రీకృష్ణుడు విహరిస్తున్నాడు.

గురువింద, బంతి తీగెల కౌగిలింతల్లో పులకించిపోయే మామిడి చెట్ల సమీపంలో, యమునా జలంతో పవిత్ర కాముకులను సైతం రక్షించే బృందావనంలో శ్రీకృష్ణుడు విహరిస్తున్నాడు.

హరిచరణ స్మరణతో సారవంతమై, యౌవనులకు కామవికారం కలిగించే వసంత కాలపు బృందావన వర్ణనలకు జయదేవకవి గీతౌన్నత్యం, విశిష్టం.

**విశేష వర్ణన**

కొద్దిగా వికసించిన మల్లె తీగనుండి రాలు పుప్పొడితో అడవులను పరిమళభరితం చేస్తూ, గేదంగి పూల సువాసనల్ని అంతటా వ్యాపింపచేస్తున్న మన్మథుని ప్రాణవాయువు లాంటి వసంత ఋతువు హృదయాన్ని దహిస్తోంది.

మామిడి చివుళ్ళను, మకరందాన్ని త్రాగిన తుమ్మెదలు కదలించగా, వాటితో ఆడుతున్న కోకిలలు సుమధుర కాకలీ ధ్వనులు చేస్తుండగా, బాటసారులు తమ తమ ప్రియురాళ్ళ సుఖ సమాగమాన్ని గురించి కలలు కంటూ ఆనందిస్తున్నారు.

ఈ అష్టపదిలో జాత్యలంకారం, నాయిక–మధ్య; నాయకుడు–దక్షిణుడు; రసం–విప్రలంభశృంగారం; లయం–ఛందస్సు; రాగం–వసంతం; తాళం–ఝంపా.

**విప్రలంభ శృంగారానికి ఉద్దీపన విభావసామగ్రులను వర్ణిస్తూ విరహి జనుల్నివేటాడి బాధించే, వాసంత సమీర సౌరభాలను ప్రశంసిస్తున్నాడు.**



**దర విదళిత మల్లీవల్లి చంచత్పరాగ**
**ప్రకటిత పటవాసై ర్వాసయన్ కాననాని ।**
**ఇహ హి దహతి చేతః కేతకీ గంధబంధుః**
**ప్రసర దసమ బాణప్రాణ వద్గంధ వాహః ॥**

**తా:** వసంతకాలంలో మూతి విచ్చిన మల్లెమొగ్గల పుప్పొడి దుమారాలనే బుక్కా చల్లులాటలలో గేదంగి పూల పరీమళాలు దిక్కులనిండా వెదజల్లి ఆఘ్రాణింప జేస్తున్నాయి. దేశదిమ్మరి అని పిలువబడే మన్మథుని ప్రాణవాయువులాగా ఉన్న మలయమారుతం విరహిజనుల హృదయాలను మాడ్చివేస్తూ ఉన్నది కదా!

**వసంతకాలపు రోజులు పాంథులైన విరహిజనాలకు అత్యంత బాధాకరాలని అంగీకరించి వర్ణిస్తున్నాడు.**

**ఉన్మీలన్మధు గంధలుబ్ధ మధుప వ్యాధూత చూతాంకుర**
**క్రీడత్కోకిల కాకలీ కలరవై రుద్గీర్ణ కర్ణజ్వరాః ।**
**నీయన్తే పథికైః కథం కథమపి ధ్యానాను ధానక్షణ**
**ప్రాప్త ప్రాణ సమాసమాగమరసోల్లాసై రమీ వాసరాః ॥**

**తా:** వసంతకాలంలో చిగిర్చిన మామిడి చెట్లలోని మకరందం త్రాగి మత్తెక్కి ఝుమ్మని క్రమ్ము తుండే తుమ్మెదలు, మామిడి చిగుళ్లను మెల్లగా ఆడించాయి. అందులో విహరిస్తున్న కోయిలలు ఎంతో కోపించి అవ్యక్తమధురాలైన కాకలీనిషాదస్వరాలు కూయగా అవి తమకు కర్ణకఠోరాలై సంతాపాన్ని కల్గిస్తూ, ఉన్నాయి. విరహులైన పాంథజనులు తమ ప్రియురాళ్లను స్మరిస్తూ, కలలో ఉన్నవాడికి తదేక ధ్యానంచేత ప్రియాసంగమం కల్గినట్లు తోచగా ఆలింగన, చుంబనాలు మొదలైన భావాలను అనుభవిస్తూ, ఏదోఒకవిధంగా అతికష్టంమీద వసంతకాలపు రోజులను నెట్టుకొని వస్తున్నారు.

**అనేక నారీ పరీరంభ సంభ్రమ**
**స్ఫురన్మనోహారి విలాసలాలనమ్ ।**
**మురారి మారాదుపదర్శయ న్త్యసౌ**
**సఖీ సమక్షం పునరాహ రాధికా ॥**

**తా:** ఆ చెలికత్తె, కాంచెం దూరంలో అనేక స్త్రీలతో కూడి ఆలింగనం శృంగారవిలాసాలను అనుభవిస్తున్న శ్రీకృష్ణుని చూపిస్తూ రాధికతో ఇలా చెప్పసాగింది.

**విశే :** సంభోగ శృంగారం, దక్షిణనాయకుడు.

## అష్టపది - 4

## సామోద దామోదర భ్రమరపదము

### రామక్రియారాగం - యతితాళం

చందనచర్చిత నీలకళేబర! పీతవసన వనమాలీ!
కేలి చలన్మణి కుండల మండిత గండయుగస్మిత శాలీ!
హరరిహ ముగ్ధవధూనికరే విలాసిని విలసతి కేళి పరే! (ధ్రువమ్)

పీన పయోధర భార భరేణ హరిం పరిరభ్య సరాగం ।
గోపవధూరనుగాయతి కాచిదుదంచిత పంచమ రాగమ్ ॥
హరరిహ ముగ్ధవధూనికరే విలాసిని విలసతి కేళి పరే!

కాఽపి విలాస విలోల విలోచన ఖేలన జనిత మనోజం ।
ధ్యాయతి ముగ్ధ వధూరధికం మధుసూదన మదన సరోజం ॥
కాఽపి కపోలతలే మిళితాలపితుం కిమపి శ్రుతిమూలే ।
చారు చుచుంబ నితంబవతీ దయితం పులకైరనుకూలే ॥
హరరిహ ముగ్ధవధూనికరే విలాసిని విలసతి కేళి పరే!

కేళికళాకుతుకేనచ కాచిదముం యమునా జలకూలే ।
మంజుల పంజుల కుంజగతం విచకర్షకరేణదుకూలే ॥



కరతల తాళతరళ వలయావళి కలిత కలస్వన వంశే ।
రాసరసే సహ నృత్యపరాహరిణా యువతీ ప్రశశంసే ॥
హరరిహ ముగ్ధవధూనికరే విలాసిని విలసతి కేళి పరే!

శ్లిష్యతికామపి చుంబతి కామపి రమయతి కామపి రామం ।
పశ్యతిసస్మిత చారుతరా మపరామనుగచ్ఛతి వామామ్ ॥
హరరిహ ముగ్ధవధూనికరే విలాసిని విలసతి కేళి పరే!

శ్రీ జయదేవ భణితమిద మద్భుత కేశవ కేళి రహస్యం ।
బృందావన విపినే లలితం వితనోతు శుభాని యశస్యమ్ ॥

అనేక నారీమణుల కౌగిలింతల సంభ్రమంతో, వివిధ శృంగార చేష్టలతో ఉబ్బితబ్బిబ్బవుతున్న శ్రీకృష్ణుని దగ్గరగా చూపిస్తూ, చెలికత్తె రాధతో మళ్ళీ ఇలా అంటుంది.

**భావం :** ఓ రాధా! నీ శరీరంపై చందనం అలదినవాడు, పీతాంబరం ధరించినవాడు, తులసిమాలతో విరాజిల్లేవాడు, చెవులలోని మణికుండలాలు క్రీడా సమయంలో రెండు చెక్కిళ్ళపై కదలాడుతుండగా, చిరునవ్వులతో, ముగ్ధమోహన వధువులతో శ్రీకృష్ణుడు విలాసంగా ఉన్నాడు.

రాధా! ఒక గోపికాంగన హరిని ప్రేమతో ఆలింగనం చేసుకుని, స్వామితో కలిసి పంచమస్వరంలో గానం చేస్తోంది.

రాధా! అదిగో! అటు చూడు! ఒక ముగ్ధ వధువు, మధుసూదనుడైన శ్రీకృష్ణుని నేత్ర విలాసంతో మన్మథ వికారం పొంది, నిశ్చేష్టురాలై, శ్రీకృష్ణుని ముఖపద్మాన్ని ధ్యానిస్తున్నది.

పెద్ద పెద్ద పిరుదులు గల ఒక యువతి, మోహం తట్టుకోలేక, స్వామి చెవిలో ఏదో రహస్యం చెప్పాలనే నెపంతో దగ్గరకు పోయి పులకింతలతో ఆయన చెక్కిలిని గాఢంగా ముద్దుపెట్టుకుంటోంది.

మరొక కాంత మన్మథ క్రీడలో కోరిక చేత, యమునా నదీ తీరంలోని మంజులమైన పొదరింటిలో వున్న శ్రీకృష్ణుని పట్టుబట్టను పట్టుకొని, తన చేత్తో నీటిలోకి లాగుతున్నది.

పిల్లనగ్రోవిపై శ్రీకృష్ణుడు మధుర నాదాలాపన చేస్తున్నాడు. ఆ పాటకు తగ్గట్టుగా, ఒక బాలిక తన చేతి గాజులతో తాళం వేస్తున్నది. రాసక్రీడలో శ్రీకృష్ణునితో నాట్యంచేస్తూ, ఆయన ప్రశంస పొందుతోంది. హరి ఒక భామను ఆలింగనం చేసుకొంటున్నాడు. మరొక కాంతను ముద్దాడుతున్నాడు. ఒక రామను ఆనందింప చేస్తున్నాడు. మరొక భామ వెంటబడి వెళ్తున్నాడు.

కేశవ కేళీ రహస్యాలతో అద్భుతమైందీ, బృందావనంలో లలితమైందీ, కీర్తికరమైందీ అయిన శ్రీ జయదేవ కవి ఈ గీతం శుభాలను ప్రసాదించు గాక!

**విశేష వర్ణన**

సఖీ! మనోహరాకారుడైన శ్రీహరి గోపాంగనల కందరికి ఆనందాన్నిస్తున్నాడు. నల్ల కలువల శ్రేణుల వలె, శ్యామల కోమలాంగుడు, మన్మథోత్సవం జరిపిస్తూ, గొల్ల భామల బహిరంతరంగాలతో ఆలింగనం చేయబడుచున్నవాడై, శృంగారమూర్తియై ఈ వసంతంలో క్రీడిస్తున్నాడు.

పాములచే భక్షించబడిన వాయువులు, మలయ పర్వతానికి దగ్గరగా తమను పాములు మింగుటచే వచ్చిన బాధలతో మంచునీట మునిగి, ఆ పాముల విషబాధను తొలగించుకొనేందుకు హిమవత్పర్వతం వైపు వెళుతున్నాయి. మనోహరాలైన తియ్యమామిళ్ళ చెట్ల చిగుళ్ళను చూచి, తారస్థాయిలో, సంతోషంగా, మధురంగా 'కుహూ కుహూ' అని కోకిలలు గానం చేస్తున్నాయి.



ప్రేమాతిశయంతో అంధురాలైన రాధ, రాసలీలల్లో విలాసవతులైన గొల్లభామల కౌగిలింతల్లో మునిగి తేలుతున్న శ్రీకృష్ణుని, వారి సమక్షంలోనే అతనిని కౌగిలించుకొని "కృష్ణా! నీ వదనం సుధామయం" అని అన్నది.

ఈ విధంగా పాటల్లో శ్రీకృష్ణుని స్తుతిస్తూ, ఆ నెపంతో ఆయన్ని ముద్దు పెట్టుకొంటుండగా, చిరునవ్వులొలికే మనోహరుడైన శ్రీహరి మన హృదయాలను పరిపాలించు గాక!

**ఇది సామోద దామోదర భ్రమరపదమనే చతుర్థాష్టపది.**

**శ్రీకృష్ణుని రాధ సేవించాలని ప్రేరేపిస్తూ, ఆమె చెలికత్తె కృష్ణుని శృంగారలీలల అతిశయాన్ని వర్ణిస్తూ ఉంది.**

**విశ్వేషా మనురంజనేన జనయన్నానంద మిందీవర**
**శ్రేణీ శ్యామలకోమలై రుపనయ న్నంగై రనంగోత్సవమ్ ।**
**స్వచ్ఛందం వ్రజసున్దరీభిరభితః ప్రత్యఙ్గ మాలిఙ్గితః**
**శృంగారః సఖిమూర్తిమానివ మధౌ ముగ్ధోహరిః క్రీడతి ॥**

**తా:** ఈ వసంత ఋతువులో శ్రీకృష్ణుడు ప్రేమానురాగాలు ముప్పిరి గొంటుండగా గొల్లభామలతో కలసి ఆనందసముద్ర తరంగాలు వెల్లి విరుస్తున్నాడు. నల్ల కలువలను గెలిచేసే నల్లని కోమల అవయవాలతో మదనోత్సవాన్ని ఎంతో రక్తి కటిస్తున్నాడు. మనస్సులో ఉల్లాసం పల్లవింపగా గొల్లపడుచుల మనస్సుల్ని దోచుకుంటూ, యౌవనోల్బణంచేత ఉబ్బెత్తైన వారి ఒక్కొక్క అవయవాన్నిగాఢంగా కౌగిలించుకుంటున్నాడు. విభావాదులైన అంగాలచే మూర్తీభవించిన శృంగారవనం లాగా బృందావన రంగంలో మన్మథ క్రీడలలో చెలరేగుతున్న శ్రీకృష్ణుని, ఓ రాధికా! చూడమ్మా, చూడు చూడు!"

**రాధను వెంటనే బృందావనానికి పొమ్మని చెబుతూ చెలికత్తె మలయమారుతం, విరహిణులకు దుస్సహాలని చెబుతున్నది.**

**నిత్యోత్సంగ వసద్భుజంగకబలక్లేశాది వేశాచలం**
**ప్రాలేయప్లవనేచ్ఛయాఽనుసరతి శ్రీఖండశైలానిలః ।**
**కించ స్నిగ్ధరసాలమౌళిముకుళా న్యాలోక్య హర్షోదయా**
**దున్మీలన్తి కుహూఃకుహూరితికలోత్తాలాఃపికానాంగిరః ॥**

**తా:** పాములు సర్వకాలాలలో తమ వద్దనే కాపురం చేస్తూ, మాటి మాటికి తమను గుటుకు గుటుకుమని మింగుతున్నందున, ఆ విషతాపాన్ని చల్లని మంచునీటిలో మునిగి పోగొట్టుకోవాలని భావించినట్లు, మలయమారుతములు బయలుదేరి హిమపర్వతం దారిలోపోతున్నాయి. వసంతకాలంలో చక్కగా చిగిర్చిన లేమావి చివుళ్లు చూచి గండుకోయిలలు సంతోషమతిశయింపగా పంచమరాగంలో మనోహరంగా కుహూకుహూ అని కూస్తున్నాయి.

**ప్రథమసర్గాన్ని ముగిస్తూ కవి ఆశీర్వచన పూర్వకమంగళం వ్రాస్తున్నాడు**

**రాసోల్లాసభరేణ విభ్రమ భృతా మాభీర వామ భ్రువా**
**మభ్యర్ణం పరిరభ్య నిర్భర మురః ప్రేమాన్ధయా రాధయా ।**
**సాధు త్వద్వదనం సుధామయ మితి వ్యాహృత్య గీతస్తుతి**
**వ్యా జాదుత్కటచుంబిత స్మితమనోహరీ హరిఃపాతువః ॥**

**తా:** రాధ ప్రేమాతిశయంతో మైమరచి, రాసక్రీడల్లో సంతోషంతో పాల్గొంటున్న విలాసవతులైన గోపస్త్రీలు చూస్తున్నారనే భయంకూడ లేకుండ, సిగ్గువదలి, శ్రీకృష్ణుని చేరి గాఢంగా కౌగిలించుకొని, ఓ కృష్ణా! నీ ముఖం సుధామయం కదా! కాబట్టే నీ నోటినుండి వెలువడిన గీతం సుధామయంగా ఉంది. ఏదీ చూద్దాం! ఒక పాటపాడు" అన్నది. గీతాన్ని స్తోత్రం చేసే



మిషతో దగ్గరచేరి అతని అధరోష్ఠాన్ని చుంబింపగా ముద్దులు మూటగట్టే చిరునవ్వు మొగంలో ప్రకాశిస్తుండగా అందరిమనసుల్ని ఆకర్షించే శ్రీకృష్ణుడు మమ్మల్ని మిమ్మల్ని ఎల్లప్పుడు రక్షించుగాక!

**ఇతి శ్రీజయదేవకృతౌ గీతగోవిందే సామోదదామోదరోనామ ప్రథమస్సర్గః**

ఇది శ్రీజయదేవ కృతియైన గీతగోవింద కావ్యంలో సామోద దామోదరమనే పేరుగల మొదటి సర్గము.

* * *

# ద్వితీయసర్గ

## ఆక్లేశ కేశవము

**(స్మరణమాత్రంచేతనే కృష్ణుని సాన్నిధ్యం పొందడం)**

(ప్రథమసర్గలో చెలికత్తె మాటలతో తెలివి తెచ్చుకొన్న రాధిక తన అభిలాష, చింత అనే రెండు అవస్థల్ని గూర్చి చెప్పింది. తన ఎదుటే ఇతరస్త్రీలతో విహరించే కృష్ణుని చూచి ఓర్వలేకుండా ఒక పొదరింటిలో ప్రవేశించి, భౌతిక శరీరస్పర్శకు దూరంగా కేవలం స్మరణమాత్రం చేతనే మన్మథ దశావిశేషాన్ని మనసా పొందుతున్నది.)

**విహరతి వనే రాధా సాధారణ ప్రణయే హరౌ**
**విగళిత నిజోత్కర్షా దీర్ష్యావశేన గతాఽన్యతః ।**
**క్వచి దపి లతాకుంజే గుంజన్మధువ్రతమండలీ**
**ముఖరశిఖరే లీనా దీనాఽప్యువాచ రహస్సఖీమ్ ॥**

**తా :** శ్రీకృష్ణుడు ఇతర గోపస్త్రీలతో ప్రవర్తించిన విధంగానే తనపట్ల కూడ సమానమైన ప్రేమతో బృందావనంలో విహరిస్తూ ఉండటంచూచి తన ప్రత్యేకత తరిగిపోయిందని బాధపడి ఓర్చుకోలేక, తుమ్మెదల ఝుంకారాలచే క్రమ్ముకొన్న ఒక పొదరింటిలో ప్రవేశించి, ఎవరికీ కనబడకుండ రహస్యంగా తన చెలికత్తెతో ఇలా చెప్పసాగింది.

## అష్టపది - 5
## మధురిపు రత్నకంఠిక

**(రాధ రహస్యంగా చెలికత్తెతో చెప్పిన మాటల్ని గీతరూపంగా కవి వివరిస్తున్నాడు.)**

**ఘూర్జరీరాగం - యతితాళం**

**తోడిరాగం - ఆదితాళం**

**ధన్యాసిరాగం- ఆదితాళం**

**దేశాక్షీరాగం - ఆదితాళం**

సంచరదధర సుధా మధుర ధ్వని ముఖరిత మోహన వంశమ్ ।
చలిత దృగంచల చంచల మౌళి కపోల విలోల వతంసమ్ ॥
రాసే హరిమిహ విహిత విలాసమ్ ।
స్మరతి మనో మమ కృత పరిహాసమ్ ॥ (ధ్రువమ్)
చంద్రక చారు మయూర శిఖండక మండల వలయిత కేశమ్ ।
ప్రచుర పురందర ధనురనురంజిత మేదుర ముదిర సువేషమ్ ॥
॥రాసే॥

గోపకదంబ నతంబవతీ ముఖ చుంబన లంబిత లోభం ।
బంధుజీవ మధురాధర పల్లవకలిత దురస్మిత శోభమ్ ॥ ॥రాసే॥
విపుల పులక భుజపల్లవ వలయిత పల్లవ యువతి సహస్రమ్ ।
కరచరణో రసి మణిగణభూషణ కిరణ విభిన్న తమిస్రమ్ ॥ ॥రాసే॥
జలదపటుల చలదిందు వినిందక చందన బిందులలాటమ్ ।
పీన పయోధర పరిసరమర్దన నిర్దయ హృదయ కవాటమ్ ।
మణిమయ మకర మనోహర కుండల మండిత గండముదారం ।
పీతవసన మనుగత మునిమనుజ సురాసుర వర పరివారమ్ ॥
॥రాసే॥

విశద కదంబ తలే మిళితం కలి కలుష భయం శమయంతం ।
మామపి కిమపి తరంగదనంగ దృశా మనసా రమయంతమ్ ॥
॥రాసే॥

శ్రీ జయదేవ భణిత మతిసుందర మోహన మధురిపు రూపం ।
హరిచరణ స్మరణం ప్రతిసంప్రతి పుణ్యవతామనురూపమ్ ॥ ॥రాసే॥

శ్రీకృష్ణుడు బృందావనంలోని స్త్రీలనందరిని తనతో సమానంగా ప్రేమిస్తూ, విహరిస్తుండడం చూచి రాధ ఈర్ష్యకు లోనైంది. తనతో మిగతా

గోపిక లెలా సరితూగుతారు? తన పట్ల శ్రీకృష్ణుడు అధిక ప్రేమను చూపాలి కదా! అటువంటి ప్రత్యేక గుణాన్ని చూపని శ్రీకృష్ణుని మీద రాధ అలిగి, సహించలేక ఈర్ష్యతో మరోచోటికి వెళ్ళిపోయింది. తుమ్మెదల ఝుంకార నాదాలతో నిండిన మరొక పొదరింట్లో చేరి, దుఃఖంతో ఏకాంతంగా తన చెలికత్తెతో ఇలా అంటుంది.

**భావం :** సఖీ! సుధామధురమైన అధరాల నుండి వెలువడే ధ్వనితో సమ్మోహనమైన పిల్లనగ్రోవి కలవాడు, తలపై కదలుతున్న పింఛం కలవాడు, చెక్కిళ్ళపై కదలాడు కర్ణాభరణాలు కలవాడు, రాసక్రీడలో క్రీగంటితో గోప కాంతలను చూస్తూ, నన్ను చూచి పరిహసించేవాడు అయిన శ్రీహరినే నా మనస్సు సదా స్మరిస్తోంది.

ఇతర గోప కాంతలతో విచ్చలవిడిగా విహరిస్తూ, తనంటే లక్ష్యం లేకుండా ప్రవర్తించే శ్రీకృష్ణుని నేరానికి నేను బాధపడుతూ కూడ, నా మనస్సు అతణ్ణే స్మరిస్తోంది.

నల్లని కేశాలతో, గుండ్రంగా చుట్టుకొని ఉన్న నెమలి పింఛం, హరివిల్లు చుట్టుకొన్న మేఘంలా కన్పిస్తోంది. అటువంటి శ్రీకృష్ణుడే నాకు జ్ఞాపకం వస్తున్నాడు. చెలీ! గోపికల ముఖ చుంబనాల్లో మిక్కిలి ఆసక్తి కలవాడు, బందూ పుష్పసమమైన అధరంపై చిరునవ్వు చిందించేవాడు అయిన ఆ శ్రీకృష్ణునే నా మనసు ఎప్పుడూ స్మరిస్తోంది.

వేనవేల గోపకాంతల వెచ్చని కౌగిళ్ళలో సంతోషంతో పులకించి పోతున్నవాడు, చేతులు, పాదాలు, వక్షఃస్థలంపై కాంతులీనే మణిమయ ఆభరణాలు ధరించినవాడు, ఆ ఆభరణాలు వెలుగుతో కటిక చీకటినే పారద్రోలే శ్రీకృష్ణుని నా మనసు స్మరిస్తోంది.

మేఘమాలికలో నడయాడే చంద్రునిలా తన లలాటంలో చందనపు బొట్టుకలవాడు, గోపకాంతల కఠినకుచ మర్దనం దయ కోల్పోయిన హృదయ కవాటం కలవాడు అయిన ఆ శ్రీకృష్ణునే నా మనస్సు సదా స్మరిస్తోంది.



మణిమయాలైన కుండలాలతో ప్రకాశించే గండస్థలం కలవాడు, పీతాంబరం ధరించినవాడు, ఋషులు, మనుష్యులు, సురాసుర పరివారాల చేత అనుసరించబడేవాడు అయిన శ్రీకృష్ణుని నా మనస్సు సదా స్మరిస్తోంది.

విశాలమైన కదంబ వృక్షం దగ్గర నన్ను కలుసుకోవడానికై ఎదురుచూస్తూ నిలబడి వున్నవాడు, కలియుగ భీకర కాలుష్యం నిర్మూలించేవాడు, కాలం నేర్పే చూపుతో, మనస్సుతో నన్ను రమింపజేసేవాడు అయిన శ్రీహరినే నా మనస్సు స్మరిస్తోంది.

అతిలోక సుందరుడైన, మోహనాంగుడైన మధురిపుడగు ఆ శ్రీకృష్ణుని అపురూప శోభను వర్ణించే ఈ జయదేవ కవి గీతం ఈ కాలంలో పుణ్యవంతుల హరిచరణ స్మరణకు మిక్కిలి యుక్తంగా వున్నది.

**ఇది మధురిపురత్నకంఠిక అనే పంచమాష్టపది.**

**రాధ మొదట్లో శ్రీకృష్ణుని గురించి భావించిన వాన్నే మళ్లీ ఇంకొకవిధంగా చెబుతున్నది. ఇది స్త్రీల మనస్తత్త్వ సూచకం**

**గణయతి గుణగ్రామం భామం భ్రమాదపి నేహతే**
**వహతి చ పరితోషం దోషం విముంచతి దూరతః ।**
**యువతిషు వల తృష్ణే కృష్ణే విహారిణి మాం వినా**
**పునరపి మనో వామం కామం కరోతి కరోమి కిమ్. ॥**

**తా:** సఖీ! నా మనస్సు స్వాధీనంలో లేక విపరీతంగా ప్రవరిస్తూ ఉంది. చూచావా! నిన్ను వదలి పేరాసతో ఇతరస్త్రీలతో క్రీడించే మహాపరాధియైన ఆ శ్రీకృష్ణునే మరల కోరుతోంది. వానిగుణాలనే లెక్కిస్తుంది. దోషాలను కొంచెం కూడ లెక్కపెట్టదు. పొరపాటుననైనా వానిపై కోపగించదు. ఇంతేగాక కృష్ణునే తలుస్తూ! ఎంతో సంతోషిస్తున్నది. ఇటువంటి వైపరీత్య మింకెక్కడైనా ఉందా!

## అష్టపది - 6
## అక్లేశకేశవ మంజరీ తిలకము

**(రాధ కామజ్వరంచే మిక్కిలి సంతప్త మానసయై చెలికత్తెనే దూతగా భావించి తనకోరికల నన్నింటినీ వెల్లడిస్తోంది.)**

**గుణక్రియారాగం - ఏకతాళం**

**(మాలవగౌడ రాగేణ ఏకతాళీ తాళేన చగీయతే)**

నిభృత నికుంజ గృహం గతయా నిశి రహసి నిలీయ వసంతం ।
చకిత విలోకిత సకల దిశా రతి రభస భరేణ హసంతమ్ ॥
సఖి! హే! కేశిమథన ముదారం 1

రమయ మయా సహ మదన మనోరథ భావితయా సవికారమ్
(ధ్రువమ్)

ప్రథమ సమాగమ లజ్జితయా పటు చాటు శతైరనుకూలం ।
మృదు మధురస్మిత భాషితయా శిథిలీకృత జఘన దుకూలమ్ ॥
సఖి! ... ... ... ... ... సవికారమ్ 2

కిసలయ శయన నివేశితయా చిరమురసి మమైవ శయానం ।
కృత పరిరంభణ చుంబనయా పరిరభ్య కృతాధర పానమ్ ॥
సఖి! ... ... ... ... ... సవికారమ్ 3

అలస నిమిలిత లోచనయా పులకావలి లలిత కపోలం ।
శ్రమజల సకల కళేబరయా వర మదన మదాదతిలోలమ్ ॥
సఖి! ... ... ... ... ... సవికారమ్ 4

కోకిల కలరవ కూజితయా జితమనసిజ తంత్ర విచారం ।
శ్లథ కుసుమాకుల కుంతలయా నఖలిఖిత ఘన స్తనభారమ్ ॥
సఖి! ... ... ... ... ... సవికారమ్ 5



చరణ రణిత మణి నూపురయా పరిపూరిత సురత వితానం ।
ముఖర విశృంఖల మేఖలయా సకచగ్రహ చుంబన దానమ్ ॥
సఖి! ... ... ... ... ... సవికారమ్ 6

రతి సుఖ సమయ రసాలసయాదర ముకులిత నయన సరోజం ।
నిస్సహ నిపతిత తనులతయా మధుసూదన ముదిత మనోజమ్ ॥
సఖి! ... ... ... ... ... సవికారమ్ 7

శ్రీజయదేవ భణిత మిదమతిశయ మధురిపు నిధువన శీలం ।
సుఖముత్కంఠిత గోప వధూ కథితం వితనోతు సలీలం ॥
సఖి! ... ... ... ... ... సవికారమ్ 8

**భావం :** ఓ ప్రియమైన చెలీ! నా మనస్సు వింత వింత భావాలతో ముప్పిరిగొంటున్నది. కృష్ణుడు నన్ను విడిచి ఇతర గోపికలతో క్రీడిస్తున్నాడు. ఇతర యువతులపై ఎంతో తృష్ణ కలిగివున్నాడు. అయినప్పటికి నాకు కోపం రావడం లేదు. నా మనస్సు అతణ్ణే మరల మరల కోరుకొంటూ ఉంది. అతని గుణాన్నే గానం చేస్తోంది. భ్రమతో అతని దోషాలన్నిటిని మరచిపోతున్నాను. పైన సంతోషం, లోన దుఃఖం కలుగుతోంది. ఏం చేయాలి సఖీ?

ఒక సాయం సమయంలో నేను ఒంటరిగా పొదరింట్లో ఉన్నాను. ఆ రాత్రి వేళ నాతోగూడ రహస్యంగా అక్కడే దాగి ఉన్నాడు. నేను భయంతో నలుదిక్కులు చూచాను. నా మనస్సులో ఎన్నో మదన వాంఛలు ప్రబలంగా దాగి ఉన్నాయి. శ్రీకృష్ణుడేమో ఉదారుడు, అనేక శృంగార వికారి. అతని ప్రేమతో నేను ఉద్వేగానికి లోనయ్యాను. ప్రేమతో నావైపు చూచి అందంగా నవ్వాడు. నన్ను పట్టుకొని రతి సలిపేటట్లు శ్రీహరిని చక్కదిద్దవే!

చెలీ! మా మొదటి కలయికలో సిగ్గుపడుతున్న నన్ను ఏవేవో మధురమైన మాటలు చెప్పి అలరించారు. తియ్యతియ్యని చిరునవ్వుతో నన్ను మాటల్లో

దింపి, కొంటెగా నా నడుముకు గల వస్త్రాలను లాగుతాడు. చిగురుటాకుల శయ్యపై పడుకొని వున్న నా వక్షఃస్థలంపైనే చాలా సేపు విశ్రమించేవాడు. నన్ను కౌగిలించుకొని తన అమృత చుంబనాలతో అధర పానం చేసి పరవశింపజేసేవాడు.

కండ్లు మూసుకొని అలసటతో, చెమటలతో ఆనందపడుతున్న నన్ను చూచి అతని చెంపలు గగుర్పొడిచాయి. అతని చెంపలు నేను తాకినపుడు, నా శరీరం అనందాంబుధిలో ఓలలాడింది. కృష్ణుని రాసక్రీడల్లో నా శరీరం తడిసి ముద్దయింది. అతడు కామోద్రేకంలో పరవశించేవాడు.

కోకిలలు కిలకిలారావాలు చేస్తుండగా, రతి క్రీడాంతంలో శ్రీకృష్ణుడు మన్మథ క్రీడాప్రవీణుడుగా నన్ను మైమరపించేవాడు. నా కురులు చెదిరి, పూలు రాలిపోయేవి. నా ఘనమైన స్తనాలపై అతడు తన గోళ్ళతో వ్రాసేవాడు.

నా చరణాల నూపురాలు ధ్వనిస్తుండగా, నాతో సంభోగించేవాడు. నా నడుముకు గల ఒడ్డాణం శబ్దం చేస్తుండగా, ఊడిపోయిన నా కొప్పు పట్టుకొని నన్ను చుంబిస్తూ, నా కోరికను తీర్చుతాడు.

సంభోగానంతరం కలిగిన అలసటతో ఆనందించే నాపైకి కొంచెం ముకుళించేవాడు, నిస్సహాయంగా పడివున్న నా శరీరంలో మదన వాంఛను తిరిగి రగిలింపజేసేవాడునూ అయిన ఆ మధుసూదనునితో నన్ను రమింప చేయవే, చెలీ!

జయదేవకవిచే రచింపబడి, మధురిపుడైన శ్రీకృష్ణుని అధిక రతిశీలం కలిగిన శృంగార లీలలు అవగతం చేసేది, అధికాసక్తి గల గోప వధువైన రాధ ద్వారా చెప్పబడిందీ అయిన ఈ గీతం శుభప్రదం అగు గాక!

**విశేష వర్ణన :**

చేతిలో విలాసవంతమైన వేణువు కలవాడు, వంకర తీగల కనుబొమలు గల గోపికా బృందంపై ఆసక్తి చూపేవాడు, స్వేదబిందువులతో అందగించిన



నునుచెక్కిళ్ళు గలవాడు, నన్ను చూచి సిగ్గుపడేవాడు, చిరునవ్వుల అందంతో అమృతం ప్రసాదించేవాడు అయిన శ్రీహరిని (గోవిందుని) బృందారణ్యంలో చూస్తున్నాను, ఆనందిస్తున్నాను.

సుందర పుష్పశోభితమైన అశోక వృక్షాలు కలిగిన సరస్సులతో శోభిల్లే ఉద్యానవనంలో నుండి వచ్చే చల్లని గాలి సైతం నన్ను బాధిస్తోంది. తుమ్మెదల సుస్వరాలతో రమణీయ శిఖరాలు గల మామిడి చెట్ల మొగ్గలు సైతం నాకు సుఖాన్నివ్వడం లేదు.

అనన్య భావగర్భితమైన చిరునవ్వులతో, కామోద్రేకంతో జారిపోతున్న కొప్పులు కలిగి, పైకెగసే కనుచూపులు కలిగి, ఏదో నెపంతో చేతులు పైకెత్తి, తమ స్తనాలను చూపుతున్న గోపికలను రహస్యంగా చూచి, వారి ప్రేమానురాగాల్ని గ్రహించి, వేరే ఆశలు విసర్జించి, అంతర్ముఖుడైన ముగ్ధమనోహరుడు కేశవుడు మన దుఃఖాన్ని తొలగించు గాక!

**ఇది అక్లేశకేశవమంజరీ తిలకమనే షష్ఠ అష్టపది.**

**రాధ శ్రీకృష్ణుని దివ్యరూప విలాసాలను ధ్యానించి, ధ్యానించి మనోవీథిలో బృందావన విహారిని భావించి, భావించి దుఃఖోద్విగ్నయై తన చెలికత్తెతో ఇలా చెబుతున్నది.**

**హస్త స్రస్త విలాస వంశ మనృజు భ్రూవల్లి మద్వల్లవీ**
**బృందోత్సారి దృగంత వీక్షిత మతి స్వేదార్ద్ర గండస్థలమ్ ।**
**మా ముద్వీక్ష్య విలజ్జితం స్మిత సుధా ముగ్ధాననం కాననే**
**గోవిందం వ్రజసుందరీ గణవృతం పశ్యామి హృష్యామి చ ॥**

**తా:** ఓ సఖీ! బృందావనంలో కృష్ణుడు గోపికాస్త్రీలతో యథేష్టంగా క్రీడిస్తూ ఉండగా, నేను తటాలున ఆ ప్రదేశానికి పోవడం జరిగింది. హఠాత్తుగా నన్ను చూచిన వెంటనే, కృష్ణుని చేతిలోని పిల్లనగ్రోవి జారి క్రిందపడింది.

చెక్కిళ్లు ఎక్కువగా చెమర్చసాగాయి. తన చుట్టూ చుట్టుకొని ఉండే గొల్లభామల్ని దూరంగా పొమ్మని కనుసైగ చేశాడు. సిగ్గుపడి ముగ్ధగోవిందుని చూచి సంతోషించాలా? కోపగించాలా? తెలియడంలేదు.

**విశే :** విప్రలంభశృంగారం, దక్షిణనాయకుడు, పాంచాలీరీతి.

**శ్లో॥ దురాలోకస్తోక స్తబక నవకా శోకలతికా**
**వికాసః కాసారోపవన పవనోఽపి వ్యథయతి**
**అపి భ్రామ్యద్భృంగీరణిత రమణీయా నముకుళ**
**ప్రసూతి శ్చూతానాం సఖి। శిఖరిణీం సుఖయతి ॥**

(ఇప్పుడు విప్రలంభశృంగార భావాలను చెబుతున్నాడు)

**తా:** ఓ సఖి! విరహిజనులకు చూడటానికి కూడ శక్యంకాని అత్యంత వేదనను కలిగించే నీయశోక లతల వికసింపజేస్తూ ఉద్యానవనాలలోని కొలనులనుండి వచ్చే ఈ పిల్లవాయువులు నన్నెంతో బాధిస్తున్నాయి. ఇంతేగాక, "ఎప్పుడెప్పుడు వికసిస్తుందా?" మకరందమెప్పుడు జుర్రుకొందామా? అనే అత్యుత్కంఠతో పైభాగంలో క్రమ్ముకొని ఉండే తుమ్మెదలు జుమ్మని ఝుంకారాలు చేస్తుండగా ఎంతో మనోహరాలై కొనలు దీరి ప్రారంభదశలోనే ఉండే ఈ మామిడిమొగ్గలుసైతం కాసంతకూడ నాకు సుఖాన్ని కల్గింపకుండా ఉన్నాయి.

(కవి ఈ రెండవ సర్గాన్ని ముగిస్తూ భక్తజనానికి మంగళాశాసనం చేస్తున్నాడు.)

**సాకూతస్మిత మాకులాకుల గళద్ధమ్మిల్ల ముల్లాసిత**
**భ్రూవల్లీ కమలీక దర్శిత భుజా మూలోర్ధ్వ హస్త స్తనం।**
**గోపీనాం నిభృతం నిరీక్ష్య గమితాకాంక్షశ్చిరం చిన్తయ**
**న్నంతర్ముగ్ధ మనోహరం హరతు వః క్లేశం నవః కేశవః ॥**

(ఇప్పుడు విప్రలంభశృంగార భావాలను చెబుతున్నాడు)



**తా:** ఓ భాగవతులారా! బృందావనంలో గోపికలు సాభిప్రాయంగా చిరునవ్వు నవ్వడం, కామోద్రేకంచే మాటిమాటికి చిక్కుపడి కొప్పులు వీడిపోతూ ఉండగా – ముడివేసుకొనే నెపంతో బాహువు లెత్తి బాహు మూలాలను స్తనాలను కనబడేవిధంగా గల భంగిమలతో కనుబొమలెత్తి చూస్తూ ఉండడం మొదలైన శృంగార చేష్టలను రహస్యంగా కనిపెట్టి, గోపికలు తనపై ఎంతో అనురాగం కలిగి ఉన్నారని నిశ్చయించి ఇతరాశలన్నీ వదలి చిరకాలం ఒకేచోట నిలబడి ఆలోచిస్తూ చూచే వాళ్లకు ఆ ప్రదేశానికి క్రొత్తగా వచ్చినవానిలాగా శ్రీకృష్ణుడు కరుణించి మన కష్టాలను పోగొట్టుగాక!

**ఇతి శ్రీజయదేవకృతౌ గీతగోవిందే అక్లేశ కేశవోనామ ద్వితీయస్సర్గః**

ఇది శ్రీజయదేవ కృతమైన గీతగోవింద కావ్యంలో అక్లేశ కేశవమనే పేరుగల రెండవ సర్గ.

* * *

# తృతీయ సర్గ

## ముగ్ధ మధుసూదనము

(ఒకటి, రెండుసర్గలలో రాధకు శ్రీకృష్ణునిపై అత్యంత అనురాగం ఉందని చక్కగా నిరూపించి, ఈ సర్గలో శ్రీకృష్ణునికి రాధపై ఎంతో అనురాగం ఉందని నిరూపిస్తున్నాడు.)

**శ్లో॥ కంసారి రపి సంసార వాసనా బంధ శృంఖలామ్ ।**
**రాధా మాధాయ హృదయే తత్యాజ వ్రజసుందరీః ॥**

**తా :** శ్రీకృష్ణుడు కూడ సంసారంలో కట్టిపడవేయడానికి సంకెళ్లవంటిదైన (అంటే రాధావిలాసాలను అనుభవించేసరికి సంసారబంధంలో ఎటువంటివాడైనా బంధింప బడుతాడనేది నిశ్చయం.) రాధను మనస్సులో తలుస్తూ ఇతరగోపికలనందరినీ వదలిపెట్టాడు.

(శ్రీకృష్ణుని విరహావస్థలోని చేష్టల్ని వివరిస్తున్నాడు.)

**శ్లో॥ ఇతస్తత స్తా మనుసృత్య రాధికా**
**మనంగ బాణ వ్రణఖిన్న మానసః ।**
**కృతాను తాప స్సకళింద నందినీ**
**తటాంత కుంజే విషసాద మాధవః ॥**

**తా :** శ్రీకృష్ణుడు రాధావియోగాన్ని సహింపలేక మేనంతా గాయాలయ్యేటట్లు మన్మథ బాణాలచే కొట్టబడి మనస్సులో ఎంతో దుఃఖించి, "రాధనెందుకు కోపించినాను? అని పశ్చాత్తాపం పొందుతూ, రాధను బృందావనంలో అక్కడక్కడా వెదకి వెదకి వేసారి ఆమెను కానరాకపోవడంచేత, యమునానదీ సమీపంలోగల ఒక పొదరింటిని చేరి, ఎంతో విషాదానికి లోనైనాడు.

## అష్టపది - 7
## ముగ్ధమధుసూదన హంసక్రీడనం

**(శ్రీకృష్ణుని విరహతాపాన్ని గీతరూపంగా ఆవిష్కరిస్తున్నాడు)**

**భూపాళరాగం - ఆదితాళం**

**(ఘూర్జరీరాగ యతితాళాభ్యాం గీయతే ॥ ఘూర్జరీరాగం యతితాళంలో పాడబడుతున్నది.)**

మా మియం చలితా విలోక్య వృతం వధూ నిచయేన ।
సాపరాధతయా మయాఽపి న వారితాఽతిభయేన ॥
హరి హరి హతాదరతయా సా గతా కుపితేవ (ధ్రువమ్) 1

కిం కరిష్యతి? కిం వదిష్యతి? సా చిరం విరహేణ ।
కిం ధనేన జనేన కిం మమ జీవితేన గృహేణ ॥
హరి ... ... ... ... ... కుపితేవ 2

చింతయామి తదాననం కుటిల భ్రూ కోపభరేణ ।
శోణపద్మమివోపరి భ్రమతాంఽఽకులం భ్రమరేణ
హరి ... ... ... ... ... కుపితేవ 3

తామహం హృది సంగతామనిశం భృశం రమయామి ।
కిం వనేఽనుసరామి తామిహ కిం వృథా విలపామి ॥
హరి ... ... ... ... ... కుపితేవ 4

తన్వి! ఖిన్న మసూయయా హృదయం తవాకలయామి ।
తన్న వేద్మి ఉతో గతాఽసి న తేన తేఽనునయామి ।
హరి ... ... ... ... ... కుపితేవ 5

దృశ్యసే పురతో గతాగతమేవ మే విదధాసి ।
కిం పురేవ ససంభ్రమం పరిరంభణం న దదాసి ॥
హరి ... ... ... ... ... కుపితేవ 6

క్షమ్యతామపరం కదాపి త వేదృశం న కరోమి ।
దేహి సుందరి దర్శనం మమ మన్మథేన దునోమి ॥
హరి ... ... ... ... ... కుపితేవ 7

వర్ణితం జయదేవకేన హరేరిదం ప్రవణేన ।
బిందుబిల్వ సముద్ర సంభవ రోహిణీ రమణేన ॥
హరి ... ... ... ... ... కుపితేవ 8

**భావం :** మదన బాణాల తాకిడితో కలిగిన గాయాల వల్ల వేదన అనుభవిస్తున్న మనస్సు గల శ్రీకృష్ణుడు తాను రాధను బాధించానే అని పశ్చాత్తాప పడుతున్నాడు. రాధికను ఇక్కడ అక్కడ వెదకి, ఆమెను కనుక్కోలేక యమునా నదీ తీరంలో ఒక పొదరింటిలో కూర్చుని ఉన్నాడు.

గోపికా సమూహం నన్ను చుట్టుముట్టి ఉండటం చూచి రాధ బాధపడి, అలిగి వెళ్ళిపోయింది. నేను అపరాధిని కనుక భయంతో నేను ఆమెను వారించలేక పోయాను. నా పట్ల ఆమెకు గౌరవం నశించి కోపంతో వెళ్లిపోయింది.

చిర విరహంతో పాపం! ఆ రాధ ఏం చేయగలదు? ఏమనగలదు? ఇక నాకు సంపదతో పనేమి? ఇంటితో పనేమి? రాధ నా కోసం లేకుంటే, ఇంక నాకీ జీవితంతో ఏం పని?

నేను ఆమె ముఖాన్ని చూస్తున్నాను, ఆలోచిస్తున్నాను. కోపభావంతో మెలికలు తిరిగిన ఆమె కనుబొమ్మలతో, పైన తిరిగే తుమ్మెదల రొదతో చీకాకుపడే ఎర్ర తామరలా వున్న రాధ ముఖాన్ని స్మరిస్తున్నాను.

ఈ వనప్రదేశంలో నేను రాధకోసం ఎందుకు వెదుకుతున్నాను? ఈ అడవిలో ఎందుకు విలపిస్తున్నాను? రాధ నా హృదయవాసిని గదా! నేను ఆమెను తప్పక సంతోష పరుస్తాను.

ఓ సౌందర్యవతివైన రాధా! నేను చేసిన అపచారంవల్ల నువ్వు అసూయతో దుఃఖితురాలివైనావని భావిస్తున్నాను. లేకుంటే, నువ్వు నన్నెందుకు విడిచి వెళ్ళిపోతావు? నేను బ్రతిమాలుతున్నాను, నమస్కరిస్తున్నాను, నాకు నీ ప్రవర్తన అర్థం కావడం లేదు.



నువ్వు నా సమక్షంలో కనపడుతున్నావు. అటూ ఇటూ వస్తూ పోతూ ఉన్నావు. కాని, పూర్వం లాగ నాకు తన్మయత్వం కలిగేలా నన్ను ఎందువల్ల కౌగిలించుకోవడం లేదు?

ఓ సుందరీ! రాధా! నన్ను క్షమించు. ఇలాంటి తప్పు మళ్ళీ చేయను. మన్మథ బాధ తాళలేకున్నాను. నాకు దర్శనమివ్వు.

బిందుబిల్వ వంశవారాసి సుధాకరుడు, హరిదాసుడు అయిన భక్త జయదేవ కవిచేత ఈ గీతం వర్ణించబడింది.

## విశేష వర్ణన

శ్రీకృష్ణుడు సంసార వాసనలతో తనను కట్టివేయగల రాధను మనసులో తలచుకొని, అందమైన గోపస్త్రీల నందరినీ వదిలి వేశాడు.

ఓ మదనా! ప్రియురాలిని కోల్పోయిన నన్ను శివుడనుకొని భ్రమతో బాణాలను నాపైకి విసరకు. వక్షఃస్థలంపై నన్ను తామరతూండ్ల హారం సర్పం కాదు. నా మెడలో వున్న నల్ల కలువరేకులు గరళం కాదు. ఇది చందనపు పొడి. భస్మం కాదు సుమా! నన్నెందుకు తాపంతో బాధిస్తున్నావు?

నీ క్రీడలతో విశ్వాన్నే నిర్జించావు. నీ చేతిలో మామిడి పువ్వు బాణం పట్టుకోకు. ధనుస్సుతో సంధించవద్దు. మూర్ఛలో వున్న నన్ను బాధించడం నీకు పౌరుషమేనా? హరిణనేత్ర అయిన నా ప్రియురాలి కృపావీక్షణ పరంపరతో గాయపడిన నా మనస్సు ఇంకా స్వస్థత చెందలేదు.

సంచారదేవతవంటి రాధలో మన్మథుడు చిగురాకువంటి కనుబొమ్మలను ధనువుగా ఉంచాడు. ఆమె తరంగితాలైన చూపులే బాణాలు. ఇలా జగాన్ని జయించగల అస్త్రాలన్నింటిని ఆమెలోనే మన్మథుడు నెలకొల్పాడా ఏమి?

రాధా! నీ కనుబొమ్మ అనే విల్లులోని నీ క్రీగంటి చూపులనే బాణాలు మర్మస్థానంలో వ్యధను కలిగించవచ్చు. నల్లని నీ అందమైన జడ నన్ను

చంపవచ్చు. అనురాగ రంజితమైన నీ దొండపండు వంటి అధరం మోహితుణ్ణి చేయవచ్చు. కాని గుండ్రంగా వున్న నీ స్తనమండలం నా ప్రాణాలతో ఎందుకు ఆటలాడుకొంటోంది?

అవే స్పర్శ సుఖాలు, తరళ స్నిగ్ధ విలాసాలు, అదే ముఖ కమల సౌరభం, అదే అమృతం నిండిన వాక్చాతుర్యం, అదే దొండపండు పెదవి, ఇలా నిరంతరారాధనతో నా మనస్సు రాధలో ఏకాగ్రమైనప్పటికీ, నా విరహ వ్యథ పెంపొందుతున్నదే కాని తగ్గడం లేదు. కారణమేమి?

కిరీటం కదలికతో, దీప్తి స్థానంతో, వేణుగానాసక్తితో వచ్చిన లక్షలాది గోపికలచే చూడబడినవీ, అమృత వర్ష మనోహరమైనవి, రాధ ముఖారవిందంలో చిగురులెత్తేవీ అయిన శ్రీహరి కటాక్ష వీక్షణాలు మనకు క్షేమం కలిగించు గాక!

**ఇది ముగ్ధ మధుసూదన హంసక్రీడనమనే పేరుగల ఏడవ అష్టపది.**

**(శ్రీకృష్ణుడు మన్మథ బాణాలచే శరీరమంతా జర్జరితమయ్యేటట్లుగా కొట్టబడి, మనస్సుయొక్క స్వాస్థ్యం తప్పి, భ్రాంతిపొంది తనవలె మన్మథుడు కూడ భ్రాంతుడని భావించి నిందాపూర్వకంగా ఇలా ఉపాలంభన చేస్తున్నాడు.)**

**శ్లో॥ హృది బిసలతాహారో నాయం భుజంగమ నాయకః**
**కువలయ దళశ్రేణీ కంఠే న సా గరళద్యుతిః ।**
**మలయజ రజోనేదం భస్మప్రియా రహితేమయి**
**ప్రహరసి హరభ్రాంత్యాఽనంగ! క్రుధాకిము ధావసి? ॥**

**తా :** ఓ అనంగుడా! నన్ను చూచి శివుడని భ్రాంతిపడి బాణప్రయోగం చేయవద్దు. నేను శివుణ్ణికాదు. నా గుర్తుకూడ శివచిహ్నాలుకావు. ఇదిగో నా రొమ్ముమీద ఉండేది (విరహతాపం చల్లారడానికి పెట్టుకొన్న తామరతూళ్లు) తామరతూడుల దండగాని, సర్పంకాదు. నా కంఠానికి ఉండేది నల్లకలువరేకుల బంతికాని విషకాంతి కాదు. నా శరీరంమీద



అలదినది గంధపుధూళిగాని శ్మశానపుబూడిదకాదు. ఎందుకు వ్యర్థంగా పిచ్చివాడిలాగా, కన్ను మిన్ను తెలియకుండా భ్రాంతిపడి నాపై నీ బాణాలతో దండయాత్ర చేస్తున్నావు?

**(శ్రీకృష్ణుడు మన్మథ బాధను సహింపజాలక దీనుడై మన్మథుని నిందిస్తున్నాడు.)**

**శ్లో॥ పాణౌ మాకురు చూత సాయక మముం మాచాపమారోపయ**
**క్రీడానిర్జిత విశ్వ! మూర్ఛిత జనాఘాతేన కింపౌరుషం ।**
**తస్యా ఏవ మృగీదృశో మనసిజప్రేంఖత్కటాక్ష గంగ**
**శ్రేణీ జర్జరితం మనాగపి మనోనాద్యాపి సంధుక్షతే ॥**

**తా :** ఓ మన్మథుడా! నీవు ఆ లేమావి చిగురు బాణాన్ని చేతబట్టకయ్యా! నీ ధనుస్సు నెక్కుపెట్టకయ్యా! సమస్త ప్రపంచం ఒక్కసారి విలాసంగా జయించిన మహాపౌరుషశాలికి మూర్ఛితుడైన ఒక సామాన్యజనుని పట్టుకొని వేధించడం పౌరుషంకాదు. ఆ జింక చూపులుగల రాధయొక్క కటాక్ష బాణపరంపర చేతనే నా హృదయమంతా జర్జరితమై ఉంది. ఇటువంటి దశలో నా మనస్సు కాసంతకూడా కుదుట పడలేదు. చచ్చినవాణ్ణి చంపడానికి వచ్చినట్లు నన్నేల వేధిస్తావు?

**(రాధయొక్క కరుణాకటాక్షాది విలాసాలను స్మరించడం చేత నీకు మరింత దుఃఖం కలుగుతూ ఉంది. కాని, మన్మథుడు నీకు ఏం అపకారం చేశాడని ఆయన్ను నిందిస్తున్నావు?)**

**శ్లో॥ భ్రూపల్లవం ధనురపాంగతరంగితాని**
**బాణా గుణశ్రవణ పాళి రితి స్మరేణ ।**
**తస్యా మనంగ జయ జంగమ దేవతాయా**
**మస్త్రాణి నిర్జిత జగంతి కి మర్పితాని? ॥**

**తా :** మన్మథుడు లోకాలను జయించడానికై తన జయానికి జంగమ దేవతవలె ఉన్న యీ రాధ లోకాలనన్నింటిని జయించగలిగితే తన అస్త్రాలను ఈమె

కనుబొమయే ధనుస్సుగా జంకెనవాడి చూపులే బాణాలుగా, కర్ణపాళియే అల్లెత్రాడుగా నిలిపి ఉన్నాడు కాబోలు!

**("స్మరణ రూపంగా నన్ను భావించే రాధయొక్క అవయవిలాసాలేకదా నన్నింతగా బాధిస్తున్నాయి? కాబట్టి, ఆమెనే దూషించాలి!" అని మన్మథుణ్ణి వదలి, రాధ తనముందున్నట్లు భావించి దూషిస్తున్నాడు.)**

**శ్లో॥ భ్రూ చాపే నిహితః కటాక్ష విశిఖో నిర్మాతు మర్మవ్యథాం**
**శ్యామాత్మా కుటిలః కరోతు కబరీభారోఽపిమారోద్యమమ్ ।**
**మోహస్తావదయం చ తన్వి! తనుతాం బింబాధరో రాగవాన్**
**సద్వృతః స్తనమండల స్తవ కథం ప్రాణైర్మమ క్రీడతి ॥**

**తా :** "ఓ సుందరీ! నీ చూపులనే బాణం, కనుబొమ అనే ధనుస్సుపై ఎక్కుపెట్టబడింది. కాబట్టి, అది పరుల మర్మాన్ని వేధించడం ధర్మమే! నీ నల్లని కేశపాశాలు కుటిలాలు కాబట్టి, యితరుల ప్రాణాలు తీయడానికి ప్రయత్నించడమూ యుక్తమే! నీ అధరబింబం రాగవంతం కాబట్టి, మోహం కల్గించడమూ న్యాయమే! కాని, సద్వృత్తమైన నా కుచమండలం కూడా నా ప్రాణాలను తీస్తున్నదే! ఇదేమిన్యాయం?"

**(వక్రోక్తిచే విరహాతిశయాన్ని చెబుతున్నాడు)**

**శ్లో॥ "తాని స్పర్శ సుఖాని తేచ సరళాః స్నిగ్ధాదృశోవిభ్రమాః**
**తద్వక్త్రాంబుజ సౌరభం స చ సుధాస్యందీ గిరీం వక్రిమా ।**
**సాబింబాధర మాధురీతి విషయా నంగేఽపి చేన్మానసం**
**తస్యాం లగ్నసమాధిహంత! విరహవ్యాధిః కథంవర్ధతేః ॥**

**తా :** అవియే (పూర్వమనుభవింపబడినవే - ఈ) స్పర్శసుఖాలు! చంచల ప్రేమసహితాలైన నేత్ర విలాసాలూ అవే! ముఖకమలంయొక్క పరిమళమూ అదే! అమృతాన్ని స్రవించే వాక్చాతుర్యమూ అదే! అధరబింబ మాధుర్యం



సైతమూ అదే! ఇలా, ఆయా ఇంద్రియ విషయాల ననుభవించే నా మనస్సు రాధపై ఏకాగ్రమై ఉన్న ఈ విరహమనే వ్యాధి ఇంకావృద్ధి పొందుతూ ఉందే! ఏమిటీ చిత్రం!?

**(తృతీయసర్గాన్ని ముగిస్తూ సర్గాంతంలో ఆశీర్వచన రూప మంగళాన్ని రచిస్తున్నాడు)**

**శ్లో॥ తిర్యక్కణ్ఠ విలోలమౌళి తరళోత్తంసస్య వంశోచ్చర**
**ద్దీప్తి స్థానకృతావధాన లలనా లక్షై ర్నసంలక్షితాః ।**
**సంముగ్ధే మధుసూదనస్య మధురే రాధాముఖేందౌ సుధా**
**సారే కన్దళితాశ్చిరం దదతునః క్షేమం కటాక్షోర్మయః ॥**

**తా :** శ్రీకృష్ణుడు తన చేతులను కంఠానికి అడ్డంగా పెట్టుకొని, కిరీటం సన్నగా కదలుచుండగా తారస్థాయిలో పిల్లనగ్రోవిని ఊదుతుండగా, ఆ గీతంపై ఎంతో ఆసక్తి గలిగి వచ్చిన అనేక లక్షల గోపికలచే చూడబడినవీ అమృతసారంలాగ, మనోహరాలైనవీ, శ్రీకృష్ణుని ముఖచంద్రునిలో మొలకలెత్తుచున్నవీ అయిన శ్రీకృష్ణుని కటాక్షతరంగాలు చిరకాలం మనకు క్షేమాన్ని కలుగజేస్తూ ఉండాలి!

**ఇతి శ్రీజయదేవకృతే గీతగోవిందే ముగ్ధమధుసూదనో నామ తృతీయస్సర్గః.**

ఇది శ్రీజయదేవ కృత గీతగోవింద కావ్యంలో ముగ్ధ మధుసూదనమనే పేరుగల మూడవసర్గ.

* * *

# చతుర్థ సర్గ
## స్నిగ్ధ మధుసూదనము

(తృతీయసర్గలో రాధామాధవుల మన్మథావస్థల్ని వేర్వేరుగా నిరూపించి వీరిద్దరిని ఒకటిగా చేర్చాలని భావించి ప్రస్తుతం దూతీయోగాన్ని చెబుతున్నాడు.)

**శ్లో॥ యమునాతీర వానీరనికుంజే మందమాస్థితమ్ ।**
**ప్రాహ ప్రేమభరోద్భ్రాంతం మాధవం రాధికా సఖీ ॥**

**తా :** రాధ మీదిగల అత్యంతప్రేమచే ఆమెను ధ్యానించి, ధ్యానించి చిట్టచివరికి మనస్సులోనే ఆమెను సాక్షాత్కరింపజేసుకొని రాధను వెదకడం మాని ఒక పొదరింటిలో కూర్చున్నాడు కృష్ణుడు.

**విశే :** నాయిక విరహోత్కంఠిత

## అష్టపది – 8
## స్నిగ్ధ మధుసూదనము

**కర్ణాటరాగం - ఏకతాళం**

**సౌరాష్ట్రరాగం - ఆదితాళం**

**కానడరాగం- ఏకతాళం**

**(కర్ణాటకరాగైకతాళీతాళాభ్యాం గీయతే)**

సా విరహే తవ దీనా

నిందతి చందన మిందుకిరణమను విందతి ఖేదమధీరమ్ ।
వ్యాళనిలయ మిళనేన గరళమివ కలయతి మలయ సమీరమ్ ॥
మాధవ మనసిజ విశిఖ భయాదివ భావనయా త్వయిలీనా ।
సా విరహే తవ దీనా (ధ్రువమ్) 1



అవిరళ నిపతిత మదన శరాదివ భవదవనాయ విశాలమ్ ।
స్వహృదయ మర్మణి వర్మ కరోతి సజల నళినీదళజాలమ్ ॥
సా విరహే తవ దీనా 2

కుసుమ విశిఖ శరతల్ప మనల్ప విలాస కలా కమనీయమ్ ।
వ్రతమిత తవ పరిరంభసుఖాయ కరోతి కుసుమ శయనీయమ్ ॥
సా విరహే తవ దీనా 3

వహతి చ వలిత విలోచన జలధర మాననకమల ముదారమ్ ।
విధుమివ వికట విధుంతుద దంత దళన గలితామృత ధారమ్ ॥
సా విరహే తవ దీనా 4

విలిఖతి రహసి కురంగమదేన భవంతమసమ శరభూతమ్ ।
ప్రణమతి మకరమధో వినిధాయ కరే చ శరం నవ చూతమ్ ॥
సా విరహే తవ దీనా 5

ధ్యానలయేన పురఃపరికల్ప్య భవంతమతీవ దురాపమ్ ।
విలపతి హసతి విషీదతి రోదితి చంచతి ముంచతి తాపమ్ ॥
సా విరహే తవ దీనా 6

ప్రతిపద మిదమపి నిగదతి మాధవ! తవ చరణే పతితాఽహం ।
త్వయి విముఖే మయి సపది సుధానిధిరపి తనుతే తను దాహమ్ ॥
సా విరహే తవ దీనా 7

శ్రీ జయదేవ భణిత మిదమధికం యది మనసా నటనీయం ।
హరి విరహాకుల పల్లవ యువతి సఖీ వచనం పఠనీయమ్ ॥
సా విరహే తవ దీనా 8

శ్రీకృష్ణుడు యమునా నదీతీరంలోని ప్రబ్బలిచెట్టు పొదరింటిలో నిశ్శబ్దంగా, నిరాశతో ఒంటరిగా కూర్చొని ఉన్నాడు. విరహ వేదనతో

రాధానురక్తుడై, చంచలచిత్తుడై, ఆమెనే ధ్యానిస్తూ కూర్చొని ఉన్నాడు. అతనిని రాధ చెలికత్తె కలుసుకొని ఇలా అంటోంది.

"కృష్ణా! నీ విరహంతో దీనురాలైన రాధ, మన్మథుని పుష్పబాణాలకు భయపడని నీలో దాగుకొని ఉన్నది.

ఓ మాధవా! రాధ చందన గంధ సువాసనల్ని నిందిస్తున్నది. చంద్రుని చల్లని కిరణాల్ని దూషిస్తున్నది.

మలయ పర్వతంపైనుండి వచ్చే ఆహ్లాదకరమైన మలయ మారుతాన్ని కూడా విషంగా భావించి బాధపడుతున్నది. చందన వృక్షాలకు సర్పాలు చుట్టి ఉండటంచేత, ఆ చెట్లనుండి వెలువడే సువాసనను సైతం విషప్రాయంగా భావిస్తున్నది. విరహ వేదనతో బాధపడుతోంది.

అంతం లేకుండా తనపై వచ్చి పడుతున్న మన్మథ బాణాలు తన హృదయంలో వున్న నీకు తాకి బాధిస్తాయేమోనని భయంతో, తన వక్షః స్థలాన్ని పెద్ద పెద్ద తామరాకులతో దట్టంగా కప్పుకొని, కవచంగా చేసుకొని విరహ వేదనతో బాధపడుతోంది.

నీ ఆలింగన సౌఖ్యాన్ని కోరుకున్న రాధ, మదన బాణాలతో అమర్చిన తల్పం మీద పడుకొని, వ్రతం చేస్తున్నట్లు సకల కళావిలసితమైన కమనీయ కుసుమ శయ్యపై శయనించింది.

శ్రీకృష్ణా! రాధ నీ విరహవేదనతో మేఘాలవలె కన్నీళ్ళు నిండిన కన్నులతో, ముఖ సౌందర్యాన్ని కోల్పోయింది. రాహువు కబళించిన చంద్రునిలా వున్న తన ముఖ కమలం నుండి అమృత ధారలు కురుస్తున్నాయా అన్నట్లు తోస్తోంది.

రాధ ఒంటరిగా కూర్చొని కస్తూరితో నిన్ను మన్మథ రూపంతో చిత్రిస్తోంది. వాహనంగా మొసలిని, చేతిలో లేత మామిడి చిగురు బాణాలను ఆ చిత్రంలో చేర్చి, 'మదనా! నన్ను హింసింపకురా!" అని వేడుకుంటోంది.



నీవు తన ముందే ఉన్నావనే భావనతో, వేదనతో రోదిస్తోంది. వెర్రిగా నవ్వుతోంది. నీ మోసపు పనులను తలచుకొని ప్రేమ లేమితో అవిశ్రాంతంగా ఉంది. రోదిస్తూ, నిన్ను తన ధ్యానంలో మరచిపోవడానికి ప్రయత్నిస్తోంది.

మాధవా! "నేను నీ పాదాలను ఆశ్రయించాను. నీవు నాకు విముఖుడవు కావడం చేత చంద్రుడు సైతం నా శరీరాన్ని దహింప జేస్తున్నాడు." అంటూ రాధ ప్రతి క్షణం గొణుగుతోంది. విరహవేదనతో ఆమె శరీరం, మనస్సు నిర్దయగా కృశించి పోతున్నాయి".

భక్తులారా! జయదేవ కవి ఆలపించిన ఈ గీతంలోని పలుకులు హరి విరహంతో వ్యాకులత చెందిన రాధ తన చెలికత్తెతో పలికినవి, ప్రేమతో చదవదగినవి, రాధాకృష్ణుల విరహ వేదనను ఇది వర్ణిస్తోంది.

ఇది హరివల్లభాశోకపల్లవమనే పేరుగల ఎనిమిదవ అష్టపది.

**('నాయకుడు ప్రతికూలుడైనందున నాయికకు అన్నీ ప్రతికూలాలే అవుతున్నాయి' - అని చెలికత్తె అభియోగం)**

**శ్లో॥ ఆవాసో విపినాయతే ప్రియసఖీమాలాఽపి జాలాయతే**
**తాపోఽపి శ్వసితేన దావదహన జ్వాలాకలాపాయతే ।**
**తేఽపి త్వద్విరహేణ హంత! హరిణీ రూపాయతే హా! కథమ్**
**కన్దర్పోఽపి యమాయతే విరచయన్ శార్దూలవిక్రీడితమ్ ॥**

**తా :** శ్రీకృష్ణా! నీవు రాధ సమీపంలో లేకపోవడంచేత, ఆమె అడవిగా మారిపోయింది. ఆమె చెలికత్తెలగుంపే వల అయింది. శరీరతాపమే పెద్ద అడవి నిప్పుమంటలైనాయి. అయ్యయ్యో! ఏమని చెబుతాను? ఈ మధ్యకాలంలో ఆ రాధే ఒక లేడిపిల్ల అయింది. ఇదిలా ఉండగా మన్మథుడు పెద్దపులియై గర్జిస్తూ, యమధర్మరాజులాగా మీదికురికాడు. ఇలాంటి పరిస్థితిలో ఆమె ప్రాణాలు నిలిచే దేలా?

## అష్టపది - 9
## స్నిగ్ధ మధుసూదన రాసావలయము

(ప్రస్తుతం రాధయొక్క విరహవ్యాధి అవస్థను గీతరూపంగా వర్ణిస్తున్నాడు.)

### దేశాక్షీరాగం - ఏకతాళం

స్తన వినిహితమపి హారముదారం ।
సా మనుతే కృశ తనురివ భారమ్॥
రాధికాకృష్ణా! రాధికా!!
రాధికా తవ విరహే కేశవా ॥ 1

సరస మసృణమపి మలయజ పంకం ।
పశ్యతి విషమివ వపుషి సశంకమ్ ॥
రాధికా ... కేశవా ॥ 2

శ్వసిత పవనమనుపమ పరిణాహం ।
మదన దహనమివ వహతి సదాహమ్ ॥
రాధికా ... కేశవా ॥ 3

దిశి దిశి కిరతి సజల కణజాలం ।
నయన నళినమివ విగళితనాళమ్ ॥
రాధికా ... కేశవా ॥ 4

నయనవిషయ మపి కిసలయతల్పం
కలయతివిహితహుతాశనకల్పమ్ ॥
రాధికా ... కేశవా ॥ 5

త్యజతి న పాణితలేన కపోలం ।
బాల శశినమివ సాయమలోలమ్ ॥
రాధికా ... కేశవా ॥ 6



హరిరితి హరిరితి జపతి సకామం ।
విరహ విహిత మరణేన నికామం ।
రాధికా ... కేశవా ॥ 7

శ్రీ జయదేవ భణితమితి గీతం ।
సుఖయతు కేశవ పదముపనీతమ్ ॥
రాధికా తవ విరహే కేశవా ॥ 8

**భావం :** శ్రీకృష్ణా! నీ విరహ బాధతో రాధ అడవిలో నివసిస్తోంది. ఆమె చెలికత్తెలు కూడ ఆమెకు బంధనాలయ్యారు. వేడి నిట్టూర్పులు ఆమెను కార్చిచ్చులా కాల్చివేస్తున్నాయి. ఆమె ఒంటరి లేడిలా అడవిలో వుంది. మన్మథుడు పులివలె క్రీడిస్తూ, ఆమె పట్ల యమునివలె వున్నాడు. ఈ స్థితిలో ఆమె ఎలా జీవిస్తుందని నీవు తలుస్తున్నావు?

ఓ కేశవా! రాధికా కృష్ణా! నీ విరహ తాపంతో రాధ కృశించిన శరీరంతో, తన స్తనాలపై వున్న విలువగల హారాలనుకూడా భారంగా భావిస్తోంది.

మృదువైన చల్లని చందన లేపనం కూడా విషంతో సమానంగా శంకిస్తూ ఉంది. సుదీర్ఘమైన తన నిట్టూర్పు గాడ్పులను విరహతాపంచే మదనాగ్ని వలె భావిస్తున్నది.

కమలాల లాంటి ఆమె నేత్రాలలో దుఃఖ బాష్పాలు నిండి వున్నాయి. నీ కోసం నిస్సహాయురాలిగా దిక్కులన్నీ పరికిస్తోంది. కాండం నుండి తొలగించబడ్డ పద్మం లాంటి కండ్లతో తేజోహీనంగా వుంది. చిగురుటాకుల మృదుశయ్యను కూడ అగ్నిగుండంగా భావిస్తోంది. సాయంసమయ బాలచంద్రునిలా వున్న తన కపోలాన్ని తన చేతిపై వుంచుకొని కూర్చొని ఉంది. వియోగబాధతో మరణ మాసన్నమైనట్లు భావిస్తూ, తుది పలుకుగా "హరీ, హరీ" అంటూ ఎంతో అభిలాషతో నీ నామాన్నీ జపిస్తోంది.

ఈ విధంగా శ్రీహరి పాదాలకు సమర్పించబడ్డ ఈ జయదేవకవి గీతం వినేవారికి, పాడుకొనేవారికి సమున్నత ఐశ్వర్యాలను ప్రసాదించు గాక!

**విశేష వర్ణన**

రాధ ఛీత్కారంతో విలపిస్తోంది. వణుకుతోంది. నీ ధ్యాసతోనే బాధపడుతోంది. ఏవేవో నీ శృంగార చేష్టలు గుర్తుకు వచ్చి కళ్ళు మూసుకుంటోంది. శరీరం బలహీనమై, కృంగిపడిపోతుంది. మళ్ళీ మెల్లగా లేస్తోంది. దేవతా సమానుడవైన శ్రీకృష్ణా! నీవు మన్మథ స్వరంతో ప్రసన్నుడవైతే, ఆ సౌందర్యరాశి రాధ నీ శృంగార కేళిలో జీవించదా? నీ కృప లేకపోతే రాధ సర్వశక్తులు కోల్పోగలదు. ఇప్పటికైనా నీవు ఆమె పట్ల ప్రసన్నుడవు కాకపోతే, నీ కంటె కఠినాత్ముడైన యముడు మరొకడుండడు సుమా! గోపాలా! మదనునిచేత బాధితురాలైన రాధ నీ శరీర సాంగత్యమనే అమృత సేవనంతోనే ఆమె రోగ నివారణ సాధ్యం. రాధకు బాధ నుంచి విముక్తి కలిగించకపోతే నీవు వజ్రం కంటె కఠినుడ వవుతావు.

కామజ్వర సంతప్త శరీరం గల రాధ మనస్సుకు చందనం, చంద్రుడు, తామరతీగెలు శీతలత్వాన్ని ఇవ్వలేవు. అలసటతో ఒంటరిగా వున్న తన ప్రియుడవైన నిన్ను ఒక్కడినే చల్లనివానిగా స్మరిస్తూ, కృశిస్తూ, జీవచ్ఛవంలా వుంది.

కృష్ణా! పూర్వం నీవు, రాధ కలసిమెలిసి ఉన్నప్పుడు కూడా కనురెప్పపాటులో ప్రాప్తించే నీ విరహాగ్నినే ఆమె భరించ గలిగేది కాదు. అట్టి ప్రియ రాధ చిరకాల విరహంతో పుష్పితాగ్రాలు గల తీయని మామిడి కొమ్మలను చూచి, ఈ వసంత హేలను ఎలా ఆస్వాదించి జీవించగలదో చెప్పు.

ఇంద్రుడు కోపంతో కుండపోత వర్షం కురిపిస్తున్నపుడు, భయపడిన గోకులాన్ని కాపాడటానికై గోవర్ధన పర్వతాన్ని పైకెత్తిన నీ బాహువును, ఆ



గొల్లభామలు ఆనందంతో ముద్దుపెట్టుకొంటున్నపుడు, వారి సిందూరవర్ణ రంజితాలైన అధర ముద్రలు పడిన శ్రీకృష్ణ పరమాత్మ బాహువు మనకు శ్రేయం కలిగించు గాక!

**(చెలికత్తె శ్రీకృష్ణుని వద్దకుపోయి రాధపడుతున్న విరహవ్యథలోని అవస్థలను వర్ణిస్తూ, అతని మనస్సును ఆకర్షిస్తున్నది.)**

**శ్లో॥ సా రోమాంచతి సీత్కరోతి విలపత్యుత్కంపతే తామ్యతి**
**ధ్యాయత్యుద్భ్రమతి ప్రమీలతి పతత్యుద్యాతి మూర్ఛత్యపి ।**
**ఏతావత్య తనుజ్వరే వరతనుర్జీవేన్న కింతే రసాత్**
**స్వర్వైద్య ప్రతిమ! ప్రసీదతి యది త్యకోఽన్యథాహస్తకః ॥**

**తా :** శ్రీకృష్ణా! ఆ రాధ ఇప్పుడు పెద్ద మన్మథజ్వరంతో పరితపిస్తూ ఉంది. ఆమె దుర్దశల్ని ఏమని వర్ణించేది? గగుర్పాటు పొందుతోంది సీత్కారం చేస్తోంది. విలపిస్తూ ఉంది. వణుకుతూ ఉంది. మనస్సులో తీరని వేదన పొందుతోంది. ధ్యానిస్తోంది. అటూ ఇటూ తిరుగుతూ ఉంది. కండ్లు మూస్తోంది. ఇలాంటి మహామన్మథ జ్వరంతో ఉన్న రాధను దేవతావైద్య సమానుడవైన నీవు అనుగ్రహింపకపోతే ఆమె ప్రాణాలు దక్కవు. (అంటే ఆమె మృతిపొందక తప్పదు అని భావం.) (దశవిధ మన్మథావస్థలలో చిట్టచివరి దశమరణమే!)

**శ్లో॥ స్మరాతురాం దైవతవైద్య హృద్య**
**త్వదంగ సంగామృత మాత్ర సాధ్యామ్ ।**
**విముక్తబాధాం కురుషే నరాధాం**
**ఉపేంద్ర! వజ్రాధిక దారుణోఽసి ॥**

**తా :** అశ్వినీదేవతల్లాగా సుందరుడైన ఓ శ్రీకృష్ణా! రాధ మన్మథునిచే ఎంతో బాధింపబడుతోంది. నీ శరీరసంగమమనే అమృతం సోకితేనేగాని ఆ బాధకు

పరిష్కారం లేదు. కాబట్టి, అలాంటి ఆమె బాధను నివర్తింపజేయవలసింది లేకుంటే నీవు వజ్రం కంటే కఠినుడి వంటారు.

**శ్లో॥ కందర్పజ్వర సంజ్వరాకులతనోరాశ్చర్య మస్యాశ్చిరం**
**చేత శ్చందన చంద్రమః కమలినీ చింతాను సంతామ్యతి ।**
**కింతు క్లాంతివశేన శీతల తరం త్వామేక మేవ క్షణం**
**ధ్యాయంతీ రహసిస్థితా కథమపి క్షీణాక్షణం ప్రాణితి ॥**

**తా :** శ్రీకృష్ణా! ఆ రాధ మన్మథజ్వర సంతాపంచే ఎంతో మనోవేదనకు గురియైంది. జ్వరపీడితురాలు కాబట్టి చల్లని పదార్థాలైన చందనాన్ని, చంద్రుని, తామరతూడులను తాకడానికి సహించేదికాదు. (అవి చల్లని పదార్థాలు కావు, అగ్ని శిఖలుగా ఆమెకు అనిపించేవి) ఇంకా చెబితే, ఏకాంతస్థలంలో దాగి ఉండే ప్రియుడవైన నిన్ను మాత్రమే చల్లని పదార్థంగా భావించి, ధ్యానిస్తూ ఎంతో బడలికచేత శరీరమంతా కృశించినా ఏదోఒక విధంగా క్షణకాలం ప్రాణాలను ధరించి ఉంది. (నీవు ఆలస్యం చేశావంటే ఈ లోపల ఆమె ప్రాణాలు నిలిచి ఉంటుందో లేదో నేను నిశ్చయంగా చెప్పలేను.) (మన్మథావస్థలలో చివరిదశ చేరుకొన్నది రాధ)

**(అయితే, ఇంతకాలందాకా ఎలా ప్రాణాలు బిగపట్టుకొని జీవించిందో అదేవిధంగా ఇప్పుడు జీవించవచ్చును కదా! అంటే దానికి సమాధానం ఇలా చెబుతున్నది.)**

**శ్లో॥ క్షణమపి విరహః పురాన సేహే**
**నయన నిమీలిత ఖిన్నయా యయా తే ।**
**శ్వసితి కథమసౌ రసాలశాఖాం**
**చిరవిరహేణ విలోక్య పుష్పితాగ్రామ్ ॥**

**తా :** శ్రీకృష్ణా! నీవూ రాధా జంటవీడక ఉన్నకాలంలో, రెప్పపాటు కాలమైనా రాధ నీ వియోగాన్ని సహింపకుండా ఉండేది కాదు కదా! అటువంటి రాధ



చక్కగా పుష్పించిన తియ్యమామిడి చెట్లచే విలసిల్లే, ఈ వసంతకాలంలో ఎలా నీ వియోగాన్ని సహించి ప్రాణాలు నిలుపుకోగలదు?

**(కవి చతుర్థ సర్గాన్ని ముగిస్తూ "మంగళాదీని, మంగళమధ్యాని, మంగళాంతాని కావ్యాని శాస్త్రాణి ప్రథంతే" అనే భాష్యకార వాక్యాన్ని అనుసరించి సర్గాంతంలో మంగళం ఆచరిస్తున్నాడు.)**

**శ్లో॥ వృష్టివ్యాకుల గోకులావనరసాదుద్ధృత్య గోవర్ధనం**
**బిభ్రద్వల్లవవల్లభాభి రధికానందాచ్చిరం చుంబితః ।**
**దర్పేణైన తదర్పితాధర తటీ సిందూర ముద్రాంకితో**
**బాహుర్గోపతనో స్తనోతు భవతాం శ్రేయాంసి కంసద్విషః ॥**

**తా :** పూర్వకాలంలో ఇంద్రుడొకానొక కారణంచేత కోపించి, వ్రేపల్లెలో కడగండ్లను సృష్టించే వడగండ్ల వాన ఎడతెరపి లేక కురిపింపగా ఆ వర్షపాతంచే మహాభయాన్ని పొందిన గోపకులు శ్రీకృష్ణుని శరణాగతి సేయగా, వారికి అభయాన్ని అనుగ్రహించి, వారు సుఖంగా ఉండటానికి సంతోషంతో గోవర్ధన పర్వతాన్ని ఎత్తి గోగోపగోపీగణాలను రక్షించాడు. అప్పుడు గొల్లపడుచులు కృష్ణుని బాహుబల పరాక్రమానికి నిబిడాశ్చర్య నిమగ్నులై ఆనందసాంద్రులై బాలకృష్ణుని బాహువులను, చాలాసేపు ముద్దుపెట్టుకొన్నారు. అంతేకాదు, ఆ బాహువులు గోపికల అధరోష్ఠ పుటాలలోని సిందూరపు ముద్రలచే ముద్రితాలయ్యాయి. అటువంటి గోపబాలుడైన శ్రీకృష్ణుని బాహువులు మీకు నిరంతరం మంగళములు కల్గించుగాక.

**ఇతి శ్రీ జయదేవకృతే గీతగోవిందే స్నిగ్ధమధుసూధనో నామ చతుర్థస్సర్గః.**

ఇతి శ్రీజయదేవ కవి కృతమైన గీతగోవిందకావ్యంలో
స్నిగ్ధమధుసూదనమనే పేరుగల నాల్గవసర్గ.

* * *

# పంచమ సర్గ

## సాకాంక్ష పుండరీకాక్షము

(శ్రీకృష్ణుడు రాధయొక్క సఖి తెల్పిన వృత్తాంతాన్ని విని, ఆమెకు అభిముఖుడై "నేనిక్కడే ఉంటాను, నీవు పోయి రాధను పిలుచుకొని రావలసిందని" ఆమె చెలికత్తెను పంపుతూ ఇట్లంటున్నాడు.)

**శ్లో॥ అహ మిహ నివసామి యాహి రాధాం**
**అనునయ మద్వచనేన చానయే థాః ।**
**ఇతి మధురిపుణా సఖీ నియుక్తా**
**స్వయ మిదమేత్య పునర్జగాద రాధామ్ ॥**

**తా :** ఓ రాధా సఖురాలా! "నేనిక్కడే ఉంటాను నీవు త్వరగా పోయి రాధను ఊరడించి నేనిక్కడికి పిల్చుకొని రమ్మన్నానని చెప్పి, తోడ్కొని రావలసింది". అని శ్రీకృష్ణుడు ఆజ్ఞాపించగా, రాధయొక్క చెలికత్తె ఆమె సన్నిధికి పోయి ఇలా విన్నవించింది.

## అష్టపది - 10

## హరిసముదయ గరుడ పదము

**పంతువరాళిరాగం - రూపకతాళం**

**దేశాక్షీరాగం - రూపకతాళం**

వహతి మలయ సమీరే మదన ముపనిధాయ ।
స్ఫుటతి కుసుమ నికరే విరహి హృదయ దళనాయ ॥
తవ విరహే వనమాలీ సఖి! సీదతి, రాధే । 1

దహతి శిశిర మయూఖే మరణమనుకరోతి ।
పతతి మదన విశిఖే విలపతి వికలతరోఽతి ॥
తవ విరహే వనమాలీ సఖి! సీదతి, రాధే । 2



ధ్వనతి మధుప సమూహే శ్రవణమపి దధాతి ।
మనసి కలిత విరహే నిశి నిశి రుజముపయాతి ॥
తవ విరహే వనమాలీ సఖి! సీదతి, రాధే । 3

వసతి విపిన వితానే త్యజతి లలిత ధామ ।
లుఠతి ధరణి శయనే బహు విలపతి తవ నామ ।
తవ విరహే వనమాలీ సఖి! సీదతి, రాధే । 4

రణతి పికసమవాయే ప్రతిదిశ మనుయాతి ।
హసతిమనుజనిచయే విరహ మపలపతి నేతి ॥
తవ విరహే వనమాలీ సఖి! సీదతి, రాధే । 5

స్ఫురతి కలరవరావే స్మరతి మణిత మేవ ।
తవ రతిసుఖవిభవే గణయతి సుగుణ మతీవ ॥
తవ విరహే వనమాలీ సఖి! సీదతి, రాధే । 6

త్వదభిధశుభదమాసం వదతి సతి శృణోతి ।
తమపి జపతి సరసం యువతిషు న రతి ముపైతి ॥
తవ విరహే వనమాలీ సఖి! సీదతి, రాధే । 7

భణతి కవి జయదేవే విరహ విలసితేన ।
మనసి రభస విభవే హరిరుదయతు సుకృతేన ॥
తవ విరహే వనమాలీ సఖి! సీదతి, రాధే । 8

శ్రీకృష్ణుడు రాధ చెలికత్తెతో 'నేను ఈ పూతీగెల పొదలో ఉంటాను. నీవు వెళ్ళి, రాధకు నా మాటగా చెప్పి అనునయించి, నేను ఇక్కడికి రమ్మన్నానని చెప్పి, ఈ పొదరింటికి వెంటనే తీసికొని రా." అని చెప్పగా, సఖి రాధ వద్దకు చేరి ఇలా చెప్తోంది.

సఖీ రాధా! మదనుడు వెంటాడుతున్నాడు. మలయమారుతం సొంపుగా వీస్తోంది. వికసించిన పరిమళ భరిత పుష్పాలు విరహ జనుల హృదయాలను

కలవరపెట్టి వేధిస్తున్నాయి. ఇటువంటి మదనతాపంతో నీ ప్రియుడు శ్రీకృష్ణుడు వనమాలను ధరించి నీ విరహంతో అధికంగా వేదన చెందుతున్నాడు. నీ విరహ బాధతో వున్న ఆయన్ని చంద్రుని శీతల కిరణాలు కూడా దహించివేస్తున్నాయి. మదనుని బాణాలు భరించలేక వికల మనస్కుడై నీ విరహం కంటె మరణమే శరణ్యమని భావిస్తున్నాడు. విలపిస్తున్నాడు. తుమ్మెదలు కమ్మని ఝుంకారనాదాలు చేస్తుంటే చెవులు మూసుకొంటున్నాడు. విరహంతో రాత్రిళ్ళు నిద్రపోవడం లేదు. ఆ బాధతో రోగగ్రస్తుడవుతున్నాడు. తన సుందర నివాసాన్ని వదలిపెట్టి అరణ్యాలలో తిరుగుతున్నాడు. నేలపై దొర్లుతున్నాడు. అనేక విధాలుగా నీ నామాన్నే, నిన్నే పిలుస్తూ విలపిస్తున్నాడు. కోయిలలు మధురాతి మధురంగా 'కూ'అని కూస్తుంటే తాను పిచ్చివాడి వలె నలుదిక్కుల పరిగెత్తుతున్నాడు. తన విచిత్ర ప్రవర్తనను చూచి నలుగురు నవ్విపోతారేమోననే బాధతో విరహవేదనా తీవ్రతను తన హృదయంలోనే ఉంచుకుంటున్నాడు.

కపోతాల ధ్వనులు విన్నపుడు, వాటిని తాను నీతో జరిపిన రతి ధ్వనులుగానే ఊహించుకొంటున్నాడు. నీతో అనుభవించిన ఆ రతిసుఖ వైభవాన్నే గుర్తు చేసుకొంటున్నాడు.

వైశాఖ శుభ మాసాన్ని గురించి అందరూ చెప్పుకొంటూ ఉంటే, కృష్ణుడు మాత్రం వింటూ ఆనందిస్తున్నాడు. ఆ 'రాధా' మాసాన్నే సతతం మననం చేసుకొంటున్నాడు. ఇతర యువతులతో అనురాగాన్ని కోరుకోవడం లేదు.

ఈ గీతంలో జయదేవ కవి "రాధా విరహ బాధితుడై శ్రీకృష్ణుడు అనుభవించిన వేదనను పలురీతుల్లో వర్ణించాడు. ఈ గీతాన్ని విని కాని, పాడటం చేత కాని ఉత్సాహవంతులైన వారికి వారి సుకృతం వల్ల వారి హృదయాల్లో శ్రీహరి ఉదయించు గాక!"

ఇది హరి సముదయ గరుడపదమనే పేరుగల పదవ అష్టపది.



**శ్లో॥ పూర్వం యత్ర సమం త్వయా రతిపతే రాసిదితా స్సిద్ధయః**
**తస్మిన్నేన నికుంజ మన్మథ మహాతీర్థే పునర్మాధవః ।**
**ధ్యాయం స్త్వామనిశం జపన్నపి తవైవాలాపమంత్రా వలీం**
**భూయస్త్వత్కుచకుంభ నిర్భర పరీరంభామృతం వాంఛతి ॥**

**తా :** ఓ రాధా! పూర్వం నీవూ, కృష్ణుడూ కలిసి ఉన్నప్పుడు మన్మథ కార్యసిద్ధులన్నీ ఏ పొదరింటిలో సాంగోపాంగంగా సిద్ధించాయో, అటువంటి మన్మథ మహాతీర్థమైన ఆ పొదరింటిలోనే ఇప్పుడు కూడ శ్రీకృష్ణుడు కూర్చుండి సదాసర్వకాలమూ నిన్నే ధ్యానిస్తూ నీ ముద్దు పలుకులనే మంత్రాలుగా జపిస్తూ, నీ కుచకుంభాల బిగికౌగిలింత అనే మోక్షాన్ని కోరుతున్నాడు.

## అష్టపది - 11
## సాకాంక్ష పుండరీకాక్షోత్కంఠా మధురము

చెలికత్తె కొంచెం ప్రసాదోన్ముఖురాలైన రాధను వెంటనే శ్రీకృష్ణుని వద్దకు పొమ్మని త్వరపెట్టుతోంది.

**ఘూర్జరీరాగం - ఏకతాళం**

**పాడిరాగం - ఏకతాళం**

**ఘూర్జరీరాగేణ ఏకతాళేన గీయతే**

రతిసుఖసారే గతమభిసారే మదన మనోహర వేశం ।
న కురు నితంబిని! గమన విళంబన మనుసర తం హృదయేశమ్ ॥
ధీర సమీరే యమునాతీరే వసతివనే వనమాలీ ।
గోపీపీనపయోధర మర్దనచంచలకరయుగశాలీ(ధ్రువమ్ ॥ 1

నామ సమేతం కృత సంకేతం వాదయతే మృదు వేణుం ।
బహు మనుతే ననుతే తనుసంగతి పవన చలితమపి రేణుమ్ ॥
ధీరసమీరే ... ... ... ... యుగశాలీ 2

పతతి పతత్రే విచలతి పత్రే శంకిత భవదుపయానమ్ ।
రచయతి శయనం సచకితనయనం పశ్యతి తవ సంధానమ్ ॥
ధీరసమీరే … … … … యుగశాలీ 3

ముఖరమధీరం త్యజ మంజీరం రిపుమివ కేళిషు లోలం ।
చల సఖి! కుంజం సతిమిరపుంజం శీలయ నీల నిచోళమ్ ॥
ధీరసమీరే … … … … యుగశాలీ 4

ఉరసి మురారే రుపహితహారే ఘన ఇవ తరళ బలాకే ।
తటిదివ పీతే! రతి విపరీతే రాజసి సుకృత విపాకే ॥
ధీరసమీరే … … … … యుగశాలీ 5

విగళిత వసనం పరిహృతరశనం ఘటయ జఘనమపిధానం ।
కిసలయ శయనే పంకజనయనే! నిధిమివ హర్ష నిధానమ్ ॥
ధీరసమీరే … … … … యుగశాలీ 6

హరిరభిమానీ రజని రిదానీ మియమపి యాతి విరామం ।
కురుమమ వచనం సత్వర రచనం పూరయ మధురిపు కామమ్ ॥
ధీరసమీరే … … … … యుగశాలీ 7

శ్రీ జయదేవే కృత హరిసేవే భణతి పరమ రమణీయం ।
ప్రముదిత హృదయం హరిమతిసదయం సమత సుకృత కమనీయం ॥
ధీరసమీరే … … … … యుగశాలీ 8

**భావం :** ఓ రాధా! పూర్వం నీకు శ్రీకృష్ణునితో ఎక్కడైతే మన్మథ సుఖం లభించిందో, ఆ మహా తీర్థంలోనే మళ్ళీ ఇపుడు కూడా మాధవుడు నిన్నే నిరంతరం తలచుకొంటూ, నీ పలుకుల మంత్రాలను జపిస్తూ, నీ మధుర కుచకుంభాల కౌగిలింతల అమృతాన్ని మిక్కిలిగా కోరుతున్నాడు.

అందమైన మంచి పిరుదులు గల రాధా! రతిసుఖ సారమైన స్థానంలో మదన మనోహర రూపుడైన ఆ హరిని కలుసుకొనేందుకు వెంటనే వెళ్ళు.



ఆలస్యం చేయవద్దు. ఆలోచించవద్దు. గోపాంగనల పయోధరాలు మర్దిస్తూ వనమాలి పిల్లగాలులు వీచే యమునా నదీ తీరాన వున్నాడు.

వేణువుపై నీ పేరుతో పాట పాడుతూ, తానున్న స్థలాన్ని గుర్తు చేస్తున్నాడు. నీ శరీరాన్ని స్పృశించి ఎగసిపడ్డ దుమ్మును కూడా గొప్పగా భావిస్తున్నాడు.

ఆకుల సవ్వడి విన్నా, పక్షి ఈక పడినా నీవే వచ్చావని భావించి నీ కోసం సుందరశయ్యను తయారు చేస్తున్నాడు. చకితమైన కండ్లతో నీ కోసం పదే పదే ఎదురు చూస్తున్నాడు, దారితెన్నులు కాస్తున్నాడు.

రతి క్రీడలో చాల చప్పుడు చేసే నీ కాలి గజ్జెలను తీసివేయి. చీకటితో నిండిన పొదరింట్లోకి నల్లని వస్త్రం కప్పుకొని మరీ వెళ్ళు.

సువర్ణ సుశోభిత రాధా! నీ పుణ్యం వలన ఉపరతి జరుపునపుడు, నీ మెడలోని ముత్యాలహారం శ్రీకృష్ణుని వక్షఃస్థలంపై పడుతుంది. అది తెల్లని పాలపక్షులు కలిగిన నల్లని మేఘంలా వుండగా, ఆ మేఘంపై నీవు సారస పక్షి మెరుపు లాగా వెలిగిపోతావు.

రాధా! నీ విశాల నేత్రాలే నీ సౌందర్యాన్ని అధికం చేస్తున్నాయి. జారిన చీరతో, నగ్నమై ఉన్న మొలతో ఆనంద ప్రదాయినివైన నీ శరీరాన్ని లేత ఆకులతో అమర్చిన శయ్యపై ఉంచు.

శ్రీహరి అభిమానధనుడు. ఆలస్యం చేయవద్దు. రాత్రి ముగియ బోతోంది. త్వరగా వెళ్ళు. నా మాట విని స్వామి కోరిక తీర్చు.

శ్రీహరి సేవాతత్పరుడైన జయదేవ కవి ఈ గీతాన్ని రమణీయంగా పాడగా, ఎంతో కృపాళుడు, సుమధుర గానానికి పరవశించేవాడు అయిన ఆ శ్రీహరిని ఆనందమయ హృదయాలతో అర్చించండి.

**విశేష వర్ణన**

రాధా! నీ స్వామి వేడి నిట్టూర్పులు విడుస్తున్నాడు. నీ రాకకై నిరీక్షిస్తున్నాడు. నీ కోసమై అన్వేషిస్తున్నాడు. నీతో క్రీడించడానికై సుఖమయ

శయ్యను తయారు చేస్తున్నాడు. నీకోసం వ్యాకుల చిత్తుడైనాడు. నీతోడి మదన కదనం కొరకు పరితపించి పోతున్నాడు.

నీ వక్రమైన చేష్టలలాగా సూర్యుడు ఇపుడే అస్తమించాడు. గోవిందుని విచారగ్రస్తమైన హృదయం లాగా చీకటి చిక్కపడింది.

ఓ ముగ్ధరాలా! చక్రవాక పక్షి దీన స్వరంలా దీర్ఘమైన నా మాటను వినుము. ఆలస్యం మంచిది కాదు. శ్రీహరి పొందుకు ఇదే సరియైన సమయం.

రాధా! నీవు కృష్ణుని కలుసుకోగానే రసరమ్య కథలు వినిపిస్తావని, ఆసాంతం గాఢ ఆలింగనాలతో ముంచివేసి తనతో ఆనందిస్తావని, వివిధ రీతుల క్రీడిస్తావని ఆశతో, అనేక మధుర భావాలతో కృష్ణుడు నీకై ఎదురు చూస్తున్నాడు. హరి, చీకటి నిండిన ఆ పొదరింట్లో ఉన్నాడు. విరహ వేదనతో పరితపిస్తున్నాడు. స్వేదంతో తడిసిపోయాడు. ఆలోచనలతో మూర్ఛపోయాడు.

కౌగిలింతల్లో, అధర చుంబనాల్లో, గోళ్ళ గీతల్లో, కామోద్రేకంతో రతికేళిలో ఆనందిస్తూ, కటిక చీకటిలో ఒకరినొకరు గుర్తుపట్టకుండా, రతి అంతంలో తాము భార్యాభర్తలుగా గుర్తించి, తోడుదొంగలై సిగ్గుపడుతున్నారు. ఇలాంటి లజ్జా ప్రపూర్ణ రాత్రుల్లో ప్రాదుర్భవించిన రసం మరొకటేదీ లేదు.

ఓ సుముఖీ! చీకటిలో ఏమీ కనపడక, బిత్తర చూపులతో, భయంతో, మాటిమాటికీ ఆగుతూ మెల్లమెల్లగా నడుస్తున్న మదన తరంగాల వంటి అవయవ సోయగాలతో మిన్నవైన నిన్ను గమనించి, ఆ సుందరుడైన ప్రభువు నిన్ను చేరి ఆనందించు గాక!

రాధ ముఖారవిందానికి తుమ్మెద వంటివాడు, ముల్లోకాల తలలపై కిరీటానికి అలంకారం చేకూర్చే నీలరత్నాన్ని ధరించినవాడు, లోకాలకు శత్రువులైన రాక్షసులకు యముడు, గోపాంగనల మనస్సులకు ఆనందం



ప్రసాదించే సాయంసంధ్య వంటివాడు, కంసుని వధించిన ధూమకేతువు అయిన దేవకీ నందనుడు, శ్రీహరి, మనలను సదా కాపాడు గాక!!

**ఇది సాకాంక్ష పుండరీకాక్షోత్కంఠామధుర మనేపేరుగల పదకొండవ అష్టపది.**

ప్రతి చరణ స్వారస్యం

1. మొదట్లోనే అష్టపదికి అవతారిక చెప్పబడింది.

2,3 చరణాలకు అవతారిక : ఇలా నేను చెప్పిన ప్రకారంగా కృష్ణునిదగ్గరకు పోయావంటే, అతని మనోహరమైన వేణుగానాన్ని వినగలవు అని చెలికత్తె రాధతో అంటున్నది.

4వ చరణానికి అవతారిక : చెలికత్తె రాధను అభిసారికా వేషాన్ని ధరించడానికై పురికొల్పుతూ ఆవేషధారణను గురించి తెల్పుతూ ఉంది.

5వ చరణానికి అవతారిక : రాధకు కృష్ణునిపై అత్యుత్కంఠను కలిగించడానికై చెలికత్తె ప్రేరేపిస్తున్నది.

6వ చరణానికి అవతారిక : ఈ విధంగా పురుషాయిత సుఖంలో ఉత్కంఠను కలిగించి, ఇప్పుడు నాయకుడు చేసిన రతంలో ఉత్కంఠను కల్గిస్తూ ఉంది.

7. అవతారిక : ఇలా రాధ కృష్ణునివద్దకు వెన్వెంటనే పోవడానికై చెలికత్తె ఆమెకు ప్రోత్సహిస్తున్నది.

**వికిరతి ముహుః శ్వాసాన్ దిశః పురో ముహు రీక్షతే**
**ప్రవిశతి ముహుః కుంజం గుంజన్ ముహు ర్బహుతామ్యతి ।**
**రచయతి ముహుశ్శయ్యాం పర్యాకులం ముహు రీక్షతే**
**మదన కదన క్లాంతః! కాంతే! ప్రియస్తవ వర్తతే ॥**

**తా :** ఓ రాధా! నీ ప్రియుడు మన్మథ దుఃఖంచే మిక్కిలి పీడింపబడుతున్నాడు. నీవు రాలేదని తలుస్తూ మాటిమాటికి నిట్టూర్పుల్ని విడుస్తున్నాడు. నీవు ఏ

మార్గంలో వస్తావో అని పదే పదే దిక్కులు చూస్తున్నాడు. ధ్యానం చేతనైనా ప్రియురాలిని చూస్తానని, దృష్టిని నాసాగ్రంపై నిలిపి తదేకాగ్రచిత్తుడై నిన్నే ధ్యానిస్తున్నాడు. ఒకవేళ తనకు తెలియకుండవచ్చి పొదరింట్లో నీవు దాగి ఉన్నావేమో! అని చీటికి మాటికి చప్పుడు చేస్తూ పొదరింటిలో ప్రవేశిస్తున్నాడు. ఎంతో పరితపిస్తున్నాడు. "ఇంతవరకు గురుజన భీతిచేత రాలేదు కాబోలు చివరికీ, ఎక్కడ కూడా నీ పొలకువ కానరాకపోవడంతో ఎంతో వ్యాకుల హృదయంతో దిగాలుపడి ఎదురుతెన్నులు చూస్తున్నాడు.

**అవతారిక : "నీవు శ్రీకృష్ణుని వద్దకు పోవడానికి తగిన సమయమిదే" అని సహేతుకంగా చెబుతున్నది."**

**త్వద్వామ్యేన సమం సమగ్ర మధునా తిగ్మాంశు రస్తం గతో**
**గోవిందస్య మనోరథేన చ సమంప్రాప్తం తమ స్సాంద్రతాం ।**
**కోకానాం కరుణ స్వరేణ సదృశీ దీర్ఘామదభ్యర్థనా**
**తన్ముగ్ధే! విఫలం విలంబన మసౌ రమ్యోఽభిసారక్షణః ॥**

**తా :** ఓ రాధా! నీ వక్రత్వంతో సూర్యుడు సైతం సంపూర్ణంగా అస్తమించాడు. శ్రీకృష్ణుని మనోరథంతో సమానంగా చీకటి దట్టంగా వ్యాపించింది. చక్రవాకపక్షుల కరుణాసహిత కంఠధ్వనులవలె నాప్రార్థన దీర్ఘమైంది. ఓ ముగ్ధురాలా! ఆలస్యంచేస్తే లాభంలేదు. శ్రీకృష్ణుడుంటే సంకేత స్థానానికి పోవడానికిదే మంచి సమయం!

**అవతారిక :** చీకటి దట్టంగా వ్యాపించి ఉండటంవలన ఇదియే అభిసారానికి సమయమని మరల చెబుతోంది.

**సామాంద్రక్ష్యతి వక్ష్యతి స్మరకథాః ప్రత్యంగ మాలింగనైః**
**ప్రీతి యాస్యతి రంస్యతే సఖి! సమాగత్యేతి చింతాకులః ।**
**సత్వాం పశ్యతి వేపతే పులకయత్యానందతి స్వేదతి**
**ప్రత్యుద్గ చ్ఛతి మూర్ఛతి స్థిరతమః పుంజే నికుంజే స్థితః ॥**



**తా :** ఓ రాధా! ఆ శ్రీకృష్ణుడు ఎంతో దట్టమైన చీకటి ఆవరించిన ఒక పొదరింటిలో చేరి, ఆ రాధ ఇచ్చటికి వచ్చి నన్ను చూస్తుంది. మన్మథ కథల్ని చెబుతుంది. ప్రతి అవయవాన్ని చక్కగా కౌగిలించుకొని ఎంతో ప్రేమిస్తుంది. నాతో క్రీడిస్తుంది. అని ఆలోచిస్తూ, గాఢంగా కలతపడి నిన్నే ఎదురు చూస్తున్నాను. గడగడవణుకుతున్నాడు. గగుర్పాటు పొందుతున్నాడు. అంతలో ఏ కారణమూ లేకనే సంతోషితస్వాంతుడగుచున్నాడు. శరీరమంతా చెమటపట్టగా, లేచి ఎదురుగా వస్తున్నాడు. హఠాత్తుగా మూర్ఛబోతున్నాడు.

**శ్లో. ఆశ్లేషా దను చుంబనా దను నఖోల్లేఖా దను స్వాంతజ**
**ప్రోద్బోధాదను సంభ్రమా దనురతా రంభా దను ప్రీతయోః ।**
**అన్యార్థం గతయో ర్భ్రమాన్మిళితయో స్సంభాషణై ర్జానతోః**
**దంపత్యో రిహ కోన కోన తమసి వ్రీడా విమిశ్రో రసః ॥**

**తా :** ఓ రాధా! ఈ కటిక చీకటిలో, అనేక దంపతులు విటత్వాన్ని అంగీకరించి, పురుషుడు పరకాంత కోసమూ, అతని భార్యయే పరకాంతుని కొరకూ, ఒకరికి తెలియకుండా ఒకరు బయలుదేరి, ఇద్దరూ ఒక సంకేత స్థలానికే చేరి, ఒకరి రూపాలు మరొకరు గుర్తింపజాలని గాఢాంధకారం కావడం వలన, ఆ చీకటిలో పురుషుడు పరస్త్రీని కాని, స్త్రీ పరపురుషుని కాని, తెలిసికొనలేక, భ్రమించి చివరికి దైవవశంతో మొట్టమొదటి భార్యభర్తలే ఒకేచోట కూడినవారై, తొలుదొల్త తాము భార్యాభర్తలని తెలిసికోలేక, స్త్రీ తన సంకేతిత ప్రియుడనీ, పురుషుడు తన సంకేతిత స్త్రీ అనీ భావించి, మొదట ఆలింగనాన్ని, తర్వాత చుంబనాన్ని, ఆ పిమ్మట నఖక్షతాదుల్ని, వెంటనే మన్మథోద్రేకాన్ని, అనంతరం రతిసంరంభాన్ని ఆ తర్వాత రత్యారంభాన్ని అనుభవించి రతాంతంలో అత్యంతానందం పొందుతూ పరస్పరం అనురాగంతో మాట్లాడేసరికి తాము అసలైన భార్యాభర్తలని తెలిసికొని, ఇద్దరూ దోషం చేసినవారు కావడంవలన ఒకరి దోషాన్ని మరొకరుపాటింపక, సిగ్గుపడి మెల్లగ తమ తమ స్థానాలను చేరుకున్నారు.

ఇటువంటి మన్మథసుఖానికి ఆలవాలమైన చీకటిరాత్రుల్లో ఏరసం ఉద్భవింపకుండా ఉంటుంది?

అవతారిక : రాధాప్రాప్తియే శ్రీకృష్ణుని సర్వస్వమని కృష్ణుని ఉత్కంఠను వర్ణిస్తూ రాధను త్వరపెట్టుతోంది.

**సభయ చకితం విన్యస్యంతీం దృశౌ తిమిరే పథి**
**ప్రతి తరు ముహుః స్థిత్వా మందం వదాని వితన్వతీమ్ ।**
**కథమపి రహః ప్రాప్తామంగై రనంగ తరంగిభిః**
**సుముఖి! సుభగః పశ్యన్ సత్వా ముపైతు కృతార్థతామ్ ॥**

తా : ఓ రాధా! నీవు ఈ చీకటిలో ఎంతో భయపడుతూ సంకేతస్థాన మార్గాన్ని తేరిపారజూస్తూ బయలుదేరి, ఎవరైనా చూచి గుర్తుపట్టుతారేమో అనే సందేహం చేతా, ఒకవేళ కృష్ణుడు ఈ చెట్టు దగ్గరకు వచ్చి ఉన్నాడేమో అనే అభిప్రాయం చేతా, ప్రతి చెట్టుక్రింద కొంచెంసేపు వేచిచూచి మెల్లమెల్లగా అడుగులు వేస్తూ, రాత్రికి ఉచితమైన వేషాన్ని ధరించి, కామోద్రేకంచే అవయవాలు ఉప్పొంగగా ఏదో ఒకవిధంగా తడబడుతూ ముందుకుసాగి ఏకాంతస్థలంలో కృష్ణుని కలుసుకోవలసింది. చీకటిలో అభిసారికగా వచ్చిన నిన్ను చూచి కృష్ణుడు కృతార్థుడవుతాడు కదా!

**అవతారిక : కవి, సంభోగ శృంగారరసాన్ని గుప్పిస్తూ సర్గాంతంలో మంగళాశాసనం చేస్తున్నాడు.**

**"రాధాముగ్ధ ముఖారవింద మధుపస్త్రైలోక్య మౌళిస్థలీ**
**నేపథ్యోచిత నీలరత్న మవనీభారవతారాంతకః ।**
**స్వచ్ఛందం వ్రజసుందరీ జనమనస్తోష ప్రదోషోదయః**
**కంసధ్వంసన ధూమకేతు రవతు త్వాం దేవకీనందనః" ॥**

**తా :** శ్రీరాధా ముఖారవిందానికి తుమ్మెదవంటివాడూ, ముల్లోకాలలో ఉండే, రాజాధిరాజుల కిరీటాలకు అలంకారమైన ఇంద్రనీలమణివంటివాడూ,



భూమికి భారంగా పుట్టిన శిశుపాదులకు యమధర్మరాజువంటివాడూ, గొల్లపడుచుల మనస్సులకు సంతోషాన్ని కల్గించడంలో రాత్రికి ప్రారంభంవంటివాడును, (అభిసారికలకు రాత్రి వస్తుందంటే సంతోషం అతిశయిస్తుంది.) కంసుని నాశనానికి తోకచుక్కవంటివాడు. (తోకచుక్క పుడితే జనులునాశనమవుతారనీ శాస్త్రవాక్యం అని శ్రీకృష్ణస్వామి మిమ్ము రక్షించుగాక!)

**ఇతి శ్రీ జయదేవ విరచితే గీతగోవిందేఽభిసారికావర్ణనే సాకాంక్ష పుండరీకాక్షోనామ పంచమస్సర్గః.**

ఇతి శ్రీజయదేవ కవి విరచితమైన గీతగోవిందమనేకావ్యంలో అభిసారికావర్ణనంగల సాకాంక్ష పుండరీకాక్షమనే పేరుగల ఐదవసర్గ.

* * *

## షష్ఠ సర్గ

### ధన్య (ధృష్ట) వైకుంఠ కుంకుమమ్

రాధ వియోగదుఃఖంచే బడలిపోయి అటూ ఇటూ కదలడానికి కూడా శక్తిలేకుండా, కృష్ణునిపై అనురాగభరితమై ఉండగా, దూతిక ఒకానొక పొదరింటిలో రాధను ఉండమని చెప్పి, శ్రీకృష్ణుని వద్దకు పోయి ఆమె విరహ వేదనలనన్నింటిని పూసగుచ్చినట్లు చెబుతోంది.

**శ్లో॥ అథ తాం గంతు మశక్తాంచిరమనురక్తాం లతాగృహేదృష్ట్వా ।**
**తచ్చరితం గోవిందే మనసిజమందే సఖీ ప్రాహ ॥**

**తా :** రాధ శ్రీకృష్ణుని దగ్గరకు పోవడానికి సమర్థురాలు కాకపోయింది. ఒక పొదరింటిలో ప్రవేశించి అక్కడే క్రీడించాలనే అనురాగంతో ఉండగా ఆ వృత్తాంతం తెలిసి ఆమె చెలికత్తె కామవికారాలచే మాంద్యం పొంది ఉండే శ్రీకృష్ణుని వద్దకుపోయి రాధయొక్క మన్మథావస్థను విస్తారంగా వర్ణించడం ప్రారంభించింది.

## అష్టపది - 12
## ధన్య (ధృష్ట) వైకుంఠకుంకుమము

సఖీ వాక్యాలను కవి గీతరూపంగా నిరూపిస్తున్నాడు.

**గుండక్రియారాగం - రూపకతాళం**

**శంకరాభరణరాగం - రూపకతాళం**

**గుణకరీరాగేన రూపక తాళేన గీయతే**

పశ్యతి దిశిదిశి రహసి భవంతం ।
త్వదధర మధుర మధూని పిబంతమ్ ॥
నాథ! హరే! జగన్నాథ! హరే!
సీదతి రాధావాస గృహే ॥ (ధ్రువమ్) 1

త్వదభిసరణ రభసేన వలంతీ ।
పతతి పదాని కియంతి చలంతీ ॥
నాథ! ... ... ... ... ... ... ... 2

విహిత విశద బిస కిసలయ వలయా ।
జీవతి పరమిహ తవరతి కలయా ॥
నాథ! ... ... ... ... ... ... ... 3

ముహురవలోకిత మండన లీలా ।
మధురిపు రహమితి భావనశీలా ॥
నాథ! ... ... ... ... ... ... ... 4

త్వరితముపైతి న కథమభిసారం ।
హరిరితి వదతి సఖీమనువారమ్ ॥
నాథ! ... ... ... ... ... ... ... 5

శ్లిష్యతి చుంబతి జలధర కల్పం ।
హరిరుపగత ఇతి తిమిర మనల్పమ్ ॥
నాథ! ... ... ... ... ... ... ... 6

భవతి విలంబిని విగళిత లజ్జా ।
విలపతి రోదితి వాసకసజ్జా ॥
నాథ! ... ... ... ... ... ... ... 7

శ్రీ జయదేవ కవే రిదముదితం ।
రసికజనం తనుతా మతిముదితమ్ ॥
నాథ! ... ... ... ... ... ... ... 8

**భావం :** శ్రీకృష్ణుని దగ్గరకు వెళ్ళడానికి కూడా కదిలే శక్తిలేని రాధ పొదరింటిలోనే గోవిందునితో క్రీడించగోరుతోంది. ఈ విషయాన్నే సఖి శ్రీకృష్ణునితో చెప్తోంది.

ఓ విశ్వప్రభూ! హరీ! జగన్నాథా! రాధ నీ కొరకు పొదరింట్లో విరహవేదన చెందుతోంది. పరస్త్రీల అధరామృతాన్ని రహస్యంగా గ్రహిస్తూ, ఆనందిస్తున్న నీకోసం అన్ని దిక్కులా వెదకుతోంది.

నీ దగ్గరకు రావాలని అడుగులు ముందుకు వేస్తోంది. కాని, నిన్ను కలుసుకోవాలనే తొందరలో, ఉద్వేగంతో ఆమె అడుగులు తడబడుతున్నాయి. నడువలేక విరహవేదనతో పడిపోతోంది.

లేత తామర తూడుల కంకణాలను ధరించి నీతో పూర్వం జరిపిన రతి క్రీడలను జ్ఞాపకం చేసుకొంటూ ఈ అడవిలో జీవిస్తోంది.

తన అలంకారాలను మాటిమాటికీ చూసుకుంటూ, తనను తానే కృష్ణునిగా భావిస్తోంది. రతిక్రీడకై శ్రీహరి ఎందుకు రావడం లేదని అడుగుతోంది. కటిక చీకటినే హరిగా భావించి కౌగిలించుకొని ముద్దు పెట్టుకుంటోంది. రాధ నీకోసమై అలంకరించుకొని ఎదురు చూస్తోంది. నీ రాక ఆలస్యంతో రాధ సిగ్గువిడిచి రోదిస్తోంది.

**విశేష వర్ణన**

ఓ అల్లరి కృష్ణా! మృగనయన రాధ పులకించి పోతూ సీత్కార శబ్దాలు చేస్తోంది. జడత్వంతో వికారం వల్ల వ్యాకులత పొందుతోంది. నీతో రతికేళి జరుపుతున్నట్లుగా భావించి రస సముద్రంలో తేలిపోతున్నది.

రాధ తన శరీరాన్ని వివిధ ఆభరణాలతో అలంకరించుకుంటోంది. ఆకులు కదలితే నీవే వచ్చావనుకుంటోంది. శయన శయ్యను అలంకరిస్తోంది. గాఢకాంక్షతో నిన్ను ధ్యానిస్తోంది. నీవు దగ్గర లేకపోవడంతో రాత్రి గడవడం లేదు.

జయదేవ కవి నుండి వెలువడిన ఈ మధుర గీతం రసిక జనావళిని రంజింప చేయుగాక!

ఈ గీతంలో నాయకుడు శఠుడు; నాయిక – వాసకసజ్జ, విప్రలంభ శృంగారం.



**అవతారిక :**

రాధ శ్రీకృష్ణుని మీదనే ఏకాగ్రచిత్తం గలదై ఉన్నదని చెలికత్తె చెబుతోంది.

**"విపుల పులకపాళిః స్ఫీత సీత్కారమంత**
**ర్జనిత జడిమ కాకువ్యాకులం వ్యాహరంతీ ।**
**తవ కితవ విధత్తేఽమందకందర్ప చింతాం**
**రస జలధి నిమగ్నా ధ్యానలగ్నా మృగాక్షీ ॥**

**తా :** ఓ ధూర్తుడా! శ్రీకృష్ణుడా! నీవు రాధ వద్దకు రాకపోయినప్పటికీ, ఆమె నిన్నే ధ్యానవశంచే తన సమీపంలో ఉండేవాడివిగా చేసికోగా, నీవు సంభోగ క్రియాకలాపాలు చేస్తున్నట్లు భావిస్తూ శరీరమంతా గగుర్పాటు చెందగా, ఛీత్కారాలు చేస్తూ, ఆనంద మగ్నమైన శరీరం జడప్రాయమైపోగా, ఒడలు తెలియక వికారస్వరంతో ఏమేమో పలుకుతూ కామక్రీడల్ని గురించి భావిస్తూ ఆనంద రససముద్రంలో మునిగి ఉంది.

**అవతారిక :**

చెలికత్తె శ్రీకృష్ణుణ్ణి త్వరపెట్టడానికై, "ఓ కృష్ణా! రాధ ధ్యానవశురాలై నీతో రమిస్తున్నా కూడా ప్రత్యక్షంగా నిన్ను చూడలేక ఏమీసుఖం పొందటంలేదని చెబుతోంది.

**అంగేష్వాభరణం కరోతి బహుశః పత్రేఽపి సంచారిణి**
**ప్రాప్తం త్వాం పరిశంకతే వితనుతే శయ్యాం చిరంధ్యాయతి ।**
**ఇత్యా కల్ప వికల్ప రచనా సంకల్ప లీలాశత**
**వ్యాసక్తాఽపి వినాత్వయా వతరను ర్నైషానిశం నేష్యతి ॥**

**తా :** ఓ కృష్ణా! మనోహర శరీరయైన రాధ నీవు తన దగ్గరగా లేకపోవడంచేత విరహతప్తురాలై కాలయాపనం కోసం తన ఆభరణాలన్నీ అలంకరించుకొంటోంది. చెట్లలోని ఆకు కదిలినా ఆసవ్వడికి నీవే వస్తున్నావని మాటి మాటికి సందేహిస్తున్నది. పూలపాన్పును నీకోసం సంసిద్ధం చేస్తున్నది. పరమోత్కంఠచే మనస్సులో నిన్నే ధ్యానిస్తున్నది. ఈ విధంగా

ఆభరణాలు, అలంకారాలు నీకోసం చేసికొని తీసేయడం, వస్త్రావని పూలపాన్పు సిద్ధంచేయడం అనే వికల్ప సంకల్పాల మధ్య కొట్టుమిట్టాడుతూ, మనస్సుచేత విలాసాలపట్ల ఆసక్తురాలై ఉన్న, నీవు తన దగ్గర లేనందున ఈ రాత్రిని గడపజాల లేకున్నది.

**అవతారిక :**

ఆరవసర్గను ముగిస్తూ సర్గాంతంలో మంగళం ఆచరిస్తున్నాడు.

**కిం విశ్రామ్యసి కృష్ణభోగిభవనే భాండీర భూమీరుహి?**
**భ్రాత! ర్యాహి న దృష్టిగోచర మిత స్సానంద నందాస్పదమ్ ।**
**రాధాయా వచనం తదధ్వగ ముఖాన్నందాంతికే గోపతో**
**గోవిందస్య జయంతి సాయ మతిథి ప్రాశస్త్య గర్భా గిరః ॥**

**తా :** రాధ శ్రీకృష్ణునకు తన సంకేత స్థానాన్ని తెలిపి అక్కడ విచారించడానికై రమ్మని, చెప్పడానికి భయపడి సాయంకాలపువేళలో వచ్చే అతిథిని స్వాగతం పలికి మర్యాదచేసే నెపాన్ని పెట్టుకొని ఒక బాటసారిని చూచి ద్వంద్వార్థంగా – “ఓ బాటసారీ! ఆ మట్టిచెట్టుకింద నిలుస్తావెందుకు? అక్కడ కృష్ణభోగి (నల్లత్రాచు పాము – కృష్ణుడనే భోగపురుషుడు) ఉన్నాడు. అక్కడ విశ్రాంతి తీసుకోవద్దు. ఓ అన్నా! అదిగో! ఆనందమయమై వెలుగులు విరజిమ్మే నందుని భవంతి నీ దృష్టికి కనబడలేదా? అక్కడికి వెళ్లి కావలసినంత విశ్రాంతి పొందండి” అని చెప్పగా, ఆ మాటను బాటసారి ద్వారా నందునికి చెందిన లోపలిగూఢార్థాన్ని (మట్టిచెట్టు సంకేతస్థానం కాబట్టి అక్కడికి రావాలి అనే అర్థాన్ని) గ్రహించి తత్కాలానికి తగినట్లు పలికిన శ్రీకృష్ణుని సాయంకాలపు అతిథి సత్కారవాక్యాలు సర్వోత్కృష్టాలై ఉన్నాయి.

**ఇతి శ్రీ జయదేవ విరచితమైన గీతగోవింద కావ్యంలో 'ధన్య (దృష్ట) వైకుంఠ కుంకుమ'మనే పేరుగల ఆరవసర్గ.**

* * *

# సప్తమ సర్గ

## నాగర నారాయణం

**అవతారిక :** మానవతుల అభిమానాన్ని సమూలంగా తీసివేయడానికి కత్తి వాదరవంటి చంద్రోదయాన్ని వర్ణిస్తున్నాడు.

**శ్లో॥ అత్రాంతరే చ కులటాకుల వర్త్మపాత**
**సంజాత పాతక ఇవ స్ఫుట లాంఛనశ్రీః ।**
**బృందావనాంతర మదీపయదంశు జాలైః**
**దిక్ సుందరీ వదన చందన బిందు రిందుః ॥**

**తా :** ఆరవసర్గలో చెప్పబడిన విధంగానే రాధ యొక్క చెలికత్తె శ్రీకృష్ణునికి రాధావృత్తాంతం చెబుతున్నప్పుడే జారస్త్రీల మార్గం అడ్డగించడంచే కలిగిన పాపకళంకమో అన్నట్లుగా, నల్లనిమచ్చ అందరికి తెలుస్తూ ఉండగా, తూర్పు దిక్కు అనే పడతి ముఖం మీది గంధపుబొట్టో అనే విధంగా ప్రకాశిస్తూ చంద్రుడు బృందావనమంతా ఎంతో వెలిగింపజేశాడు.

**అవతారిక :** కృష్ణవియోగ పీడితయైన రాధయొక్క విరహదుఃఖాన్ని వర్ణిస్తున్నాడు.

**“ప్రసరతి శశిధర బింబే**
**విహిత విలంబే చ మాధవే విధురా ।**
**విరచిత వివిధ విలాపం**
**సాపరితాపం చకారోచ్చైః ॥**

**తా :** ఆ రాధ చంద్రబింబం చకచక ఉదయిస్తూ ఉండగా చూచి, కృష్ణుడు తొందరగా రాకుండా ఆలస్యం చేస్తుండటానికి ఎంతో దుఃఖించి అయ్యో! అని విలపిస్తూ మిక్కిలిసంతాపాన్ని పొందింది.

## అష్టపది – 13

## నాగర నారాయణ రాసావలయం

**అవతారిక :** విరహిణియైన రాధా విలాపాన్నే గీతరూపంగా వర్ణిస్తున్నాడు.

**మాళవరాగం - యతితాళం**

**ఆహిరిరాగం - జంపెతాళం**

కథిత సమయేఽపి హరి రహహ న యయౌ వనం ।
మమ విఫలమిద మమలరూపమపి యౌవనమ్
యామి హే! కమిహ శరణం
సఖీజన వచన వంచితాఽహమ్? (ధ్రువమ్) 1

యదనుగమనాయ నిశిగహనమపి శీలితం ।
తేన మమ హృదయమిద మసమశర కీలితమ్ ॥
యామి హే! కమిహ శరణం
సఖీజన వచన వంచితాహమ్? 2

మమ మరణమేవ వరమితి వితథ కేతనా
కిమితి విషహామి విరహానల మచేతనా
యామి హే! కమిహ శరణం
సఖీజన వచన వంచితాహమ్? 3

మా మహహా! విధురయతి మధురమధుయామినీ
కాఽపి హరి మనుభవతి కృత సుకృత కామినీ
యామి హే! కమిహ శరణం
సఖీజన వచన వంచితాహమ్? 4

అహహ! కలయామి వలయాది మణిభూషణమ్
హరి విరహ దహన వహనేన బహుదూషణమ్
యామి హే! కమిహ శరణం
సఖీజన వచన వంచితాహమ్? 5

కుసుమ సుకుమార తను మతనుశర లీలయా
స్రగపి హృది హంతి మా మతి విషమశీలయా



యామి హే! కమిహ శరణం
సఖీజన వచన వంచితాహమ్? 6

అహమిహ హి నివసామి నవిగణిత వేతసా
స్మరతి మధుసూదనో మామపి న చేతసా
యామి హే! కమిహ శరణం
సఖీజన వచన వంచితాహమ్? 7

హరిచరణశరణ జయదేవ కవి భారతీ ।
వసతు హృది యువతిరివ కోమల కలావతీ ॥
యామి హే! కమిహ శరణం
సఖీజన వచన వంచితాహమ్? 8

రాధ హృదయ వేదనను చెలికత్తె కృష్ణునికి వివరించే సమయంలోనే చంద్రోదయమైంది. అంగనల మార్గానికి అడ్డురాగా, ఆ పాపకళంకం వల్ల నల్ల మచ్చగా కనిపిస్తూ చంద్రుడు తూర్పు దిక్కు అనే స్త్రీ ముఖంపై చందనపు బొట్టులాగ నిలిచి తన కిరణాలను బృందావనంలో ప్రసరింప చేశాడు. చంద్రోదయం కావడం వల్ల రహస్యంగా సంగమించడం కుదరని పని. శ్రీకృష్ణుడు ఇంకా తనవద్దకు చేరనందుకు రాధ బాధ పెరిగింది.

**భావం :** చెప్పిన సమయానికి శ్రీహరి నా వద్దకు రాలేదు. కనుక నా వయసు, సొగసు వృథా అయినట్లేనా? నా సఖి వల్ల కూడా నేను వంచించబడ్డాను. ఇపుడు నేను ఎవరిని శరణు వేడాలి?

మాధవుని కోసం చీకట్లో వెదికాను. నా స్వామి నా చెంత లేకపోవడంతో నన్ను మన్మథ బాణాలు వేధిస్తున్నాయి. శ్రీకృష్ణుడు లేకుండా ఈ వ్యర్థ స్థలంలో నిస్సహాయగా, అచేతనురాలై ఎలా ఈ విరహబాధను సహించగలను? మరణమే నాకిక శరణ్యం. మధురాతి మధురమైన ఈ వసంత రాత్రి నన్ను తీవ్రంగా బాధిస్తోంది. ఎంతో పుణ్యం చేసుకొన్న మరియొక స్త్రీ శ్రీహరితో ఆనందిస్తున్నది.

హరి విరహాగ్నిలో మండిపోతున్న నాకు ఈ మణిభూషణాలతో పని లేదు. పుష్పంలా కోమలమైన నా శరీరాన్ని, నా ఎదపైన ఉన్న ఈ పూదండ మన్మథ బాణమై వేధిస్తోంది.

అనేక వృక్షాల మాటున గల ఈ పొదరింట్లో నేను విరహంతో ఉన్నాను. మధుసూదనుడు నన్ను కనీసం తలవడం కూడ లేదు.

కోమల కళావతియైన యువతిలా శ్రీహరి చరణాల నాశ్రయించిన భక్త జయదేవ భారతి మీ హృదయాలలో వసించుగాక!

**అవతారిక :**

శ్రీకృష్ణుడు తన దగ్గరకు రాకపోవడానికి రాధ తన మనసులో అనుకొన్న కొన్ని కారణాలను ఇలా వితర్కించుకొంటున్నది.

**"తత్కిం కామపి కామినీ మభిసృతః! కిం వా కలాకేళిభిః**
**బద్ధో బంధుభి! రంధకారిణి వనాభ్యర్ణే కి ముద్భ్రామ్యతి ।**
**కాంతః క్లాంత మనామనాగపి పథి ప్రస్థాతు మేవాక్షమ!**
**సంకేతీ కృత మంజు మంజుళలతాకుంజేఽపి యన్నాగతః ॥**

**తా :** నా మనోహరుడు "మనోహరమైన ఈ సంకేత కుంజానికి వస్తానని చెప్పి ఎందుకు రావడంలేదు? కారణమేమో తెలియదు గదా! విరహతప్తురాలైన నన్ను వదలివేసి, మరోజవరాలిని తగులుకొనిపోయాడా ఏమి? అలాకాక, ఇక్కడికే వస్తుండగా మర్గామధ్యంలో తన బంధుజనంతో ఆటల్లో మరచిపోయాడా? లేకుంటే, ఈ కటికచీకట్లో సంకేతస్థానాన్ని తెలుసుకోలేక ఈ అడవి చుట్టూ యిక్కడే తిరుగుతున్నాడా? ఓహో! కాదు, కాదు నా విరహ దుఃఖంచే ఎంతో ఖిన్నుడై సంకేతస్థానానికి రాజాలకపోయి ఉండవచ్చును.

**విశే :** నాయకుడు – శరుదు; నాయిక – ఉత్కంఠిత.



**అవతారిక :**

సఖీ విషాదాన్ని చూచి శ్రీకృష్ణు దన్యాసక్తుడైనాడని ఊహించి రాధ చెబుతున్నది.

**అథా గతాం మాధవమంతరేణ**
**సఖీమియం వీక్ష్య విషాదమూకామ్ ।**
**విశంక మానా రమితం కయాఽపి**
**జనార్దనం దృష్టవ దేత దాహ ॥**

**తా :** రాధ యొక్క చెలికత్తె శ్రీకృష్ణుని దగ్గరనుండి వచ్చి విషాదంతో ఏమీ సమాధానమివ్వకుండ ఉండటంచూచి, రాధ, ఓహో! శ్రీకృష్ణుడు అన్యకాంతా సక్తుడై ఉండవచ్చును. లేకుంటే, నాచెలికత్తె ఇలా దుఃఖాన్ని పొందటానికి కారణమేమై ఉంటుంది? అని ఊహించి ఈ సంగతి అంతా తాను చూచిన దానివలె నటిస్తూ ఈ ప్రకారంగా చెప్పసాగింది.

## అష్టపది - 14

## హరిరమిత చంపకశేఖరం

**సారంగరాగం - త్రిపుటతాళం**

**వసంతరాగం - యతితాళం**

**(వసంతరాగ యతితాళాభ్యాం గీయతే)**

స్మర సమరోచిత విరచిత వేశా ।
గళిత కుసుమధర విలుళితకేశా ॥
కాఽపి మధురిపుణా
విలసతి యువతిరత్యధిక గుణా ॥ 1

హరి పరిరంభణ వలిత వికారా ।
కుచ కలశోపరి తరళిత హారా ॥

కాఽపి మధురిపుణా
విలసతి యువతిరత్యధిక గుణా ॥ 2

విచలదలక లలితానన చంద్రా ।
తదధర పాన రభస కృత తంద్రా ॥
కాఽపి మధురిపుణా
విలసతి యువతిరత్యధిక గుణా ॥ 3

చంచల కుండల దలిత కపోలా ।
ముఖరిత రశన జఘన గతిలోలా ॥
కాఽపి మధురిపుణా
విలసతి యువతిరత్యధిక గుణా ॥ 4

దయిత విలోకిత లజ్జిత హసితా
బహువిధ కూజిత రతి రస రసితా ॥
కాఽపి మధురిపుణా
విలసతి యువతిరత్యధిక గుణా ॥ 5

విపుల పులక పృథు వేపథు భంగా ।
శ్వసిత నిమీలిత వికసదనంగా ॥
కాఽపి మధురిపుణా
విలసతి యువతిరత్యధిక గుణా ॥ 7
శ్రమ జల కణ భర సుభగ శరీరా ।
పరిపతితోరసి రతి రణధీరా ॥
కాఽపి మధురిపుణా
విలసతి యువతిరత్యధిక గుణా ॥ 8

శ్రీ జయదేవ భణిత హరి రమితమ్ ।
కలి కలుషం జనయతు పరిశమితమ్ ॥



కాఽపి మధురిపుణా
విలసతి యువతిరత్యధిక గుణా ॥ 9

శ్రీకృష్ణుడు వేరొక కామినితో విహరిస్తున్నాడా? బంధువులైన గోపాంగనల రాసక్రీడల్లో చిక్కుకుపోయాడా? మైమరిచి ఈ చీకటి కీకారణ్యంలో సంచరిస్తున్నాడా? ఈ పొదరింటికి ఇంకా ఎందుకు రాలేదు? నా వియోగబాధను తట్టుకోలేక నడువలేక పోతున్నాడా?

శ్రీకృష్ణుడు లేకుండా సఖి మాత్రమే ఒంటరిగా వస్తుండటం చూచిన రాధ, జనార్దనుడు వేరొక స్త్రీతో క్రీడిస్తున్నాడనే భావించింది.

**భావం :** నాకన్న సుగుణశీలియైన మరొక స్త్రీ సముచితమైన వస్త్రాలను ధరించి, జడలో పూలతో శ్రీకృష్ణునితో మన్మథ క్రీడలో ఆనందిస్తున్నది. కుచకుంభాలపై హారం కలిగి, శ్రీహరిని కౌగిలించడం వల్ల కామవికారాన్ని సంతరించుకొంది. చంద్రుని లాంటి ఆమె ముఖంపై ముంగురులు నాట్యం చేస్తుండగా, శ్రీకృష్ణుని అధరామృతం గ్రోలి పారవశ్యంలో పులకాంకితు రాలౌతున్నది. చంచలాలైన కుండలాలు చెక్కిళ్ళపై పడి శబ్దం చేస్తున్న పెద్ద పిరుదులు కలది కృష్ణుని చూచి సిగ్గుపడుతోంది. అనేక ధ్వనులు చేస్తూ రతి క్రీడలో ఆనందిస్తూ చిరునవ్వులు చిందిస్తోంది. పులకరింతలతో ఆమె శరీరం వణుకుతోంది. రతిలో అలసి పోయి కళ్ళు మూసుకొని వుంది. కామోద్రేకంతో రమిస్తోంది. రతిక్రీడతో కలిగిన స్వేదబిందువులు శరీరానికి అందాన్ని పెంచుతున్నాయి. స్వేదంతో తడిసి సుఖిస్తోంది. రతిక్రీడలో అలసిపోయిన ఆమె శ్రీకృష్ణుని వక్షఃస్థలంపై శయనించింది.

ఈ విధంగా జయదేవ కవి వర్ణించిన శ్రీకృష్ణ గోపికా రతిక్రీడా విలాసాలు కలియుగ కలుషాలను హరించుగాక!

**ఇది హరి రమిత చంపక శేఖరమనే పేరుగల పదునాల్గవ అష్టపది.**

**అవతారిక :**

రాధ విరహపీడితయై చంద్రుడు కూడ బాధించుచున్నాడని చెబుతోంది.

**విరహపాండు మురారి ముఖాంబుజ**
**ద్యుతి రయం తిరయన్నపి వేదనామ్ ।**
**విధు రతీవ తనోతి మనోభువః**
**సుహృదయే హృదయే మదనవ్యథామ్ ॥**

**తా :** ఓ చెలీ! ఈ చంద్రుడు నాప్రియుని విరహపాండురమైన ముఖం వంటి వాడు కావడంవలన నా వియోగ దుఃఖాన్ని కొంతవరకు పోగొట్టుచున్న వాడైనా, నాకు విరోధియైన మన్మథునికి చెలికాడు కావటంచేత నాపై కక్షకట్టి నన్ను బాధిస్తున్నాడు.

## అష్టపది - 15
## హరిరసమన్మథతిలకం

**అవతారిక :** పదునాల్గవ అష్టపదిలో ఒకానొక యువతి శ్రీకృష్ణునితో అనుభవించిన విపరీత సురతం వర్ణింపబడింది. ఈ అష్టపదిలో ఒకానొక స్వాధీన భర్తృకతో కూడి కృష్ణుడనుభవించిన విలాసాలను రాధ వర్ణించి చెబుతూ ఉంది.

**సావేరిరాగం - చాపుతాళం**
**ఘూర్జరీరాగం - ఏకతాళం**
**(ఘూర్జరీ రాగైక తాలీతాలాభ్యాం గీయతే)**

సముదిత మదనే రమణీవదనే చుంబన వలితాధరే ।
మృగమదతిలకం లిఖతి సపులకం మృగమివ రజనీకరే ॥
రమతే యమునా పులిన వనే విజయీ మురారి రధునా ॥
(ధ్రువమ్)1



ఘనచయ రుచిరే రచయతి చికురే తరళిత తరుణాననే ।
కురవక కుసుమం చపలా సుషమం రతిపతి మృగకాననే ॥
రమతే యమునా పులిన వనే విజయీ మురారిరధునా ॥ 2

ఘటయతి సుఘనే కుచయుగగగనే మృగమదరుచి రూషితే ।
మనివర మమలం తారకపటలం నఖపదశశి భూషితే ॥
రమతే యమునా పులిన వనే విజయీ మురారిరధునా ॥ 3

జితబిసశకలే మృదుభుజయుగళే కరతల నళినీదళే ।
మరకత వలయం మధుకర నిచయం వితరతి హిమ శీతలే ॥
రమతే యమునా పులిన వనే విజయీ మురారిరధునా ॥ 4

రతి గృహ జఘనే విపులాపఘనే మనసిజ కనకాసనే ।
మణిమయ రశనం తోరణ హసనం వికిరతి కృత వాసనే ॥
రమతే యమునా పులిన వనే విజయీ మురారిరధునా ॥ 5

చరణ కిసలయే కమలానిలయే నఖమణిగణ పూజితే ।
బహిరపవరణం యావక భరణం జనయతి హృది యోజితే ॥
రమతే యమునా పులిన వనే విజయీ మురారిరధునా ॥ 6

రమయతి సుదృశం కామపి సుభృశం ఖల హలధర సోదరే ।
కి మఫలమవసం చిరమిహ విరసం వద సఖి! విటపోదరే ॥
రమతే యమునా పులిన వనే విజయీ మురారిరధునా ॥ 7

ఇహ రసభణనే కృత హరిగుణనే మధురిపు పద సేవకే ।
కలియుగ చరితం న వసతు దురితం కవినృప జయదేవకే ॥
రమతే యమునా పులిన వనే విజయీ మురారిరధునా ॥ 8

సఖీ! మన్మథ మిత్రుడైన చంద్రుడు తన సౌందర్యంతో నాకు కొంత ఉపశమనం కలిగిస్తున్నాడు. కాని, విరహంతో కాంతిహీనమైన శ్రీకృష్ణుని

ముఖం నా ముందు మెదలుతున్నది. అతని ముఖారవిందాన్ని చంద్రునిలో చూచి ఆనందిద్దామంటే, సఖియా! ఆయనే నా హృదయంలో కామవ్యధను అధికం చేస్తున్నాడే! ఎలా?

**భావం :** సఖీ! విజయుడైన మురారి యమునా నదీ తీరంలో ఇసుక తిన్నెల దగ్గర గల వనంలో క్రీడిస్తున్నాడు. ఒక సుందర వనిత ముఖాన్ని ముద్దు పెట్టుకొనేందుకు ఆమెను తన వైపుకు త్రిప్పుకొంటున్నాడు. ఆ సుందరి ముఖంపై కస్తూరిని అద్దుతున్నాడు. అది ఆమెను పులకింప జేస్తోంది.

యువకుల్ని సమ్మోహన పరచగల ఒక యువతియొక్క దట్టమైన అడవిలాంటి కురులలో మెరుపులాంటి పువ్వును తురుముతున్నాడు.

ఘనమైన కుచ కుంభాలపై కస్తూరిని ధరింప జేస్తున్నాడు. దానిపై తన గోళ్ళతో గాట్లు పెడుతున్నాడు. ఆమె చక్కని స్తనాలను శ్రీహరి ఆకాశంలో చుక్కల్లాగా రత్నమాలతో అలంకరిస్తున్నాడు.

ఆమె భుజాలు మృదువైన తామర తూండ్ల వలె వున్నాయి. వాటిని శ్రీకృష్ణుడు కరకమలాలతో అలంకరిస్తున్నాడు. ఆమె చేతులు పద్మ దళాల వలె ఉన్నాయి. ఆమె భుజాలు మంచులాగా చల్లగా ఉన్నాయి. వాటికి శ్రీకృష్ణుడు మరకత మణికంకణాన్ని తొడుగుతున్నాడు.

ఆమె పిరుదులు మన్మథుని స్వర్ణ సింహాసనంలా ఉన్నాయి. అవి కృష్ణుని ఉద్రేక పరుస్తున్నాయి. వాటని మణుల తోరణాలతో అలంకరిస్తున్నాడు.

ఆమె లేత పాదాలు లక్ష్మీదేవి నిలయం. అవి గోళ్ళు అనే మణులతో పూజింపబడతాయి. ఆమె ఎర్రని పాదాలు కృష్ణుని వక్షఃస్థలాన్ని ఎర్రగా చేస్తాయి. శ్రీకృష్ణుడు వాటని తన మనసులో తలుచుకొంటూ వాటికి ఎర్రని రంగు గల రసాన్ని పట్టిస్తున్నాడు.

హలధరుడైన బలరాముని సోదరుడు శ్రీకృష్ణుడు ఆ అందమైన గోపకాంతను ఆరాధిస్తుంటే, సఖీ! నేను అతనికోసం ఈ పొదరింట్లో



నిస్సహాయంగా, నీరసంగా, నిరంతరం ఎదురు చూస్తూ కూచోవడం వృథాయే కదా!

శ్రీకృష్ణుని శృంగార లీలా విలాసాన్ని, హరి గుణగణాల్ని తన గీతంలో గానం చేసే మధుసూదన పాదసేవకుడైన జయదేవ కవిపుంగవునికి కలియుగ పాపాలు అంటకుండా ఉండు గాక!

**ఇది హరిరసమన్మథ తిలకమనే పేరుగల పదునైదవ అష్టపది.**

**"నాయాతస్సఖి నిర్దయోయది శఠస్త్వందూతి! కిం దూయసే?**
**స్వచ్ఛందం బహువల్లభ స్సరమతే కిం తత్ర తే దూషణమ్ ।**
**పశ్యాద్యప్రియసంగమాయ దయిత స్యాకృష్యమాణం గుణైః**
**ఉత్కంఠార్తి భరాదివ స్ఫుట దిదం చేత స్స్వయం యాస్యతి ॥**

**తా :** ఓ సఖీ! దూతీ! శఠుడైన కృష్ణుడు దయలేనివాడై ఇక్కడికి రాకపోవడానికి నీవేలదుఃఖిస్తావు? ఆయన తన ప్రియరాళ్లయిన అనేక యువతులతో కలసి తన యిష్టానుసారంగా క్రీడిస్తున్నాడు. దానివలన కలిగే అవమానం నీకెందుకు? ఇప్పుడు నాప్రియుని గుణాలతనితో పొందిక కలుగజేయాలని, బలాత్కరంగానైనా, నీ హృదయం ఈడ్చుకొని పోకమానదు. ఇది తనంత పోకమానదు! చూడు!!

## అర్థాంతరం

ఇక్కడ రాధ చెప్పే వైఖరిని బట్టి, ఆమె దూతికకు చెప్పబడిన విషయాన్ని బట్టి, 'శఠ' మొదలైన పదాల ప్రయోగించడంవలన, ఈ శ్లోకానికి, వేరొకరీతిగా అర్థం స్ఫురిస్తూ ఉంది. ఎట్లంటే –

**అవతారిక :** ఇంతవరకు శ్రీకృష్ణుడు ఒకానొక యువతితో శృంగారకేళుల్లో తేలియాడుతున్నాడని ఊహించి, రాధ తన దూతికయైన చెలికత్తె ఎదురుగా అనేకవిధాలుగా ఆ విషయాలను వర్ణించింది. ఇప్పుడు కొన్ని కారణాలనుబట్టి

తన దూతియే శ్రీకృష్ణునితో క్రీడించి వచ్చినదని సందేహిస్తూ, వక్రోక్తిగా చెబుతూ ఉన్నది.

**"నాయాత స్సఖి! నిర్దయోయది శఠస్త్వం దూతి! కిందూయసే!!**

**తా :** ఓ దూతీ! నీవెందుకు పరితపిస్తావు? ఆ కృష్ణుడు రాకపోతే నాకు దుఃఖంకాని, నీకేమీలేదు గదా! కాబట్టి, నీ పరితాపాన్ని చూడగా ఆ కృష్ణునితో సంభోగించి కృతార్థురాలివై ఉన్నట్లు తోస్తున్నది. ఔరా! నాపై ఎంత మంచి స్నేహాన్ని చూపావు! అయిన్పటికీ, కుచోపమర్దనం, గాఢాలింగనం, నఖక్షతం, దంతక్షతం మొదలైన వానిచే నిన్ను మిక్కిలి శ్రమపెట్టి కృష్ణుడు తన నిర్దయత్వాన్ని కనబరచినాడని పరితపిస్తున్నావు కాబోలు! అవునవును, నీవాలకం చూస్తే అలాగే ఉంది! ఓహో! కాదు; ఆ కృష్ణుడు శఠుడనేనా? నీవు చెప్పేది! శఠుడు కాకపోతే అనురక్తనైన నన్ను వదలివేసి, నా సందేశాన్ని తెచ్చిన దూతికయైన నీతో ఎందుకు రమిస్తాడు?"

**"స్వచ్ఛందం బహువల్లభ స్సరమతే కింతత్రతే దూషణమ్"**

ఆ శ్రీకృష్ణునికి ఎంతోమంది ప్రియురాళ్లున్నారు. కాబట్టివారితో తన యిష్టానుసారం క్రీడిస్తాడు. అటువంటి చాలమందిలో నీవుకూడ ఓ ప్రియురాలయ్యావు కదా? ఎంతో సంతోషం. దీనిలో నీ దూషణ ఏమీ లేదుకదా?

**పశ్యాద్య ప్రియసంగమాయ దయితస్యాకృష్యమాణం గుణైః ।**
**ఉత్కంఠార్తి భరా దివస్ఫుటదిదం చేతస్స్వయం యాస్యతి ॥**

ఆ శ్రీకృష్ణుడు నీ వంటివాళ్లతో సంభోగించడమే ప్రధానకార్యంగా నెంచుకొని ఇష్టప్రకారం సంచరించే బహువల్లభుడైనా, నాకేమీ నష్టంలేదు. కాని, అతడు నన్ను ప్రేమించింది మొదలుకొని వేరొకయువతిని మనస్సులో తలచుకోవడం కూడ తెలియనివాడు. నేను కూడ అట్లే, పరపురుషుని మనస్సులో తలచుకోవడంలేదు. ఇప్పుడంటే, విధివశాన ఆ కృష్ణుని



విషయమంతా విపరీతంకావడంచేత, ఇటువంటి సమయాలలో నేను బ్రదకడంకంటే ప్రాణాలువదలటమే శ్రేయస్కరమని తలుస్తున్నాను.

## అష్టపది - 16
## నారాయణ మదనాయాసము

**అవతారిక :** ఇప్పుడు శ్రీకృష్ణునితో రమించే యువతియొక్క సౌభాగ్యసౌఖ్యాలను, కృష్ణుని విరహించే పరితపించే యువతియొక్క సంతాపాన్ని గీతరూపంగా వర్ణిస్తున్నాడు.

**పున్నాగవరాళీరాగం - ఆదితాళం**

**దేశవరాళీరాగం - రూపకతాళం**

**(దేశవరాళీరాగేణ రూపక తాళేన గీయతే)**

అనిల తరళ కువలయ నయనేన ।
తపతి న సా కిసలయ శయనేన ॥
వికసిత సరసిజ లలిత ముఖేన ।
స్ఫుటతి న సా మనసిజ విశిఖేన ॥ 1

యా రమితా వనమాలినా ।
సఖీ! యా రమితా వనమాలినా ॥ 2

అమృత మధుర మృదుతర వచనేన ॥
జ్వలతి న సా మలయజ పవనేన ॥
సఖీ! యా రమితా వనమాలినా ।
సఖీ! యా రమితా వనమాలినా ॥ 3

స్థల జలరుహ రుచికర చరణేన ।
లురతి న సా హిమకర కిరణేన ॥
సఖీ! యా రమితా వనమాలినా ।
సఖీ! యా రమితా వనమాలినా ॥ 4

సజల జలద సముదయ రుచిరేణ ।
దళతి న సా హృది విరహాభరేణ ॥
సఖీ! యా రమితా వనమాలినా ।
సఖీ! యా రమితా వనమాలినా ॥ 5

కనక నికష రుచి శుచి వసనేన ।
శ్వసతి న సా పరిజన హసనేన ॥
సఖీ! యా రమితా వనమాలినా ।
సఖీ! యా రమితా వనమాలినా ॥ 6

సకల భువన జనవర తరుణేన ।
వహతి న సా రుజ మతికరుణేన ॥
సఖీ! యా రమితా వనమాలినా ।
సఖీ! యా రమితా వనమాలినా ॥ 7

శ్రీ జయదేవ భణిత వచనేన ।
ప్రవిశతు హరిరపి హృదయమనేన ॥
సఖీ! యా రమితా వనమాలినా ।
సఖీ! యా రమితా వనమాలినా ॥ 8

ఓ సఖీ! నీవు నా దూతగా వెళ్ళి వచ్చావు. నిర్దయుడు, ధూర్తుడూ నా వద్దకు రాకపోతే ఎందుకు చింతపడుతున్నావు? అతడు ఎందరో ప్రియురాండ్లతో రతిక్రీడలు సలుపుతుంటే, అందులో నా తప్పేముంది? అతిశయించిన కోర్కెల వల్ల ముక్కలైన నా హృదయం ప్రియుని సుగుణాలచే ఆకర్షింపబడి అతనితో సంగమించుటకు వెళ్ళుతోంది. చూడు!

**భావం :** సఖీ! గాలికి కదలాడే పద్మాలవంటి కన్నులు గల వనమాలితో క్రీడించిన వనిత చిగురుటాకుల శయ్యపై పరితపించదు. కోమల పద్మం వంటి ముఖం గల వనమాలితో రమించిన స్త్రీ మన్మథుని బాణాలకు ముక్కలు కాదు.



మధురామృత వచనాలు పలికే వనమాలితో సంగమించిన స్త్రీ శీతల వాయువులకు తాపం చెందదు. తామరతూండ్ల వంటి చరణాలు గల వనమాలితో క్రీడించిన స్త్రీ చంద్రుని శీతల కిరణాలకు వెరవదు. కారుమబ్బు వంటి వనమాలితో సుఖించిన యువతి హృదయానికి విరహ వేదన సోకదు. శుభ్ర పీతాంబరధారి వనమాలితో క్రీడించిన స్త్రీ పరిజనుల వికటాట్ట హాసాలకు కలత చెందదు.

అన్ని లోకాల్లోని జనులలో సర్వోత్తమ యువకుడైన వనమాలితో రమించిన వనితను కరుణార్ద్రమైన విరహం తాకదు.

ఈ జయదేవ కవి వచనాల ద్వారా శ్రీహరి మన హృదయాలలో ప్రకాశించుగాక!

**విశేష వర్ణన :**

మనోభవునికి ఆనందం అందించే చందనవనం నుండి వీచే ఓ వాయుదేవుడా! దక్షిణ దిక్కునుండి ప్రసరించేవాడా! నీ వంకర బుద్ధిని విడిచిపెట్టు. జగతికి ప్రాణప్రదమైన వాయుదేవా! మాధవుని నా ముందు ఒక్క క్షణం నిలబెట్టు. నన్ను బాధిస్తూ నా ప్రాణాల్ని హరిస్తున్నావు.

అతడు నా మనసులో ఉండి కూడ, చెలికత్తెల మధ్య తిరగడం నన్ను బాధిస్తోంది. అమృత కిరణాలు ప్రసాదించే చంద్రుడు కూడా నన్ను విషం వలె హింసిస్తున్నాడు. శ్రీకృష్ణుని చుట్టూ నా మనసు తిరుగుతోంది. దుర్మార్గుడైన మన్మథుడు పద్మ నయనాలను పీడిస్తున్నాడు.

ఓ విదేహీ, ఓ మలయానిలుడా! నన్ను హింసించు. నా ఇంటికి నేను ప్రాణాలతో వెళ్ళను. ఓ యమునా నదీ! నీ తరంగాలతో నాదేహాన్ని తడుపు. దానితో నా శరీరానికి ఉపశమనం లభించు గాక! రాధయొక్క నల్లని వస్త్రాన్ని మాధవుడు, మాధవుని పీతాంబరాన్ని రాధ ధరించి ఉన్నారు. అది

చూచిన చెలికత్తెలు పగలబడి నవ్వరా? సిగ్గుపడుతున్న రాధను చిరునవ్వుతో చూస్తున్న శ్రీకృష్ణుడు జగానికి ఆనందం ప్రసాదించు గాక!

**ఇది నారాయణ మదనాయాసమనే పేరుగల పదునారవ అష్టపది.**

**అవతారిక :**

ఇంతకు ముందు రాధ "చేతస్స్వయం యాస్యతి" అని చెలికత్తెతో చెప్పి, ఇంతలో శ్రీకృష్ణుడు పరస్త్రీ సంగమం చేశాడని తలచి, అతని వృత్తాంతం ఒక మిషగా పెట్టుకొని, కొంతకాలయాపనం చేసి మరల మన్మథబాధను సహింపలేక, ఆ మన్మథునికి సహాయకుడైన మలయమారుతాన్ని దూషించడం ప్రారంభించింది.

**మనోభవానందన! చందనానిల!**
**ప్రసీదరే దక్షిణ! ముంచ వామతామ్ ।**
**క్షణం జగత్ప్రాణ! నిధాయ మాధవం**
**పురో మమ ప్రాణహరో భవిష్యసి ॥**

**తా :** ఓ మలయానిలుడా! నీవు లోకాలకెల్ల ప్రాణస్వరూపుడవైనప్పటికీ, నాకు విరోధియైన మన్మథునితో చేరి అతని సంతోషానికై విపరీతవృత్తి నవలంబించి ఉన్నావు. ఇంత మాత్రాన నీవు మొనగాడవు కాబోవు! కాబట్టి, నీ వంకరతనాన్ని కట్టిపెట్టి, కాస్త దయారసాన్ని వహించి నాకు ప్రసన్నుడివి కావాలి. నాప్రియుడైన కృష్ణుని తోడైవచ్చి నా వద్దనిలువవయ్యా! అలా చేయకపోతే, నీవు జగత్తుకు ప్రాణం పోసేవాడుగా కాకుండా, జగత్తుయొక్క ప్రాణాలను హరించేవాడే అవుతావు సుమా!

**అవతారిక :**

ఇలా మలయమారుతాన్ని దూషించి, "ఒకరిని దూషించడందేనికి? నాదే అపరాధం" అనుకొని తన చిత్తాన్నే నిందించుకొంటూ ఉంది.



**"రిపు రివ సఖీసంవాసోஉ_యం శిఖీవ హిమానిలో**
**విషమివ సుధారశ్మి ర్యస్మిన్ దునోతి మనోగతే ।**
**హృదయ మదయే తస్మి న్నేవం పునర్వలతే బలాత్**
**కువలయ దృశాం వామః కామో నికామ నిరంకుశః ॥**

**తా :** ఏ కృష్ణుని తలచినంత మాత్రాననే చెలికత్తెలతో కలిసి ఉండటం శత్రువులలాగా, చల్లగాలి అగ్నిలాగా, చంద్రుడు విషంలాగా పరితాపాన్ని కల్గిస్తూ ఉండేవారో, అటువంటి దయారహితుడైన శ్రీకృష్ణునే నాహృదయం బలాత్కరంగా పోయి ఆశ్రయిస్తున్నది. ఆహా! ఏమి ఈ చిత్రం! నిరంకుశ ప్రవృత్తి గల మన్మథుఁడెల్లప్పుడు స్త్రీల విషయంలో వక్రించే ఉంటాడు కదా!

**అవతారిక :**

రాధ విరహదుఃఖాన్ని ఓర్వలేక మలయమారుతాదుల్ని నిందాగర్భంగా ప్రార్థిస్తూ ఉంది.

**"బాధాం విధేహి మలయానిల! పంచబాణ!**
**ప్రాణాన్ గృహాణ న గృహం పునరాశ్రయిష్యే ।**
**కింతే కృతాంతభగిని! క్షమమా తరంగైః**
**అంగాని సించమమ శామ్యతు దేహదాహః ॥**

**తా :** ఓ మలయ మారుతమా! (నీవు గొప్పయింట్లో పుట్టిన వాడివికాబట్టి ఇతరుల్ని బాధించడం యుక్తం కాదని సూచితం) నీవు బాధించవయ్యా! ఓ మన్మథుడా! నీవు నా ప్రాణాలను తీసి వేయవయ్యా! ఓ యమునానదీ! అలా ఊరికే ఉంటావెందుకు? నీ తరంగాలచే నా అంగాలను తడుపరాదా? అందుచేత నా శరీరతాపమైనా కొంత శాంతిస్తుంది కదా!

**అవతారిక :**

ఏడవ సర్గాన్ని ముగిస్తూ సర్గాంతంలో శ్రీవైష్ణవులకు మంగళాశాసనం చేస్తున్నాడు.

**ప్రాతర్నీల నిచోల మచ్యుత మురస్సంవీత పీతాంబరం**
**రాధాయా శ్చకితం విలోక్య హసతి స్వైరం సఖీమండలే ।**
**క్రీడా చంచల మంచలం నయన యో రాధాయ రాధాననే**
**స్వాదుస్వైర ముఖోఽ యమస్తు జగదానందాయ నందాత్మజః ॥**

**తా :** శ్రీ రాధాకృష్ణులు రాత్రివేళల్లో తమ ఇచ్ఛానుసారం క్రీడిస్తూ ఉన్న సమయంలో ఒకరి వస్త్రాలు మరొకరి వస్త్రాలుగా తారుమారైపోయాయి. శ్రీకృష్ణుని పీతాంబరాన్ని రాధతీసుకోగా, రాధ కప్పుకొని వచ్చిన నల్లని దుప్పటి శ్రీకృష్ణుడు కట్టుకొని ఉదయం క్రీడామందిరాన్ని వెలువడిరాగా సఖీజనులంతా వారి వేషాలనుచూచి పకపక నవ్వసాగారు. అదిచూచి ఎంతో సిగ్గుపడి రాధముఖాన్ని క్రేగంట చూస్తూ మనోహరంగా చిరునవ్వు నవ్వే శ్రీకృష్ణస్వామి లోకానికి ఆనందాన్ని కల్గించుగాక!

**విశే :** రసం–హాస్యం; నాయకుడు–శరుడు; నాయిక–అభిసారిక.

**ఇతి శ్రీ జయదేవకవి విరచితమైన గీతగోవింద కావ్యంలో**
**విప్రలబ్ధావర్ణనంలో నాగరనారాయణమనే పేరుగల ఏడవసర్గ.**

ఇతి శ్రీ జయదేవకృతౌ గీతగోవిందే విప్రలబ్ధా వర్ణనే
నాగరనారాయణో నామ సప్తమస్సర్గః

* * *

# అష్టమ సర్గ
## విలక్షణ లక్ష్మీపతి

**అవతారిక :** ఈ విధంగా రాధ శ్రీకృష్ణ తత్పరయై కన్నీరుమున్నీరై విలపిస్తూ ఉండగా, ఆర్తత్రాణ పరాయణుడూ, జగత్కారణ భూతుడూనైన శ్రీకృష్ణుడు ఆమె ఎదుట మనోహరాకారంతో సాక్షాత్కరించాడు. ఆ విషయాన్ని కవి వర్ణిస్తున్నాడు.

**అథ కథ మపి యామినీం వినీయ**
**స్మర శర జర్జరితాఽ పి సాప్రభాతే ।**
**అనునయ వచనం వదంత మగ్రే**
**ప్రణత మపి ప్రియ మాహ సాభ్యసూయమ్ ॥**

**తా :** రాధ వియోగపీడచే ఏదో ఒకవిధంగా రాత్రంతా గడిపి మన్మథ బాణాలచే ఎంతో కొట్టబడిందై, ప్రాతఃకాలంలో వచ్చి, వినయపు మాటల్ని పలుకుతూ తనమ్రోల నిలబడివున్న శ్రీకృష్ణునిచూచి మిక్కిలి అసూయతో ఇలా పలికింది.

## అష్టపది - 17
## లక్ష్మీపతిరత్నావళి

**అవతారిక :** రాధ శ్రీకృష్ణుని లక్షణాలనుబట్టి పరస్త్రీ సంగమంచేసి వచ్చాడని కోపించి ఖండితనాయికగా ఈర్ష్యా కషాయితనేత్రయై ఇలా పలుకుతూ ఉంది.

**భైరవిరాగం - ఆదితాళం**

**(భైరవీరాగ యతితాళాభ్యాం గీయతే)**

రజని జనిత గురు జాగర రాగ కషాయిత మలస నిమేషమ్ ।
వహతి నయనమనురాగమివ స్ఫుటముదిత రసాభినివేశమ్ ॥
(హరి హరి!) యాహి మాధవ! యాహి కేశవ! మావద కైతవ వాదమ్।
తా మనుసర సరసీరుహలోచన! యా తవ హరతి విషాదమ్ ॥ 1

కజ్జల మలిన విలోచన చుంబన విరచిత నీలిమ రూపం ।
దశన వసనమరుణం తవ కృష్ణ! తనోతి తనోరనురూపమ్ ॥
(హరి హరి!) ... ... ... ... విషాదమ్ 2

వపురనుహరతి తవ స్మర సంగర ఖర నఖర క్షత రేఖమ్ ।
మరకత శకల కలిత కలధౌత లిపేరివ రతిజయ లేఖమ్ ॥
(హరి హరి!) ... ... ... ... విషాదమ్ 3

చరణ కమల గళదలక్త సిక్తమిదం తవ హృదయముదారమ్ ।
దర్శయతీవ బహిర్మదనద్రుమ నవ కిసలయ పరివారమ్ ॥
(హరి హరి!) ... ... ... ... విషాదమ్ 4

దశన పదం భవదధర గతం మమ జనయతి చేతసి ఖేదమ్ ।
కథయతి కథమధునాఽపిమయా సహ తవ వపురే తదభేదమ్ ॥
(హరి హరి!) ... ... ... ... విషాదమ్ 5

బహిరివ మలినతరం తవ కృష్ణ! మనోపిఽభవిష్యతి నూనం ।
కథమథ వంచయసే జనమనుగత మసమశర జ్వర దూనమ్ ॥
(హరి హరి!) ... ... ... ... విషాదమ్ 6

భ్రమతి భవానబలా కబళాయ వనేషు కిమత్ర విచిత్రం ।
ప్రథయతి పూతని కైవ వధూ వద నిర్దయ బాల చరిత్రమ్ ॥
(హరి హరి!) ... ... ... ... విషాదమ్ 7

శ్రీ జయదేవ భణిత రతి వంచిత ఖండిత యువతి విలాపమ్ ।
శృణుత సుధామధురం విబుధా విబుధాలయతోఽపిదురాపమ్ ॥
(హరి హరి!) ... ... ... ... విషాదమ్ 8

రాత్రంతా మన్మథ బాణాలతో అత్యంత వేదనాగ్రస్తురాలైన రాధ, తెల్లవారగానే తన ప్రియుడు తన ఎదుట సవినయంగా నిలబడి, తన



అపరాధాన్ని మన్నించమని ప్రాధేయ పడుతున్నాడు. రాధ అసూయతో ఇలా అంటోంది :

**భావం :** మాధవా! కేశవా! నీవు కపట నాటకాలాడవద్దు సుమా! పద్మ నయనుడా! నీ విరహాన్ని చల్లార్చే ఆ యువతి వెంటే వెళ్ళు. నీ ఎర్రబడిన కనురెప్పల్లో అలసట, రసాభినివేశం, అనురాగం స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఆ భామయొక్క కాటుక కళ్ళను నీవు ముద్దు పెట్టుకోవడంవల్ల నల్లబడిన నీ అధరాలు నీ నల్లని రూపానికి అతికినట్లు సరిపోయింది. రాసక్రీడల్లో గోళ్ళ గాట్లు తగిలిన నీ శరీరం మరకత శకలాలతో, బంగారు ఆభరణాలతో రతిజయ జయలేఖ లాగ ప్రకాశిస్తోంది. ఒక గోపికాంగన చరణాల నుండి జారుతున్న ఎర్రని లత్తుకతో తడిసిపోయిన నీ వక్షఃస్థలం చిగురుటాకులాగ ఉంది. నీ పెదవిపై వేరొక యువతి చేసిన (దంతక్షతాలు) పంటి గాట్లు నాకు అమిత బాధను కలిగిస్తున్నాయి. నీ శరీరం నీ మనస్సు లాగే మలినమైపోయింది. ఎందుకంటే మన్మథ బాధను తట్టుకోలేక నిన్ను ఆశ్రయిస్తున్న వారిని నీవు ఇలాగ వంచిస్తున్నావు కనుక.

నీవు వనంలో అబలలను కబళించడానికే ఊరక విహరిస్తుంటావు. ఇందులో ఆశ్చర్యమేమీ లేదు. ఎందుకంటే నీ చిన్నతనంలోనే నీవు పూతనను చంపిన దుర్మార్గపు చరిత్ర కలిగినవాడవు కదా!

రతి వంచిత నాయిక యొక్క వేదనను జయదేవ కవి ఈ గీతంలో వర్ణించగా, అందులో స్వామి మధుర శృంగార చరిత్రను వినండి.

**విశేషం :** ఓ మోసకారీ! ఆ ప్రియురాలి చరణాల లత్తుకతో ఎర్రబడిన నీ దేహం అనురాగాన్ని కనపరుస్తోంది. ఇలా నిన్ను చూస్తుంటే, మన సుప్రసిద్ధ ప్రేమ భగ్నమైపోతోంది. దీనివల్ల దుఃఖం కంటే సిగ్గుతో బాధ పడుతున్నాను.

లేడికన్నుల వనితల మనస్సులను మూర్ఛిల్లజేసేది, తలలూపేదీ, మందారాలను క్రింద పడవేసేదీ, స్తంభించగలదీ, ఆకర్షించగలదీ,

బాధించగలదీ, సంతోషింప చేసేదీ, గర్వ మదాంధులైన రాక్షసులచే బాధింపబడే దేవతల దుఃఖాలను నశింప జేసేదీ, కంసుని వధించినదీ అయిన శ్రీకృష్ణ వేణుగానం అత్యధిక శ్రేయస్సు కలిగించు గాక!

**అవతారిక :** "ఓ రాధా! నీకన్న నాకు వేరే ప్రియురాలు లేదే" అని అంటావేమో చెబుతాను, విను" అంటోంది.

"ఓ రాధా! నీవు కనబడక పోయినందున దుఃఖంచే రాత్రి అంతా వనమంతా వెదికివెదికి వేసారి, నిద్రలేక కండ్లు ఎఱ్ఱబడ్డాయి గాని, వేరొక యువతి కోసం రాత్రంతా జాగరణ చేయడంచేత మాత్రం కండ్లు ఎఱ్ఱబడలేదు సుమా!

**చరణం :** "ఓ రాధా! నీకు సమర్పించడానికి తామరపూలను కోయబోగా దానినుండి ఒక తుమ్మెద హఠాత్తుగాలేచి నా పెదవిని కరిచింది. కాని, అది దంతక్షతం మాత్రం కాదు సుమా!" ఆ మనోమాలిన్యాన్నే చెబుతోంది.

**ఇది లక్ష్మీపతి రత్నావళి అనేపేరుగల పదునేడవ అష్టపది**

**అవతారిక :** ఈ విధంగా రాధ ఖండిత నాయికయై ప్రౌఢత్వాన్ని అవలంబించి శ్రీకృష్ణుని ఆక్షేపిస్తూ ఉంది.

**త వేదం పశ్యంత్యాః ప్రసరదనురాగం బహి రివ**
**ప్రియాపాదా లక్తచ్ఛురిత మరుణచ్ఛాయ హృదయమ్ ।**
**మ మాద్య ప్రఖ్యాత ప్రణయ భరభంగేన కితవ**
**త్వదాలోక శ్శోకా దపి కి మపి లజ్జాం జనయతి ॥**

**తా :** ఓ వంచకాగ్రేసరుడా! ప్రియురాలి పాదాలకుగల లత్తుక అంటుకొని అనురాగమే బయటికి వెలువడివచ్చిందా, అనేటట్లుగా, ఎఱ్ఱనిరంగుగల నీ హృదయాన్ని చూస్తుండగా నాకు నీ దర్శనం జగత్ప్రసిద్ధమైన మనయొక్క స్నేహాన్ని చెడగొట్టిన (అన్యస్త్రీతో కలిసిన) వాణ్ణికావడం వలన దుఃఖానికంటే చెప్పరానంతగా సిగ్గు కల్గుతూ ఉంది.



**"అంతర్మోహన మౌళి ఘూర్ణన చలన్మందారవిభ్రంశన**
**స్తంభాకర్షణ దృష్టి హర్షణ మహామంత్రఃకురంగీదృశామ్ ।**
**దృప్యద్దానవ దూయమాన దివిషద్దుర్వార దుఃఖాపదాం**
**భ్రంశః కంసరిపో స్సమర్పయతువ శ్రేయాంసి వంశీరవః ॥**

**తా :** స్త్రీల విషయంగా మనోమోహనం (మోహనం) శిరఃకంపం. (వశీకరణం) తలనుండి పారిజాత పుష్పపాతం (మారణం) (మ్రానుపాటు) (స్తంభనం) జనాకర్షణం (ఆకర్షణం) వియోగి జనాన్నిబాధించడం (ఉచ్చాటనం) అనే విషయాలలో మహామంత్రమైనదీ, గర్వితులైన రాక్షసులచే ఎంతో బాధపొందే దేవతల ఆపదల్ని వశింపజేసేదీ, అయిన శ్రీకృష్ణుని వేణుగానం మీకందరికీ మంగళాన్ని కల్గించుగాక!

**ఇది శ్రీ జయదేవ కవికృతమైన గీతగోవిందకావ్యంలో విలక్షణ లక్ష్మీపతి అనే పేరుగల ఎనిమిదవసర్గ**

* * *

# నవమ సర్గ

## ముగ్ధ ముకుందము

**అవతారిక :** చెలికత్తె, ప్రణయకోపంచే శ్రీకృష్ణుని నిందించి కలహాంతరితయై పరితపిస్తున్న రాధను గురించి ఇలా చెబుతోంది.

**"తా మథ మన్మథఖిన్నాం**
**రతి రస భిన్నాం విషాద సంపన్నామ్ ।**
**అను చింతిత హరిచరితాం**
**కలహాంతరితా మువాచ రహసి సఖీ ॥**

**తా :** రాధ మన్మథ బాధచే మిక్కిలి దుఃఖిస్తూ సంభోగాభిలాషవలన పరితపిస్తూ, శ్రీకృష్ణుని చరిత్రాన్నే ఎల్లప్పుడు ధ్యానిస్తూ ఉండగా ఆమె చెలికత్తె వచ్చి రహస్యంగా ఇట్లని చెప్పింది.

**విశే : నాయకుడు :** అనుకూలుడు, **నాయిక :** ప్రౌఢధీర (మానవతి)

**చెలికత్తె :** దూతిక

## అష్టపది - 18
## అమందముకుందము

**అవతారిక :** ఆ సఖీ వాక్యాలనే గీతరూపంగా చెబుతున్నాడు.

**యదుకులకాంభోజిరాగం - ఆదితాళం**

**రామకరీరాగం - ఆదితాళం**

**ఘూర్జరీరాగం - యతితాళం**

**(ఘూర్జరీ రాగేన యతితాళాభ్యాం గీయతే)**

హరి రభిసరతి వహతి మధు పవనే ।
కి మపర మధిక సుఖం సఖి! భవనే ॥
మాధవే! మా కురు మానిని! మానమయే ॥ (ధ్రువమ్) 1



తాళ ఫలాదపి గురుమతి సరసం ।
కిము విఫలీ కురుషే కుచ కలశమ్ ॥
మాధవే! మా కురు మానిని! మానమయే ॥ 2

కతి న కథితమిద మనుపద మచిరం ।
మా పరిహర హరిమతిశయ రుచిరమ్ ॥
మాధవే! మా కురు మానిని! మానమయే ॥ 3

కిమితి విషీదసి రోదిషి వికలా ।
విహసతి యువతి సభా తవ సకలా ॥
మాధవే! మా కురు మానిని! మానమయే ॥ 4

మృదు నళినీదళ శీతల శయనే ।
హరిమవలోకయ సఫలయ నయనే ॥
మాధవే! మా కురు మానిని! మానమయే ॥ 5

జనయసి మనసి కిమితి గురు ఖేదం ।
శ్రుణు మమ వచన మనీహితభేదమ్ ॥
మాధవే! మా కురు మానిని! మానమయే ॥ 6

హరిరుపయాతు వదతు బహు మధురం ।
కిమితి కరోషి హృదయమతివిదురమ్ ॥
మాధవే! మా కురు మానిని! మానమయే ॥ 7

శ్రీ జయదేవ భణిత మతిలలితం ।
సుఖయతు రసికజనం హరి చరితమ్ ॥
మాధవే! మా కురు మానిని! మానమయే ॥ 8

మన్మథ బాణాలతో ఖిన్నురాలై, రతి సౌఖ్యానికి దూరమై విరహతప్తలాగా, శ్రీహరి కథనాలనే నిరంతరం చింతన చేస్తున్న కలహాంతరితయైన రాధతో ఆమె సఖి ఇలా అంటోంది :

**భావం :** ఓ సఖీ! మాధవునిపట్ల కోపం వహించకు. వసంతకాల సమీరం వచ్చే సమయంలో శ్రీహరి నీ రహస్య ప్రదేశానికి వెళ్ళాడు. నీకు ఇంత కంటె సుఖప్రదమైన శుభవార్త మరేముంది చెప్పు!

తాటి పండ్లకంటే పెద్దవి, మిక్కిలి రసవంతములైన నీ కుచ కలశాలను ఎందుకు వృధా చేసుకొంటావు? రతి సౌఖ్యానికి ఎందుకు దూరమౌతావు? మనోహరమూర్తి శ్రీహరిని ఎన్నటికీ పరిత్యజించకు. ఈ విషయమే నేను నీకు ఎంతగానో, ఎన్నో సార్లు చెపుతూనే వున్నాను. ఏమని దుఃఖిస్తున్నావు? ఎందుకు రోదిస్తున్నావు? ఇది చూచి నీ స్నేహితురాళ్ళు హేళన చేస్తూ నవ్వుకొంటున్నారు.

నీటి తుంపరలతో చల్లని తామరాకుల శయ్యపై పవళించి ఉన్న ఆ శ్రీహరిని సేవించి, నీ కనులకు పండువ చేసికొని, జీవితాన్ని సఫలం చేసుకో. నీవు దుఃఖించవలసిన కారణమే లేదు. నా మాటలు నమ్ము.

నాకు నీ పట్ల ఏ భేదభావమూ లేదు. శ్రీహరి నీ వద్దకు తప్పక వస్తాడు. నీతో మధురాతి మధురమైన మాటలతో నీతో సంభాషిస్తాడు. అర్థం లేకుండా ఇలా ఎందుకు నీవు నీ మనస్సును దుఃఖపెట్టుకొంటున్నావు?

భక్త జయదేవ కవి పలికిన ఈ హరి చింతనలు రసికజనులకు ఆనందం కలిగించు గాక!

### విశేష వర్ణన

నీ ప్రియుడు మాధవుడు నీ పట్ల చాల స్నేహంగా ఉన్నా కూడా నీవు ఎందుకు పరుషంగా మాట్లాడుతున్నావు? అతడు ప్రమాణం చేసి చెప్తున్నా కూడా నీవు ఎందుకు స్తబ్ధురాలిగా ఉంటున్నావు? అతడు ఇంతటి అనురాగాన్ని నీ పట్ల చూపుతున్నా, నీవు అతనిని ఎందుకు ద్వేషిస్తున్నావు? నీ యెడల అతను ఇంత సుముఖుడై వున్నా కూడా, నీవు ఎందుకు ఇంత



విముఖురాలుగా వున్నావు? ఇలాంటి నీ ప్రవర్తన వల్ల చందనం విషంగాను, చల్లని కిరణాల చంద్రుడు సూర్యునిగాను, మంచు అగ్నిగాను, కేళీయానందం యాతనగాను మారడంలో ఆశ్చర్యం ఏముంది? అది యుక్తమే కదా!

ఎంతో ఆదరణతో వినమ్రులమై, ఆనందించే పురందరాది దేవతా బృందం యొక్క కిరీటాలలోని ఇంద్రనీల మణులే భ్రమరాలుగా, స్వచ్ఛంగా అందంగా ప్రవహించే మందాకినీ నదినే మకరందంగా గల మధుసూదనుని పాదారవిందాలకు సకల అశుభాలను తొలగించమని ప్రార్థిస్తూ నమస్కరిస్తున్నాను.

**ఇది అమందముకుందమనే పేరుగల పదునెనిమిదవ అష్టపది.**

**అవతారిక :** చెలికత్తె రాధయొక్క దుశ్చేష్టల్ని అనుకరిస్తూ ఆమెను మందలిస్తూ ఉంది.

**స్నిగ్ధే యత్పురుషాఽసి యత్ప్రణమతి స్తబ్ధాఽసియద్రాగిణి**
**ద్వేషస్థాఽసి యదున్ముఖే విముఖతాం యాతాఽసితస్మిన్ ప్రియే ।**
**తద్యుక్తం విపరీతకారిణి! తవ శ్రీఖండ చర్చావిషం**
**శీతాంశు స్తపనోహిమం హుతవహః క్రీడా ముదో యాతీనాః ॥**

**తా :** ఓ రాధా! స్వీయం కృతాపరాధం వలన కలిగిన కష్టానికి చింతించడం దేనికి? నీ విపరీత కార్యాలే నిన్నింతవరకు తెచ్చాయి! ఓసీ! నీ ప్రియుడు సరసుడై నీ దగ్గరకు వచ్చినప్పుడు నీవేల కఠినురాలైనావు? అతడు నమస్కరిస్తూ ఉండగా బదులు చెప్పకుండా ఎందుకు మొద్దుబారి ఉండినావు? అతడు నీమీద, అనురాగం కలిగి ఉండగా నీవేలకు శత్రురాలివలె వ్యవహరిచావు? అతడు ప్రసన్నుడై ఉండగా, నీవెందుకు విముఖురాలైనావు? ఈ విపరీతపు పనుల్ని చేసినందువల్ల నీకు చందనలేపం విషంలాగా, చంద్రుడు సూర్యునిలాగా, మరాకు నిప్పుమాదిరిగా, శృంగారకేళుల్లోగల కోరికలు నరకబాధవలె తాపకల్గించడం యుక్తమే కదా!

**అవతారిక :** జయదేవకవి తొమ్మిదవ సర్గాన్ని ముగిస్తూ, విఘ్నాలన్నీ ఉపశమించడానికై శ్రీకృష్ణునికి నమస్కరిస్తున్నాడు.

**సాంద్రానంద పురందరాది దివిషద్బృందై రమందాదరాత్**
**ఆ నమ్రైర్మకుటేంద్ర నీలమణిభి స్సందర్శి తేందిందిరమ్ ।**
**స్వచ్ఛందం మకరందసుందర మిళన్మందాకినీ మేదురం**
**శ్రీగోవింద పదారవింద మశుభస్కందాయ వందామహే ॥**

**తా:** దేవేంద్రాది దేవతలు పరమానందంతో విచ్చేసి తలలువంచి కిరీటాలు పాదాలకు తగిలేటట్లు నమస్కరిస్తూ ఉండగా, వారి కిరీటాలలోని ఇంద్రనీలమణులు తుమ్మెదలలాగా విష్ణుపాదంలో ఇచ్ఛానుసారంగా పారుతున్న గంగానదియే మకరంద ధారలాగా, ప్రకాశిస్తూ ఉండగా, తమరూపులవలె తేజరిల్లే శ్రీకృష్ణుని పాదాలకు అమంగళాలు తొలగడానికై నమస్కరిస్తున్నాను.

**ఇతి శ్రీ జయదేవకృతౌ గీతగోవిందే కలహాంతరితా వర్ణనే**
**ముగ్ధముకుందోనామ నవమస్సర్గః**

ఇది శ్రీజయదేవ విరచితమైన గీతగోవింద కావ్యంలో కలహాంతరిత వర్ణన మనే ముగ్ధముకుంద నామధేయంగల తొమ్మిదవ సర్గ.

* * *

# దశమ సర్గ

## చతుర చతుర్భుజము

**అవతారిక :** సాయంకాల సమయంలో చెలికత్తె చెప్పిన సాంత్వన వాక్యాలచే కొంతకోపాన్ని శమింపజేసుకొని మన్మథబాణ తాడితయై దుఃఖిస్తున్న రాధ వద్దకు వచ్చి శ్రీకృష్ణుడు స్వయంగా బతిమాలుకుంటున్నాడు.

**అత్రాంతరే మసృణ రోషవశా దసీమ**
**నిశ్శ్వాస నిస్సహ ముఖీం సుముఖీముపేత్య ।**
**సవ్రీడ మీక్షిత సఖీవదనాం దినాంతే**
**సానందగద్గద పదం హరి రిత్యువాచ ॥**

**తా :** శ్రీకృష్ణుడు సాయం సమయవేళలో ఎంతో రోషంతో ఎడతెగని నిట్టూర్పుల్ని విడుస్తూ ఉండటంవలన ఓర్వలేక ముఖంతో సిగ్గుచే చెలికత్తె ముఖం చూచుచున్న రాధ వద్దకుపోయి ఆనందవశంతో మాటలు తడబడుతుండగా ఇలా చెప్పసాగాడు.

## అష్టపది - 19
## చతుర చతుర్భుజరాగ రాజి చంద్రోద్యోతము

**అవతారిక :** శ్రీకృష్ణుని వాక్యాలను గీతరూపంగా నిర్దేశిస్తున్నాడు.

**దేశవరాళిరాగం - మధ్యమాదితాళం**
**ముఖారిరాగం - జంపెతాళం**
**(దేశవరాళీరాగాష్ట తాళాభ్యాం గీయతే)**

వదసి యది కించిదపి దంతరుచి కౌముదీ హరతి దర తిమిరమతిఘోరమ్।
స్ఫురదధర శీధవే తవ వదన చంద్రమా రోచయతు లోచన చకోరమ్॥
ప్రియే! చారుశీలే! ప్రియే! చారుశీలే! ముంచమయి మానమనిదానం ।
సపది మదనానలో దహతి మమ మానసం-దేహి ముఖ కమల మధు పానమ్॥
(ధ్రువమ్) 1

సత్య మే వాసి యది సుదతి! మయి కోపినీ-దేహి ఖర నఖర శరఘాతం।
ఘటయ భుజ బంధనం జనయ రద ఖండనం-యేన వా భవతి సుఖ జాతమ్॥
ప్రియే! ... ... ... ... మధుపానమ్॥ 2

త్వమసి మమ భూషణం త్వమసిమమ జీవనం-త్వమసి మమ భవ జలధి రత్నమ్।
భవతు భవతీహ మయి సతతమనురోధినీ-తత్ర మమ హృదయ మతియత్నమ్॥
ప్రియే! ... ... ... ... మధుపానమ్॥ 3

నీల నళినాభమపి తన్వి! తవ లోచనం-ధారయతి కోక నద రూపమ్।
కుసుమ శర బాణ భావేన యది రంజయసి-కృష్ణ మిదమే తదనురూపమ్॥
ప్రియే! ... ... ... ... మధుపానమ్॥ 4

స్ఫురతు కుచకుంభయో రుపరి మణిమంజరీ-రంజయతు తవ హృదయ దేశం।
రసతు రశనాఽపి తవ ఘన జఘన మండలే-ఘోషయతు మన్మథ నిదేశమ్॥
ప్రియే! ... ... ... ... మధుపానమ్॥ 5

స్థల కమల గంజనం మమ హృదయ రంజనం-జనిత రతి రంగ పరభాగం॥
భణ మసృణవాణి! కరవాణి చరణ ద్వయం-సరస లసదలక్తక సరాగమ్॥
ప్రియే! ... ... ... ... మధుపానమ్॥ 6

స్మర గరళ ఖండనం మమ శిరసి మండనం-దేహి పద పల్లవ ముదారం।
జ్వలతి మయి దారుణో మదన కదనానలో-హరతు తదుపాహిత వికారమ్॥
ప్రియే! ... ... ... ... మధుపానమ్॥ 7

ఇతి చటుల చాటు పటు చారు ముర వైరిణో-రాధికామధి వచన జాతం।
జయతి జయదేవకవి భారతీ భూషితం-మానినీ జన జనిత శాతమ్॥
ప్రియే! ... ... ... ... మధుపానమ్॥ 8

రాధ క్రోధంతో నిట్టూరుస్తోంది, రగలిపోతోంది. చెలికత్తె సమక్షంలో శ్రీకృష్ణుని వైపు దుఃఖభారంతో, విరహ వేదనతో రాధ దీనంగా చూస్తోంది.



అది సాయంవేళ, బిడియంతో మెల్లమెల్లగా రాధ దగ్గరకు చేరిన మాధవుడు ఆనందంతో తడబడుతూ ఇలా చెప్తున్నాడు.

**భావం :** ప్రియా! రాధా! నువ్వు మాట్లాడే సమయంలో నీ దంతాల కాంతిలో నా భయమనే చీకటి తొలగిపోతోంది. నా చకోరాలైన నేత్రాలను నీ ముఖ బింబం యొక్క అధరామృతంతో పులకింప జేయి. సుశీలవతియైన ఓ ప్రియా! నాపై నీకు కోపం వద్దు. మదనాగ్నిలో దహించుకుపోతున్న నన్ను నీ ముఖ పద్మంలోని అమృతాన్ని జుర్రుకోనియ్యి. నీకు ఇంకా కోపం వుంటే, నీ గోళ్ళతో నన్ను గిచ్చు. నీ మృదువైన చూపులతో నన్ను బందీ చేయి, నీ దంతాలతో నన్ను కొరుకు. నీవు నీకు తోచిన రీతిలో, నీకు ఆనందం లభించే రీతిలో నీ ఇష్ట ప్రకారం నన్ను శిక్షించు.

రాధా! నీవే నా జీవనం. నీవే నా భూషణం. నీవే నా శృంగార భావజలధిలోని రత్నానివి, నన్ను అనుగ్రహించి, నాపై నీ దయ, ప్రేమ చూపించు.

ఓ ప్రియా! నీ కనులు ఎఱ్ఱ కలువలలాగా బాగా అందంగా వున్నాయి. నీ ఎఱ్ఱని కన్నులనే మన్మథ బాణాలు నా నల్లని శరీరాన్ని స్పృశించి ఎఱ్ఱగా చేస్తే ఎంత బాగుంటుందో కదా!

నీ స్తన యుగ్మంపై విరాజిల్లుతున్న మణిమంజరి నా హృదయాన్ని రంజిల్ల చేయును గాక!

నీ జఘనాలపై శోభిల్లే ఆభరణం మన్మథుని నివేశనం నాకు తెలియజేయు గాక!

ఓ సుమధురభాషిణీ! రతిక్రీడల్లో నీ పాదాలు ప్రకాశమానమై, తామరల కన్నా ఎక్కువ సౌందర్యంతో నన్ను అలరిస్తాయి. అటువంటి నీ అందమైన పాదాలకు ఎరుపురంగు అలముతాను.

నీ పాదాలను నా తలపై ఉంచుము. అవి మన్మథుడనే విషానికి విరుగుడు కదా! మన్మథుని వలన కలుగు వికార చేష్టలన్నీ నీ పాదస్పర్శతో తొలగిపోతాయి.

శ్రీకృష్ణుడు రాధతో పలికిన ఈ మధుర మంజుల చతురాలైన మాటలను పలికిన శ్రీ జయదేవ కీర్తన యువతీ యువకుల హృదయాలను రంజిల్ల చేయుగాక!

**విశేష వర్ణన**

ప్రణయినీ! రాధా! నన్ను అనుమానించవద్దు. పెద్ద స్తనాలు, పిరుదులు గల నీవు తప్పితే వేరెవరికీ నా హృదయంలో స్థానం లేదు.

అశరీరుడైన మన్మథుడు మాత్రమే నా హృదయంలో ప్రవేశించ గలడు. వేరొకరెవరూ ప్రవేశించలేరు. నీ బిగి కౌగిలిలో నన్ను ఆనందించనియ్యి. ముగ్ధరాలా! నీ దంతాలతో నన్ను గట్టిగా కొరకు. నీ మృదువైన బాహువులతో నన్ను బంధించు. నీ కఠిన కుచద్వయంతో నన్ను పీడించు. నిర్దయుడైన ఆ మన్మథుడు నా శరీరాన్ని తన బాణాలతో గాయపరచి ప్రాణాలు తోడేస్తున్నాడు. అది నీకు ఆనందమే కదా!

ఓ చంద్రముఖీ! నీ కళ్ల సోయగాలు యువజనులను మూర్ఛిల్ల చేయగలిగే సర్పాల్లా ఉన్నాయి. ఆ సర్పభయం దూరం కావాలంటే నీ అధరామృత పానమే సిద్ధ మంత్రం.

ఓ తరుణీ! రాధా! నీ మౌనం నన్ను పీడిస్తోంది. పంచమ స్వరాలాపనతో నన్ను మధురంగా పలుకరించు. నీ కనుచూపు సోయగాలతో నా పరితాపాన్ని తొలగించు.

ఓ సుముఖీ! నీవు నన్ను విముఖురాలివై విడిచి వేయవద్దు. ఓ సఖీ! ఎంతో ప్రేమతో నీ దగ్గరకు చేరాను. నన్ను మోసం చేయవద్దు.



ఓ చండీ! తెల్లని దంతాలు కలదానా! నీ ముఖాన్ని సేవించడం వల్లనే మన్మథుడు విశ్వాన్ని జయించాడు. నీ అధరాలు బంధూక (మంకెన) పువ్వులాంటి కాంతులతో మెరిసిపోతున్నాయి. నీ కనులు నల్లని కలువల లాగా మనోమోహనంగా వున్నాయి. నీ చెక్కిలి మధూకపుష్పం వలె కోమలంగా, శృంగారస్ఫోరకంగా వుంది.

రాధా! ఒక్కమాటలో చెప్పాలంటే నీ చూపులు మదాలసలు. నీ వదనం ఇందుమతిలా ఉజ్జ్వలంగా, (ప్రకాశవంతం)గా వుంది. నీ కదలికలు జనులకు మనోహరాలు. నీ తొడలు అరటి స్తంభముల కంటె ఘనం. నీలోని రతికౌశలం కళావంతం. నీ కనుబొమ్మలు చిత్రమైన రేఖలు. నీవు ఈ భువిపై అవతరించిన దేవాంగనవు.

యుద్ధంలో శ్రీహరి కువలయాపీడమనే ఏనుగు కుంభస్థలం చూచినపుడు, రాధ యొక్క పీనపయోధరాలు గుర్తుకు వచ్చాయి, ఆ ఆనందంలో శ్రీహరి క్షణకాలం కళ్ళు మూసుకున్నాడు. తాను గెల్చాననే భ్రాంతితో కంసుడు చిందులు వేస్తుండగా, నిర్భయంగా కంసునివైపు చూస్తున్న శ్రీకృష్ణ భగవానుడు మనకు ఆనందం ప్రసాదించు గాక!

**ఇది చతుర చతుర్భుజ రాగరాజి చంద్రోద్యోతమనే పేరుగల పందొమ్మిదవ అష్టపది.**

**అవతారిక :** శ్రీకృష్ణుడు తనను దోషరహితునిగా తెలియజేస్తూ సంభోగార్థమై ప్రోత్సాహిస్తున్నాడు.

**పరిహర కృతాంతకే! శంకాం త్వయా సతతం ఘన**
**స్తన జఘనయాఽఽక్రాంతే స్వాంతే వరానవకాశిని ।**
**విశతి వితనో రన్యోధన్యో నకోఽపి మమాంతరం**
**ప్రణయిని! పరీరంభా రంభే విధేహి విధేయతామ్ ॥**

**తా :** ఓ ప్రియురాలా! నేను పరకాంతతో కూడియున్నానని సందేహిస్తున్నావు కాబోలు! అటువంటి సందేహాన్ని వదలిపెట్టు. గొప్పస్తనాలు, పిరుదులు ఉండే నీవు నా హృదయంలో ఏ కొంచెంకూడ చోటులేకుండ ఆక్రమించుకొని ఉంటే, ఆ శరీరం లేని ఒక మన్మథుడు తప్ప వేరొకడెవడు నా మనస్సులో ప్రవేశింపగలడు? కాబట్టి, ఓ ప్రియురాలా! దయచేసి నీ కౌగిలింతలచేత నన్ను కింకరునిగా స్వీకరించు.

**విశే :** నాయిక ప్రౌఢ : నాయకుడు – ప్రగల్భుడు; విప్రలంభశృంగారంలో ప్రియాసంగసిద్ధి.

**అవతారిక :** శ్రీకృష్ణుడు చిట్టచివరికి తాను అపరాధం చేసినవాణ్ణే ఒప్పుకుంటూనే రాధను బతిమాలుకొంటున్నాడు.

**ముగ్ధే! విధేహిమయి నిర్దయదంతదంశం**
**దోర్వల్లి బంధ నిబిడ స్తనపీడనాని ।**
**చండి! త్వమేవ ముద ముద్వహ పంచబాణ**
**చండాల కాండదళనా దసవః ప్రయాంతి ॥**

**తా :** ఓ ముగ్ధురాలా! కృష్ణుడు అపరాధి అని నీవు భావిస్తే, దానికి తగినట్లు కఠినాలైన దంతక్షతాలతో, బాహువులనే తీగలచే కట్టివేయడమో, గట్టిగ స్తనాలను బట్టి నొక్కడమో, ఏదో నీ కిష్టమైన దండనం విధించకూడదా? ఓ కోపిష్ఠురాలా! ఆ మన్మథ చండాలుడు నిర్దయుడై తన బాణాలను ప్రయోగించి నా శరీరమంతా చీలుస్తున్నాడు. నా ప్రాణాలు పోతున్నాయి ఇంకేమి? నీవు హాయిగా సంతోషించు.

**విశే :** నాయకుడు : అనుకూలుడు, నాయిక ముగ్ధ

**అవతారిక :** వాత్స్యాయన న్యాయాన్ని అనుసరించి క్రమంగా రాధ అనుకూలు రాలయ్యేటట్లు చేస్తున్నాడు.



**శశిముఖి! తవభాతి భంగురభ్రూః**
**యువ జనమోహ కరాళ కాళసర్పీ ।**
**తదుదిత విషభంజనాయ యూనాం**
**త్వదధరశీధుసుధైవ సిద్ధమంత్రః ॥**

**తా :** ఓ చంద్రవదనా! నీ వంకరయైన కనుబొమ యౌవనవంతుల మోహింపజేయడానికి భయంకరమైన కాలసర్పమై ఉంది. కాబట్టి, ఆ సర్పం వల్ల కల్గిన విషాన్ని శమింపజేయడానికి నీ అధరామృతమే సిద్ధమంత్రం.

**"వ్యథయతి వృథామౌనం తన్వి! ప్రపంచయ పంచమం**
**తరుణి! మధురాలాపై స్తాపం వినోదయ దృష్టిభిః ।**
**సుముఖి! విముఖీభావం తావ ద్విముంచ న ముంచ మాం**
**స్వయ మతిశయ స్నిగ్ధో ముగ్ధే! ప్రియోఽయ ముపస్థితః ॥**

**తా :** ఓ తన్వీ! నీవు వ్యర్థంగా మాట్లాడకుండ ఉండటంవల్ల, నాకెంతో కష్టం కలుగుతోంది. కాబట్టి, ఓ తరుణీ! కోకిల లాగా పంచమస్వరంలో తీయని పలుకుల్ని పలుకు. నీ చల్లని చూపులతో నా తాపం తొలగించు. ఓ సుముఖీ! మొగం తిప్పుకొని వెళ్లవద్దు. నన్ను ఇతరునిగా భావించి త్రోసివేయవద్దు. ఓ వెఱ్ఱిదానా! ఈ కృష్ణుడు నీపై అత్యంత ప్రేమచే స్వయంగా ఇచ్చటికి వచ్చి ఉన్నప్పటికీ స్వీకరింపకుండా ఉన్నావెందుకు?

**విశే :** నాయకుడు : అనుకూలుడు; వృత్తి : కైశికి; రీతి – వైదర్భి; మాగధి గీతి; ప్రసాదం–గుణం

**బంధూకద్యుతి బాంధవోఽయమధరః స్నిగ్ధో మధూకచ్ఛవిః**
**గండశ్చండి! చకాస్తి నీలనళిన శ్రీమోచనం లోచనమ్ ।**
**నాసాఽభ్యేతి తిలప్రసూన పదవీం కుందాభదంతి! ప్రియే!**
**ప్రాయ స్త్వన్ముఖ సేవయా విజయతే విశ్వం సపుష్పాయుధః ॥**

**తా :** ఓ ప్రియురాలా! అందమైన నీ క్రిందిపెదవి ఎఱ్ఱని మంకెన పూలరంగును పోలి ఉంది. నీ చెక్కిళ్లు ఇప్పపూలవలె స్వచ్ఛంగా ప్రకాశిస్తున్నాయి. నీ కండ్లు నల్లకలువల్ని తిరస్కరిస్తున్నాయి. మొల్లలవంటి పలువరుస గలదానా! నీ ముక్కు నువ్వు పువ్వు అందాన్ని అతిక్రమించి ఉన్నది. కాబట్టి, ఈ సన్నివేశం చూడగా మన్మథుడు పుష్పాయుధుడు కాబట్టి, ఆయుధాలను నీ అవయవాలలో అమర్చుకొని తాను శరీరంలేనివాడైనా లీలగా ప్రపంచమంతా జయిస్తున్నాడని భావిస్తున్నాను.

**"దృశౌ తవ మదాలసే వదన మిందు మత్యుజ్జ్వలం**
**గతిర్జనమనోరమా విధుతరంభ మూరుద్వయం ।**
**రతి స్తవ కలావతీ రుచిర చిత్రలేఖే భ్రువౌ**
**అహో! విబుధయౌవతం వహసి తన్వి! పృథ్వీగతా ॥**

**తా :** ఓ రాధా! నీ చూపులు మదాలసలు. (మదంచే మత్తెక్కినవి) నీ ముఖం ఇందుమత్యుజ్వలం (చంద్రుని అతిశయించిన ప్రకాశం గలది) నీ నడక చూచేవారి మనస్సులను రమింపజేసేది (ఆనందింపజేసేది.) నీగతి జనమనోరమ. నీ తొడలు రంభలను జయించేవి. (నీ తొడలు అరటి కంభాలను జయించేవి) నీ రతి కలావతి (తుంబురుని వీణానిక్వాణంవలె సుమధురమైన రతికూజితం – 'మణితం') నీ కనుబొమలు చిత్రలేఖలు (చిత్రాలైన రేఖలుగలవి, (లేక) చిత్రరేఖలవలె ప్రకాశించేవి) ఔరా! ఏమి ఈ చిత్రం! నీవు భూమిపై ఉండే అందగత్తెవైనా స్వర్గలోకంలోని అందగత్తెల లక్షణాలన్నీ శరీరంలో ధరించి ఉన్నావు! అందంలో వారితో పోటీ పడుతున్నావు. వారెవరంటే మదాలస, ఇందుమతి, మనోరమ, రంభ, కళావతి, చిత్రలేఖ మొదలైనవారు)

**అవతారిక :** కవి పదవ సర్గాన్ని ముగిస్తూ, సర్గాంతంలో భక్తులకు మంగళాశాసనం చేస్తున్నారు.



**స ప్రీతిం తనుతాం హరిః కువలయాపీడేన సార్థం రణే**
**రాధా పీనపయోధర స్మరణకృత్కుంభేన సంభేదవాన్ ।**
**యత్రస్విద్యతి మీలతి క్షణమపి క్షిప్రం తదాలోకనాత్**
**కంసస్యాల మభూజ్జితం జితమితి వ్యామోహకోలాహలః ॥**

**తా :** శ్రీకృష్ణుని తన మాయోపాయంచేత సంహరించాలని కంసుడు, కృష్ణుడు మధురానగరాన్ని ప్రవేశించే సందర్భంలో, కువలయాపీడమనే మదపుటేనుగు తొండానికి ఒక పుష్పహారాన్ని యిచ్చి ఎదురేగి, సమీపించి, చెలరేగి చంపేవిధంగా తర్ఫీదు యిచ్చి ఉండగా, కృష్ణుడామదగజ కుంభస్థలాన్ని చూచినవెంటనే, హఠాత్తుగా తన ప్రియురాలైన రాధయొక్క గబ్బిగుబ్బలు స్మరణకురాగా, సాత్త్వికోదయంకలిగి ఆనందపరవశుడై, శరీరమంతా చెమటపట్టగా కన్నులు మూతపడగా, నిశ్చేష్టుడయ్యాడు. ఈ సన్నివేశాన్ని చూచికంసుడు ఓహోయి! కృష్ణుడోడిపోయాడు. మాకే జయం! మాకే జయం!! అని కోలాహలం చేశాడు. అటువంటి కోలాహలంలో నిర్భయంగా ప్రకాశిస్తున్న శ్రీకృష్ణుడు మనకు సంతోషాన్ని కల్గించునుగాక!

**ఇది శ్రీ జయదేవకృతే గీతగోవిందే మానినీవర్ణనే చతురచతుర్భుజో నామ దశమస్సర్గః.**

ఇది శ్రీ జయదేవ కృతమైన గీతగోవిందమనే కావ్యంలో మానినీవర్ణనలో చతురచతుర్భుజ మనేపేరుగల పదవసర్గ.

* * *

# ఏకాదశ సర్గ

## సానంద దామోదరం

**అవతారిక :** పదవసర్గంలో చెప్పబడినట్లుగా శ్రీకృష్ణుడు రాధను అనునయిస్తూ ఒక పొదరింటికి పోయి చేరగా ఆ శ్రీకృష్ణుని సమీపానికి పోవడానికై ఒక చెలికత్తె రాధికకు ప్రోత్సాహాన్ని కల్గిస్తున్నది.

**"సుచిర మనునయేన ప్రీణయిత్వా మృగాక్షీం**
**గతవతి కృతవేశే కేశవే కుంజ శయ్యాం ।**
**రచిత రుచిర భూషాం దృష్టిమోషే ప్రదోషే**
**స్ఫురతి నిరవసాదాం కాఽపి రాధాం జగాద ॥**

**తా :** శ్రీకృష్ణుడు రాధను అనేకవిధాలుగా అనునయించి, సంతోషపఱచి రతికి యోగ్యమైన వేషాన్ని ధరించి ఒకపొదరింటిలో పుష్పశయ్యను చేరియుండగా, రాధ కూడ తన దుఃఖాన్ని ఉపశమింపచేసుకొని సాయంకాలం చీకటిపడిన తర్వాత నల్లని రవిక, నల్లని చీర యిత్యాది రతియోగ్యాలైన అలంకారాలను ధరించి యుండగా అప్పుడొక చెలికత్తె వచ్చి ఇలా చెప్పసాగింది.

## అష్టపది - 20

## శ్రీహరితాళరాజిజలధరవిలసితము

**మోహనరాగం - ఆదితాళం**

**కల్యాణిరాగం - చాపుతాళం**

**(వసంతరాగ యతి తాళాభ్యాం గీయతే)**

విరచిత చాటువచన రచనం–చరణే రచిత ప్రణిపాతమ్ ।
సంప్రతి మంజుల వంజుళ సీమని–కేళిశయన మనుయాతమ్ ॥
ముగ్ధే! మధు మథనం అనుగత మనుసర రాధే ॥ 1



ఘన జఘన స్తన భారభరే దర–మంథర చరణ విహారమ్ ।
ముఖరిత మణిమంజీర ముపైహి–విధేహి మరాళ వికారమ్ ॥
ముగ్ధే! ... ... ... ... రాధే॥ 2

శృణు రమణీయతరం తరుణీ జన మోహన మధురిపు రావమ్ ।
కుసుమ శరాసన శాసనవందిని పిక నికరే భజ భావమ్ ॥
ముగ్ధే! ... ... ... ... రాధే॥ 3

అనిల తరళ కిసలయ నికరేణ కరేణ లతా నికురుంబమ్ ।
ప్రేరణమివ కరభోరు కరోతి గతిం ప్రతిముంచ విలంబమ్ ॥
ముగ్ధే! ... ... ... ... రాధే॥ 4

స్ఫురితమనంగ తరంగ వశాదివ సూచిత హరిపరిరంభం ।
పృచ్ఛ మనోహర హార విమల జలధారమముం కుచకుంభమ్ ॥
ముగ్ధే! ... ... ... ... రాధే॥ 5

అధిగతమఖిల సఖీభిరిదం తవ వపురపి రతిరణ సజ్జమ్ ।
చండి! రణిత రశనా రవ డిండిమ మభిసర సరస మలజ్జమ్ ॥
ముగ్ధే! ... ... ... ... రాధే॥ 6

స్మరశర సుభగ నఖేన సఖీమవలంబ్య కరేణ సలీలమ్ ।
చల వలయ క్వణితై రవబోధయ హరిమపి నిగదిత శీలమ్ ।
ముగ్ధే! ... ... ... ... రాధే॥ 7

శ్రీ జయదేవ భణిత మధరీకృత హారముదాసిత వామమ్ ।
హరి వినిహిత మనసా మధితిష్ఠతు కంఠతటీ మవిరామమ్ ॥
ముగ్ధే! ... ... ... ... రాధే॥ 8

కేశవుడు తగిన వస్త్రధారణతో మృగ నేత్రయైన రాధను అనునయించి పొదరింటిలోని పాలపాన్పుపైకి చేరాడు. దుఃఖం దూరంకాగా రాధ కూడ

రతికేళికి తగినట్లు దుస్తులు, దివ్య భూషణాలు ధరించింది. ఆ సమయంలో చెలికత్తె రాధతో ఇలా అంటోంది.

**భావం :** ఓ ముగ్ధయైన రాధా! మధుర భాషణ చేయువాడు, నీ పాదాక్రాంతుడైన శ్రీకృష్ణుడు నీతోకూడి రమించుటకు అనుకూలమైన పాన్పుపై పవళించి ఉన్నాడు. నీవు ఆ మధుసూదనుని అనుసరించు, ఘనమైన పిరుదులు, కుచాలు గలదానా! మందగమనంతో మణిమంజీర నాదాలతో నీ ప్రియుని చేరుకో. తరుణీజనులను సమ్మోహన పరచే ఆ మురళీధరుని మధుర స్వరాల్ని విను. మదనుని శాసనాన్ని కూడ ధిక్కరించే మధురమైన ఆ కోకిలల కంఠారావాల్ని విను.

ఏనుగు తొండం వంటి తొడలుగలదానా! తీగెలు తమ చిగురుటాకుల చేతులతో ఆలస్యం లేకుండా నీవు కృష్ణుని చేరుకోమని ప్రేరేపిస్తున్నాయి.

కుంభాల వంటి నీ స్థనాలపై హారాలనే జలధరాలు మదనుని తరంగం వల్ల అటు ఇటు కదులుతూ, నీకు శ్రీమతి కౌగిలింత సౌఖ్యాన్ని సూచిస్తున్నాయి. నిజమో కాదో నీ కుచకుంభాలనే అడిగి చూడు.

ఓ చండీ! నీ అలంకారాలను బట్టి నీ సఖులందరికీ నీవు రతిరాణివై వెళ్ళుతున్నట్లు తెలిసి పోయింది. సిగ్గు వదిలివేసి, నీ సుందర ఆభరణాల మధురస్వనాల మధ్య నీ విభుని చేరుకో. మన్మథుని బాణాల వలె బహు చక్కని గోళ్ళు వున్న నీ చక్కని చేతులతో, సఖీ సహాయంతో, నీ ప్రియుని చేరుకో. నీ గాజుల ధ్వనితో నీ రాకను నీ ప్రభువుకు తెలియజేయి.

జయదేవ కవి రచించిన గీతాలు స్త్రీలు ధరించే హారాల్లా కాకుండా, శ్రీహరిని మనసులో నిల్పిన భక్తకోటి కంఠసీమల్లో ఎల్లప్పుడూ నిలిచి ఉండు గాక!

**ఇది శ్రీహరితాల రాజిజలధర విలసితమనే ఇరువదవ అష్టపది**

**అవతారిక :** ఇప్పుడు చెలికత్తె రాధకు అభిసరణ సమయాన్ని తెలుపుతూ ఉంది.



**అక్ష్ణోర్నిక్షిపదంజనం శ్రవణయో స్తాపింఛ గుచ్ఛావలీం**
**మూర్ధ్ని శ్యామ సరోజదామ కుచయోః కస్తూరికాపత్రకమ్ ।**
**ధూర్తానా మభిసార సంభ్రమ జుషాం విష్వఙ్నికుంజే సఖి**
**ధ్వాంతం నీలనిచోళచారు సుదృశం ప్రత్యంగమాలింగతి ॥**

**తా :** ఓ చెలీ! రాధా! కన్నులకు కాటుక, చెవులకు చీకటి కానుగు పూగుత్తుల మొత్తము, తలపై నల్ల కలువలను, స్తనాలపై కస్తూరీ మకరికాది పత్రరేఖలును తీర్చిదిద్దుతూ నల్లనిరంగు దుప్పటిలాగా ప్రకాశించే ఈ కటిక చీకటి, ధూర్తులై సంకేత స్థానాన్ని చేరడానికి సంభ్రమంలో ఉండే జవరాండ్రయొక్క ప్రతి అవయవాన్ని పొదరిండ్లలో అన్నిచోట్ల గట్టిగా కౌగిలించుకొనేటట్లున్నది.

**అవతారిక :** ఓ రాధా! ఈ కటిక చీకటిలో కృష్ణుడు నిన్నే ఎదురుచూస్తున్నాడు. కాబట్టి, మణిసువర్ణా భరణాదులేవీ ధరింపకనే ఇలాగే వేగంగా బయలుదేరు. అని చెలికత్తె చెబుతూ ఉంది.

**కాశ్మీర గౌరవపుషా మభిసారికాణాం**
**ఆబద్ధరేఖ మభితో రుచి మంజరీభిః ।**
**ఏ తత్తమాల దళనీలతమం తమిస్రం**
**తత్ప్రేమహేమ నికషోపలతాం తనోతి ॥**

**తా :** ఓ రాధా! కుంకుమలాగా గౌరవర్ణమైన శరీరంగల అభిసారికా నాయికల శరీరకాంతి పుంజాలచే రేఖలు తీర్చబడి, చీకటి కానుగుచెట్ల ఆకులలాగా ఎంతో నల్లగా ఉండే ఈ కటిక చీకటి శ్రీకృష్ణుని ప్రేమ అనే బంగారానికి ఒరపిడిరాయి కాగలదు.

**అవతారిక :** ఇప్పుడు భావాంతరం పొంది శృంగార రసాన్ని పోషిస్తూ పలుకుతూ ఉంది.

**హారావళీ తరళ కాంచన కాంచిదామ**
**మంజీర కంకణ మణిద్యుతి దీపితస్య ।**

ద్వారే నికుంజనిలయస్య హరిం నిరీక్ష్య
క్రీడావతీ మథ సఖీ మియ మిత్యువాచ ॥

**తా :** తరువాత, రాధ సంకేత స్థానాన్నిచేరి, ఆ పొదరింటి వాకిట తన ముత్యాలహారంలోని నాయకమణి అందెలు, కంకణాలు, బంగారు మొలనూలు మొదలైనవాని తళతళకాంతులు బయలుదేరి చీకటినంతాపోగొట్టి వెలుతురును కల్గించగా అచ్చట కృష్ణుని చూచి ఎంతో సిగ్గుపడి యుండగా చెలికత్తె చూచి ఇలా చెప్పనారంభించింది.

## అష్టపది - 21
## సానందదామోదరప్రేమద్రుమపల్లవము

**అవతారిక :** సఖీ వాక్యాలను గీతరూపంగా వివరిస్తున్నాడు.

**బంగాళవరాళిరాగం - రూపకతాళం**

**ఘంటారాగం - జంపెతాళం**

**(వరాలీరాగ, రూపకతాళాభ్యాం గీయతే)**

మంజుతర కుంజతల కేళి సదనే ।
ఇహ విలస రతిరభస హసితవదనే ॥
ప్రవిశ రాధే! మాధవ సమీపమిహ ।
కురు మురారే! మంగళశతాని ॥ (ధ్రువమ్) 1

నవభవదశోకదళ శయనసారే ।
ఇహ విలసకుచ కలశ తరళహారే ॥
ప్రవిశ ... ... ... ... మంగళశతాని ॥ 2

కుసుమ చయరచిత శుచి వాసగేహే ।
ఇహ విలస కుసుమ సుకుమార దేహే ॥
ప్రవిశ ... ... ... ... మంగళశతాని ॥ 3



మృదుచల మలయపవన సురభి శీతే ।
ఇహ విలసమదన శరనికర భీతే ॥
ప్రవిశ ... ... ... ... మంగళశతాని ॥ 4

వితత బహువల్లి నవపల్లవ ఘనే ।
ఇహ విలసపీనకుచ కుంభ జఘనే ॥
ప్రవిశ ... ... ... ... మంగళశతాని ॥ 5

మధు ముదిత మధుపకుల కలిత రావే ।
ఇహ విలస కుసుమశర సరస భావే ॥
ప్రవిశ ... ... ... ... మంగళశతాని ॥ 6

మధురతర పికనికర నినద ముఖరే ।
ఇహవిలస దశనరుచి రుచిర శిఖరే ॥
ప్రవిశ ... ... ... ... మంగళశతాని ॥ 7

విహిత పద్మావతి సుఖ సమాజే ।
భణతి జయదేవ కవి రాజ రాజే ॥
ప్రవిశ ... ... ... ... మంగళశతాని ॥ 8

కళ్ళలో కాటుక, తలలో నల్లని కలువపూలు, కుచాలపై కస్తూరి రేఖలు, కప్పుకొనేందుకు నల్లని దుప్పటిలా చీకటి ప్రకాశిస్తోంది. ఇది ధూర్తతతో అభిసరించే అంగనల అంగాలను కౌగిలించుకొంటున్నట్లుగా వెలిగిపోతోంది.

అభిసారికల శరీరాలు కుంకుమ పువ్వుల్లా వున్నాయి. వారి మణిమంజీరాల కాంతులు వారి చేతులపై ప్రకాశమానంగా వున్నాయి. ఈ నల్లని చీకటి శ్రీకృష్ణుని ప్రేమ అనే బంగారాన్ని పరీక్షించే ఒరపిడి రాయిలా ఉంది.

హారాల్లో మధ్యగల నాయికామణి కాంతి, మంజీర కంకణాల మణుల కాంతితో చీకటి తొలగిపోగా, శ్రీహరిని చూచి సిగ్గు పడుతున్న రాధను చూచి సఖి ఇలా అంటోంది.

**భావం :** రతిక్రీడలో అమితోత్సాహంతో నవ్వులు చిందించే సుందర వదనంగల ఓ రాధా! అందమైన రతిక్రీడాగృహంలో మాధవుని సమీపించు. కుచకలశాలు అతి తరళాలైన హారం కల రాధా! లేత లేత అశోక దళాల పాన్పుపై చేరుకో.

కుసుమ సుకుమార దేహం కలదానా! పువ్వులతో అలంకరించబడ్డ శుభ్రమైన శయన గృహంలోకి ప్రవేశించు.

మదన బాణాలకు భీతిల్లిన రాధా! మృదువైన మలయ మారుత పరిమళాలను పొదరింటిలో అనుభవించి, ఆనందించు.

విశాలమైన చనులు, పిరుదులు గల దానా! దట్టమైన తీగల, లతల సౌందర్యాన్ని, అందమైన ఆ పొదరింటిలో అనుభవించు.

పూలబాణాలు ధరించిన మన్మథుని యందు సమరసభావం కల రాధా! తేనెను త్రావిన తుమ్మెదలు ఝుంకారం చేసే ఆ పొదరింటిలో ఆనందాన్ని అనుభవించు.

పద్మావతితో కూడి జయదేవ కవి తన్మయుడై ఆనందంతో ఈ గీతం పాడుతుంటే, అందరికి సుఖాలు చేకూరు గాక!

(గమనిక : జయదేవ కవి భార్య పేరు కూడ పద్మావతియే).

**విశేష వర్ణన**

స్వామి మన్మథ బాధా పీడితుడై నిన్ను చిరకాలం తలచి తలచి అలసిపోయాడు. నీ అధర సుధామృతపానం చేయాలనే కోరికతో ఉన్నాడు. క్షణకాలం ఆయన వక్షఃస్థలంపై సేదదీరు. నీ పాదాక్రాంతుడైన అతని వలన నీకు భయమెందుకు?

గోవిందుని మనసులో మనసుగా లగ్నమైన కనులుగల రాధ భయంతో, ఆనందంతో, అందెల సవ్వడులతో పొదరింటిలోనికి ప్రవేశించింది.

**అవతారిక :** చెలికత్తె, రాధయొక్క మనస్సులోగల లజ్జాభయాలను తొలగిస్తూ శ్రీకృష్ణుని అత్యుత్కంఠను చెబుతోంది.



**త్వాం చిత్తేన చిరం వహన్నయ మతిశ్రాంతో భృశంతా పితః**
**కందర్పేణ చ పాతు మిచ్ఛతి సుధా సంబాధ బింబాధరం ।**
**అస్యాంకం తదలంకురు క్షణమిహ భ్రూక్షేప లక్ష్మీ లవ**
**క్రీతేదాస ఇవోప సేవిత పదాంభోజే కుత స్సంభ్రమః ॥**

**తా :** ఓ రాధా! శ్రీకృష్ణుడు చాలకాలం నుండి నిన్ను తన మనస్సు చేతనే వహిస్తూ ఉన్నందున ఎంతో బడలినవాడై, మన్మథునిచే మిక్కిలి సంతాపం పొందుతూ నీ అధరామృతాన్ని పానం చేయుగోరుతున్నాడు. కాబట్టి క్షణకాలం ఆ కృష్ణుని తొడపై కూర్చోవమ్మా! ఆయన నీ కనుసైగ ఎట్లా ప్రసరిస్తుందో ఆ విధంగా నీ పాదసేవచేస్తూ దాసుడై ఉన్నాడు కదా! ఇంక ఆయనవల్ల నీకు భయం దేనికి?

**అవతారిక :** రాధాకృష్ణుల సంభోగ శృంగారాన్ని ముమ్ముందు వర్ణింపబోతూ దానికి హేతు భూతమైన రాధాప్రవేశాన్ని చెబుతున్నాడు.

**సా ససాధ్వససానందం గోవిందే లోలలోచనా ।**
**శింజాన మంజు మంజీరం ప్రవివేశ నివేశనమ్ ।**

**తా :** అంత నా రాధ క్రేగంటి చూపులతో శ్రీకృష్ణుని చూస్తూ, మనస్సులో భయం, ఆనందం, ముప్పేటలుగా పెనగొనగా కాలి అందెల ఘల్లుఘల్లుమనగా కేళీమందారాన్ని ప్రవేశించింది.

## అష్టపది - 22
## సానందగోవిందరాగశ్రేణికుసుమాభరణము

**మాళవరాగం - ఆదితాళం**

**మధ్యమావతీరాగం - ఆదితాళం**

**(వరాళిరాగ యతితాళాభ్యాం గీయతే)**

రాధా వదన విలోకన వికసిత వివిధ వికార విభంగం ।
జలనిధి మివ విధుమండల దర్శన తరళిత తుంగతరంగమ్ ॥

హరిమేక రసం చిరమభిలషిత విలాసం ।
సా దదర్శ గురుహర్షవశంవద వదనమనంగ నివాసమ్ ॥ (ధ్రువమ్)
1

హారమమలతర తారమురసి దధతం పరిలంబ్య విదూరం ।
స్ఫుటతర ఫేనకదంబ కరంబితమివ యమునా జలపూరమ్ ॥
హరిమేక రసం ... ... ... నివాసమ్ ॥ 2

శ్యామల మృదుల కలేబర మండల మధిగత గౌర దుకూలమ్ ।
నీల నళినమివ పీత పరాగ పటల భర వలయిత మూలమ్ ॥
హరిమేక రసం ... ... ... నివాసమ్ ॥ 3

తరళదృగంచలచలనమనోహరవదనజనితరతిరాగం ।
స్ఫుటకమలోదరఖేలితఖంజనయుగ మివశరదితడాగం ॥
హరిమేక రసం ... ... ... నివాసమ్ ॥ 4

వదనకమల పరిశీలన మిళిత మిహిర సుమకుండల శోభం ।
స్మితరుచి రుచిర సముల్లసితాధర పల్లవ కృత రతి లోభమ్ ॥
హరిమేక రసం ... ... ... నివాసమ్ ॥ 5
శశికిరణ చ్ఛురితోదర జలధర సుందర సుకుసుమ కేశం ।
తిమిరోదిత విధుమండల నిర్మల మలయజ తిలక నివేశమ్ ॥
హరిమేక రసం ... ... ... నివాసమ్ ॥ 6

విపుల పులకభర దంతురితం రతికేలి కలాభిరధీరమ్ ।
మణిగణ కిరణ సమూహ సముజ్జ్వల భూషణ సుభగ శరీరమ్ ॥
హరిమేక రసం ... ... ... నివాసమ్ ॥ 7

శ్రీ జయదేవ భణిత విభవ ద్విగుణీకృత భూషణ భారమ్ ।
ప్రణమత హృది వినిధాయ హరిం రుచిరం సుకృతోదయ సారమ్ ॥
హరిమేక రసం ... ... ... నివాసమ్ ॥ 8



గోవిందుని హృదయంలో లగ్నమైన మనసు కల రాధ భయంతో, ఆనందంతో, మంజులమైన అందెల సవ్వడులతో పొదరింటిలోకి ప్రవేశించింది.

**భావం :** చంద్రుని చూచి ఉప్పొంగే సముద్రంలా హృదయంలో ఆనందం పెల్లుబికినవాడు, రాధ పట్ల గాఢానురాగం కలవాడు, ఎల్లకాలం ఆమెతో విలాస జీవితాన్ని కోరుకున్నవాడు, ఆనందంతో వెలుగులీనుతున్న ముఖం కలవాడు, మన్మథ నివాసుడు అయిన శ్రీహరిని రాధ చూచింది.

రాధ శ్రీకృష్ణుని కౌగిలించినపుడు ఆమె హారం శ్రీకృష్ణునిపై పడింది. అపుడు శ్రీకృష్ణుడు ఆమెకు తెల్లని నురుగులతో ప్రకాశిస్తున్న నల్లని యమునానదిలా కనిపించాడు.

పీతాంబరధరుడైన ఆ నల్లని మృదువైన స్వామి, పచ్చని పరాగంతో కప్పబడిన నల్లని కలువ వలె రాధకు కన్పించాడు.

అందమైన కనులు కలిగిన ముఖంతో, రతిలో ఆసక్తి కలిగి, వికసించిన కలువల మధ్య నల్లని పక్షియుగ్మం గల సరస్సులా కనిపిస్తున్నాడు.

రాధ కమలమనే ముఖాన్ని చూడటానికి వచ్చిన సూర్యుని వలె, దేదీప్యాలైన కర్ణకుండలాలు ధరించినవాడు, సుందరాధరాలపై చిరునవ్వు చిందించేవాడు, రాసక్రీడ యందాసక్తి కనపరచిన వానిలాగా శ్రీహరి కనిపించాడు.

నల్లని కేశాల మధ్య తెల్లని పువ్వుతో శ్రీహరి వెన్నెలతో మెరిసిపోయే నల్లని మేఘంలా, చీకటిలో ఉదయించిన చంద్రునిలా, నల్లని ముఖం మీద తెల్లని చందన తిలకం ధరించి ఉన్నాడు. శరీరం పులకరింపులతో పూలతో అలంకరించబడినవాడు, రతికేళీ విలాసాలతో చంచలమైన బుద్ధి కలవాడు, మణిమయ భూషణాలతో శరీరం కలిగినవాడు, తేజోమయుడుగా ప్రకాశిస్తున్నాడు శ్రీహరి.

జయదేవ కవి కీర్తనలచే ఆభూషణాలు ద్విగుణీకృతమై శ్రీహరిని, సుకృతం కలిగించమని హృదయంలో నమస్కరించండి.

**విశేష వర్ణన**

శ్రీకృష్ణుని దివ్యరూపాన్ని సేవించే వేళ, రాధతో రతి కేళికి సిద్ధమయ్యే వేళ, కలిగే మనోద్వేగం వల్ల చెక్కిళ్ళపై స్వేదబిందువులు ముత్యాల్లా ప్రకాశిస్తున్నాయి. రాధామాధవుల సంగమాభిలాషను గమనించిన చెలికత్తెలు పొదరింటిని వదలి చీకటిలోకి జారుకున్నారు. రాధ బిడియం వీడి శ్రీకృష్ణుని దరిజేరి తన మనోవాంఛను తెలియజేసింది.

ఆనందంతో శ్రీకృష్ణుడు సౌందర్య శృంగార రూపిణి అయిన రాధను గట్టిగా కౌగిలించుకోగా, ఆమె స్తనాల మొనలు తన హృదయాన్ని ఛేదించాయా అని వెనుదిరిగి చూస్తుండగా, రాధ వాని ముఖాన్ని తనవైపుకు త్రిప్పుకొని ఆనందించ సాగింది.

ఒకప్పుడు కువలయాపీడమనే ఏనుగును తొండం మెలిపెట్టి చంపివేయగా, దేవతల పూల వర్షంతో ఎరుపెక్కిన బాహువులు ఇప్పుడు రాధను కౌగిలిస్తున్నాయి.

సకల సాంద్రతర గుణాలతో ప్రకాశిస్తూ, రతిలీలా వినోద విలాస సాగరమైన రాధా హృదయంలో నిరంతరం విహరించడం చేత, 'మానస రాజహంస' అని ప్రసిద్ధుడైన ముకుందుడు అందరినీ సంరక్షించుగాక!

ఈ అష్టపదిలో సంభోగశృంగారం వర్ణితం. కైశికీవృత్తి.

**ఇది సానంద గోవింద రాగశ్రేణి కుసుమాభరణ మనే ఇరవై రెండవ అష్టపది.**

**అవతారిక :** శ్రీకృష్ణునికే కాక రాధకు కూడ సాత్త్వికోదయమయిందని నిరూపిస్తున్నది.



**అతి క్రమ్యాపాంగం శ్రవణపథ పర్యంత గమన**
**ప్రయాసే సేవాక్ష్ణోః స్తరళతరభావం గమితయోః ।**
**ఇదానీం రాధాయాః ప్రియతమః సమాలోక సమయే**
**పపాతస్వేదాంబు ప్రసర ఇవ హర్షాశ్రు నికరః ॥**

**తా :** రాధ శ్రీకృష్ణుని సేవించిన సమయంలో, కడగంటిని అతిక్రమించి చెవుల పర్యంతం వ్యాపించినందువల్ల కలిగిన ప్రయానం చేతనో అనేటట్లుగా ఎంతో చంచల భావాన్ని పొందిన తన కన్నులందు చెమటనీరు ప్రవాహంవలె కాగా ఆనందబాష్పాలు ప్రవహించాయి.

**అవతారిక :** రాధ ఆనందాతిశయంచే కండ్లు మూసికొని ఉండగా, చెలికత్తెలు చేసినపనిని చెబుతున్నారు.

**భజంత్యా స్తల్పాంతం కృత కపట కండూతి పిహిత**
**స్మితం యాతే గేహా ద్బహి రపి హితాళీ పరిజనే ।**
**ప్రియాస్యం పశ్యంత్యాః స్మరపరవశాకూత సుభగం**
**సలజ్జా లజ్జాఽపివ్యగమ దివ దూరం మృగదృశః ॥**

**తా :** అంత పరిజనులైన చెలికత్తెలందరు ఒకరొకరు పొదరింటి నుండి వెలుపలికి పోగా, రాధ, నటిస్తూ చేతితో గోక్కోవడంచూచి, చిరునవ్వును పంటి నడుమ అదిమిపట్టుకొని, తన సిగ్గుసైతం సిగ్గుపడి తొలగిపోయిందా అనేటట్లు మన్మథ వికారాలచే సుందరమైన శ్రీకృష్ణునిముఖాన్ని సాభిలాషతో చూస్తూ ఉండిపోయింది.

**సానందం నందసూను ర్దిశతు తరతరం సమ్మదం ముందమందం**
**రాధా మాధాయ బాహ్వోర్వివరమనుదృఢం పీడయున్ ప్రీతియోగాత్।**
**తుంగౌ తస్యా ఉరోజావతనువరతనోర్నిర్గతౌ మాస్మభూతాం**
**పృష్ఠం నిర్భి ద్యతస్మా ద్బహిరితి కలిత గ్రీవ మాలోకయంతః ॥**

**తా :** తరువాత మెల్లమెల్లగ రాధను తన సందిట చేర్చుకొని అత్యంత ప్రేమానురాగాలతో తొమ్మున తొమ్ముఁజేర్చి గట్టిగ కౌగిలించుకొని, "ఓహో!

ఇలా కఠినాలై మిక్కిలినిక్క బొడుచుకొని ఉన్న ఈ రాధ స్తనాలు నా వీపును బద్దలు చేసికొని వెలుపలికి రాలేదు గదా! అని తటాలున కంఠాన్ని తిప్పి వెనుక పక్కకుచూస్తూ, అత్యంత శృంగార రసంలో ఓలలాడుచుండే శ్రీకృష్ణుడు మనకు ఎంతో సంతోషమును గ్రహించునుగాక!

**జయశ్రీ విన్యస్తై ర్మహిత ఇవ మందార కుసుమైః**
**స్వయం సిందూరేణ ద్విపరణముదా ముద్రిత ఇవ ।**
**భూజాపీడ క్రీడాహత కువలయా పీడకరిణః**
**ప్రకీర్ణా సృగ్బిందు ర్జయతి భుజదండో మురజితః ॥**

**తా :** శ్రీకృష్ణుడు కువలయాపీడమనే ఏనుగును భుజాపీడక్రీడచే (తొండాన్ని చేతితో మెలికతిప్పి) చంపివేయగా, అప్పుడు బాహువుపై నెత్తుటి బొట్లు పడటంచే అది జయలక్ష్మిచే ఆకాశం నుండి కురిపింపబడిన మందారపుష్పాలచే పూజింపబడిందా అనేటట్లు, ఏనుగుతో యుద్ధం చేసే వేడుకతో యుద్ధానికి తగిన బాహువు ఇదే'', అని సిందూరంచే గుర్తువేయబడినవా అనేటట్లు ప్రకాశించింది. అటువంటి శ్రీకృష్ణుని బాహుదండం సర్వోత్కృష్టమై ఉంది.

**విశే :** ఉత్ప్రేక్ష, అనుప్రాస, పాంచాలీ రీతి, ఆరభటీవృత్తి, వీరరసం

**అవతారిక :** పదకొండవ సర్గాన్ని ముగిస్తూ శ్రీకృష్ణభక్తులకు మంగళాశాసనం చేస్తున్నాడు.

**సౌందర్యైక నిధే! రనంగలలనా లావణ్యలీలాజుషః**
**రాధాయా హృది పల్వలే మనసిడి క్రీడైక రంగస్థలే ।**
**రమ్యోరోజ సరోజ ఖేలన రసిత్వా దాత్మనః ఖ్యాపయన్**
**ధ్యాతు ర్మానస రాజహంస నిభతాం దేయాన్ముకుందో ముదమ్ ॥**

**తా :** సౌందర్యానికెల్ల ఆటపట్టై రతీదేవి విలాసాలచే ఎంతో ప్రకాశిస్తూ, మన్మథ క్రీడలకు రంగస్థలం వంటిదైన రాధయొక్క హృదయమనే మడుగులో



మనోహరాలైన స్తనకమలాలతో ఆడుకొనేవాడైన శ్రీకృష్ణుడు మనకు సంతోషాన్ని కల్గించుగాక!

**ఇతి శ్రీ జయదేవకృతౌ గీతగోవిందే రాధికామిలనే**
**సానందదామోదరో నామ ఏకాదశస్సర్గః**

ఇది శ్రీజయదేవకృతియైన గీతగోవిందంలో రాధికాసమాగమ ఘట్టంలో
సానంద దామోదరమనే పేరుగల పదకొండవ సర్గ.

* * *

## ద్వాదశ సర్గ
### సుప్రీత పీతాంబరము

**అవతారిక :** "రాధాముఖ కమల దర్శనమెప్పుడు లభిస్తుందా? రాధతో తనివితీర ఎప్పుడు ముచ్చటలాడుతానో? రాధతో తత్పూర్వం ఉన్నట్లుగా యథేష్టంగా ఎప్పుడు విహరిస్తానో?" అనే చిరకాలపు కోర్కె ఉత్కంఠుణ్ణి చేయగా కృష్ణుడు రాధను చూచి ఎంతో ఆనందంతో ఇలా అంటున్నాడు".

**గతవతి సఖీబృందేఽమంద త్రపాభరనిర్భర**
**స్మర పరవశాకూతస్ఫీత స్మిత స్నపితాధరామ్ ।**
**సరస మనసందృష్ట్వాహృష్టాం ముహుర్నవపల్లవ**
**ప్రసవ శయనే నిక్షిప్తాక్షి మువాచ హరిః ప్రియామ్ ॥**

**తా :** చెలికత్తెలందరు రాధను పొదరింటిలో విడిచి దూరంగా తొలగిపోగా ఆమె ఎంతో సిగ్గుపడి పెదవిపై చిరునవ్వు మొలకెత్తగా మన్మథ సంబంధాలైన అభిప్రాయాలను సూచిస్తూ, మాటిమాటికి, లేత చివుళ్లుగల పూలచేత తయారుచేయబడిన పాన్పును చూస్తూ, నిలబడియుండగా కృష్ణుడు ప్రియురాలైన రాధను హృదయ మందనురాగము ముప్పిరి గొనగా చూచి ఇలా చెప్పసాగాడు.

**విశే :** ఈ సర్గలో నాయిక స్వాధీన భర్తృక, నాయకుడు సానుకూలుడు.

## అష్టపది - 23
## మధురిపువిద్యాధరలీలము

## ఏకాదశ సర్గ
### సానంద దామోదరం
### (విభాసరాగైక తాళతాళాభ్యాంగీయతే)

**అవతారిక :** శ్రీకృష్ణుడు రాధతో చెప్పిన ప్రియవాక్యాలను గీతరూపంగా చెబుతున్నాడు.

### విభాసరాగం - ఆదితాళం
### 'నాదనామక్రియ' రాగం

కిసలయశయనతలే కురు కామిని! చరణ నళిన వినివేశమ్!
తవ పద పల్లవ వైరి పరాభవమిదమనుభవతు సువేశమ్ ॥
క్షణ మధునా నారాయణ మనుగత మనుసర రాధే (ధ్రువమ్) 1

కర కమలేన కరోమి చరణమహ మాగమితాఽపి విదూరమ్ ।
క్షణముపకురు శయనోపరి మామివ నూపురమనుగతి శూరమ్ ॥
క్షణ మధునా ... ... ... ... రాధే! ॥ 2

వదన సుధానిధి గళిత మమృతమివ రచయ వచన మనుకూలమ్ ।
విరహమివాపనయామి పయోధర రోధకమురసి దుకూలమ్ ॥
క్షణ మధునా ... ... ... ... రాధే! ॥ 3

ప్రియపరిరంభణరభసవలిత మివ పులకిత మతిదురవాపం ।
మదురసి కుచకలశం వినివేశయ శోషయ మనసిజతాపం ॥
క్షణ మధునా ... ... ... ... రాధే! ॥ 5

అధరసుధారసముపనయ భామిని! జీవయ మృతమివ దాసం ।
త్వయి వినిహిత మనసం విరహానల దగ్ధవపుష మవిలాసమ్ ॥
క్షణ మధునా ... ... ... ... రాధే! ॥ 6

శశిముఖి! ముఖరయ మణిరశనా గుణమనుగుణ కంఠనినాదం ।
శ్రుతి యుగళే పిక రుత వికలే మమ శమయ చిరాదవసాదమ్ ॥
క్షణ మధునా ... ... ... ... రాధే! ॥ 7

మామతివిఫల రుషా వికలీకృత మవలోకితు మధు నేదం ।
మీలతి లజ్జితమివ నయనం తవ విరమ విసృజ రతిఖేదమ్ ॥
క్షణ మధునా ... ... ... ... రాధే! ॥ 8

శ్రీ జయదేవ భణితమిద మనుపద నిగదిత మధురిపు మోదం ।

జనయతు రసిక జనేషు మనోరమ రతి రసభావ వినోదమ్ ॥

క్షణ మధునా ... ... ... ... రాధే! ॥ 9

చెలికత్తెలందరూ వెళ్ళిపోయిన తర్వాత చిరకాల వియోగతాపంతో ఆతురుడైన శ్రీకృష్ణుడు రాధతో ఇలా అంటున్నాడు.

**భావం :** ఓ రాధికా! అప్పుడే వికసించిన పువ్వులకన్నా మృదువైన నీ పాదాలను ఈ పూలపాన్పుపై ఉంచి, ఈ పూవుల గర్వాన్ని అణిచి వేయి. ఈ నారాయణుని నారీసహితునిగా చేయి. చాలా దూరం నుండి వచ్చావు గనుక నీవు బాగా అలసి వుంటావు. నీవు ఈ శయ్యపై పవళించినట్లయితే, నా ఈ చేతులతో నీకు పరిచర్య చేస్తాను.

చంద్రుని అమృత కిరణాల కన్నా మధురాతిమధురమైన నీ పలుకులతో నన్ను రంజిల్ల చేయి. సుందరం, కఠినం అయిన నీ చనులను కప్పిన ఆ వస్త్రాలను తీసివేయి.

ఓ ప్రేయసీ! రోమాంచితాలైన నీ స్తనాలతో నన్ను గాఢంగా కౌగిలించుకొని నా దుర్భర మదన తాపాన్ని దూరం చేయి.

నీ విరహాగ్నితో దహించుక పోయిన నన్ను నీ మధుర అధరామృతంతో పునరుజ్జీవింపజేయి.

ఓ చంద్రవదనా! కోకిల స్వరాలతో విసుగు చెందిన నన్ను నీ శ్రావ్యమైన మాటలతో, అందియల తాళాలతో ఆనందింప జేయి. నీవు నా దుష్కృత్యాలకు నన్ను దూషించానని సిగ్గు పడవద్దు. ఇక ఆలస్యం చేయక నా దరిజేరు.

శ్రీ జయదేవ విరచితమైన ఈ శృంగార గీతంలోని పదాలు రసిక జనులకు భావ వినోదాన్ని చేకూర్చు గాక!



**విశేష వర్ణన :**

రాధా కృష్ణులు అనురాగ భరితులై, కౌగిలింతల్లో, చుంబనాలతో బాహ్య ప్రపంచాన్ని మరిచారు. మన్మథకేళిలో నిమగ్నులైపోయారు. రాధ తన బరువైన స్తనాలతో కృష్ణుని వక్షఃస్థలాన్ని గట్టిగా నొక్కిపెట్టి, అతని భుజాలను అదిమిపెట్టి, అధరంలో అధరాన్ని చేర్చి రతి క్రీడ జరుపుతుండగా, శ్రీకృష్ణుని బాధ తొలగి ఆనందానికి హద్దులు చెరిగిపోయాయి.

రాధ శ్రీకృష్ణునితో రాసక్రీడకు సన్నద్ధురాలైనప్పటికీ, ఆమె బరువైన పిరుదులు, కుచాలు అడ్డు కాగా రాధ ప్రయత్నం వ్యర్థమైంది. కాని, రతిక్రీడా విజృంభణతో రాధ రవికె జారిపోయింది. చీరె ఊడిపోయింది. జుట్టు ముడి వీడిపోయింది. ఎర్రని పెదాలు కాంతిహీనమయ్యాయి. ముత్యాలసరం చిక్కుపడగా, ముడివీడిన కేశాలు చెమటతో చీకాకు పరచసాగాయి. రతి క్రీడలో కలిగిన స్వేదాన్ని ఒక చేత్తో తుడుచుకుంటూ, మరొక చేత్తో వక్షాన్ని కప్పుకొంటూ, రాధ అర్ధ నిమీల నేత్రయై మాధవుని వైపు చూస్తూ వుండిపోయింది. చుంబిస్తుండగా, రాధ ఆనందాబ్ధిలో ఓలలాడుతూ, అరమోడ్పు కన్నులతో మాధవుని సౌందర్య శోభను చూస్తూ ఆనందిస్తున్నది.

**ఇది మధురిపుమోద విద్యాధరలీల మనే పేరుగల ఇరవై రెండవ అష్టపది.**

## సురతారంభ చంద్రహాసం

**అవతారిక :** ఇక సురతారంభాన్ని వర్ణించడానికి పూనుకుంటున్నాడు.

**ప్రత్యూహః పులకాంకురేణ నిబిడాశ్లేషే నిమేషేణ చ**
**క్రీడాకూత విలోకితేఽధర సుధాపానే కథానర్మభిః ।**
**ఆనందాధి గమేన మన్మథ కలాయుద్ధేఽపి యస్మిన్నభూత్**
**ఉద్భూత స్సతయోర్బభూవ సురతారంభః ప్రియం భావుకః ॥**

**తా :** రాధాకృష్ణులు మిక్కిలి ఆనందరస నిమగ్నులై అన్యోన్య అనురాగాలు అతిశయింపగా సురాతారంభానికి పూనుకున్నారు. అప్పుడు వారిద్దరూ

బిగికౌగిలింతల్ని అనుభవిస్తూ గగుర్పాటుల్ని, సాభిప్రాయంగా, క్రీడావిషయంగా ఒకరికొకరు చూచుకోవడంలో రెప్పపాటున, అధరామృతపానం చేసేటప్పుడు రహస్యకథల్ని మాట్లాడుకోవడం, అనేక మన్మథబంధభేదాలచే క్రీడించేటప్పుడు ఆనందావిర్భావం విఘ్నాన్ని కల్గించేదయ్యాయి. అంటే, శృంగారరసం హృదయదర్పణంలో సంపూర్ణంగా ప్రతిఫలించేటట్లుగా సాంగోపాంగంగా క్రీడించినారని అర్థం.

**కామతృప్త కామినీహాసం**

**అవతారిక :** సంభోగశృంగారాన్నే మళ్లా వివరిస్తున్నాడు.

**దోర్భ్యాం సంయమితః పయోధరభరేణాపీడితః పాణిజై**
**రావిద్ధోదశనైః క్షతాధరపుటః శ్రోణీతటే నాహతః ।**
**హస్తే నానమితః కచేఽధరసుధాస్యందేన సమ్మోహితః**
**కాంతః కామపి తృప్తి మావతదహో! కామస్యవామాగతిః ॥**

**తా :** ఆ సమయంలో శ్రీకృష్ణుడు బాహువులచే కట్టివేయబడ్డాడు. స్తనభారం పైనవేసి పీడింపబడ్డాడు. గోళ్లచే గిచ్చబడ్డాడు. పండ్లచే క్రిందిపెదవి అంతా కొరకబడ్డాడు. పిఱ్ఱలపై భాగాన్ని తప్పెటల్లా వాయింపబడ్డాడు. జుట్టు పట్టుకొని వంగదీయబడ్డాడు. అధరామృతమనే కల్లును బోసి మోహింపజేయబడ్డాడు. ఇలా, చేయబడినప్పటికీ అతడు చెప్పనలవికాని అత్యంతానందం పొందాడు. ఔరా! ఏమిటిది? మన్మథుని నడవడిక అంతా వక్రమే కదా!" అనుకున్నాడు.

**పౌరుషరసప్రేమ విలాసం**

**అవతారిక :** పురుషాయిత శృంగారాన్ని వివరిస్తున్నాడు.

**వామాంకే రతికేళి సంకుల రణారంభే తయాసాహస, ప్రా**
**యం కాంతజయాయ కించి దుపరిప్రారంభి యత్సంభ్రమాత్ ।**
**నిష్పందా జఘనస్థలీ శిథిలితా దోర్వల్లి రుత్కంపితం**
**వక్షో మీలిత మక్షి పౌరుష రసః స్త్రీణాం కుతస్సిధ్యతి ॥**



**తా :** శ్రీకృష్ణుని కుడితొడమీద కూర్చుండి రాధ హఠాత్తుగా రతికేళి అనే మహాయుద్ధంలో శ్రీకృష్ణుని జయించాలనే మహాసాహసంతో లేచి ఉపరిసురతము (పురుషాయితం) ప్రారంభించింది. కాని, అప్పుడు రాధయొక్క జఘన ప్రదేశం నిశ్చలమయ్యింది. బాహులతల కదలజాలకపోయాయి. రొమ్ము దడదడ కొట్టుకోసాగాయి. కండ్లు మూతబడ్డాయి. అవును! స్త్రీలకు పౌరుషమెక్కడ నుండి వస్తుంది? ఆశ్చర్యం!

**నాయిక - స్వాధీనపతిక**

**నాయకుడు - అనుకూలుడు**

**కామాద్భుతాభినవ మృగాంకలేఖము**

**అవతారిక :** ఇలా సంభోగవర్ణనం ముగించి సర్గం ముగిసేంతవరకు సంభోగాంతంలోని లీలల్ని వర్ణిస్తున్నాడు.

**తస్యాః పాటల పాణిజాంకిత మురోనిద్రాకషాయే దృశౌ**
**నిర్ధౌతోఽధర శోణిమా విలులితాః స్రస్తాః స్రజోమూర్ధజాః ।**
**కాంచీదామ దరశ్లథాంచల మితి ప్రాతర్నిఖాతైర్దృశో**
**రేభిః కామశరైస్తదద్భుత మభూత్పత్యుర్మనః కీలితమ్ ॥**

**తా :** ఆ సంభోగాంతంలో రాధయొక్క వక్షస్థలం ఎఱ్ఱని గోటిగిచ్చులచే అర్ధచంద్రాకారరేఖలు ఏర్పడ్డాయి. నిద్రలేకుండా కండ్లు ఎఱ్ఱబడ్డాయి. పెదవి ఎఱ్ఱదనమంతా మాసిపోయింది. వెంట్రుకలముడి వీడగా పువ్వులు జలజల రాలిపడ్డాయి. మొలనూలు కాలికి జారిపోయింది. ఈ క్రమంగా ప్రాతఃకాలంలో మన్మథబాణాలు శ్రీకృష్ణుని దృష్టులతో పడినవైనా అతని మనస్సులో తగుల్కొన్నది. ఇది ఎంతో ఆశ్చర్యకరమైనవి కదా!

**వ్యాకోశః కేశపాశ స్తరళితమలకైః స్వేదమోక్షౌ కపోలౌ**
**క్లిష్టాబింబాధర శ్రీః కుచకలశరుచాహారితా హారయష్టిః ।**
**కాంచీకాంతి ర్హతాశాస్తన జఘన పదం పాణినా ఛాద్యసద్యః**
**పశ్యంతీ సత్రపామాంత దపి విలులితా ముగ్ధకాంతి ర్ధినోతి ॥**

**తా :** సంభోగాంతంలో రాధకు కొప్పు వీడిపోయింది. ముంగురులెగురసాగాయి. చెక్కిళ్లు చెమర్చాయి. అధర బింబకాంతి మాసిపోయింది. హారాలు కుచకుంభకాంతితో చేరిపోయాయి. మొలనూలు జారిపోయింది. అటువంటి సమయంలో రాధమిక్కిలి సిగ్గుపడి ఒకచేతితో జఘనాన్ని, మరోచేతిని స్తనాలపై పెట్టి శ్రీకృష్ణుని మనోహరంగా చూస్తూ, రతిచే తారుమారయినదైనా, అతనినెంతో సంతోషపరచింది.

**అవతారిక :** ఇటువంటి శృంగార రసానుభవం వలన తననెంతో ధన్యునిగా తలుస్తూ అన్యాపదేశంగా ఈ విషయాన్ని సూచించాడు.

**ఈషన్మీలిత దృష్టి ముగ్ధవిలస త్సీత్కార ధారావశాత్**
**అవ్యక్తాకుల కేళికాకు వికసద్దంతాంశు ధౌతాధరం ।**
**శాంతస్తబ్ధ పయోధరం భృశపరిష్వంగాత్కురంగీ దృశో**
**హర్షోత్కర్ష విముక్తి నిస్సహతనో ర్ధన్యోధయత్యాననమ్ ॥**

**తా :** రతాంతంలో గబ్బిగుబ్బల ఉబలాటం తీరేటట్లు దరగట్టిగ కౌగిలించుకొని, కాసేపు మూతపడిన కండ్లతో మనోహరంగా సీత్కారాలు చేయడంచేత, రతిలో కాకుస్వరాలు (రతికూజితాలు) చేయడంచేత, కొంచెం తెలిసీ తెలియనట్లు, ప్రసరించే దంతకాంతులుగల పెదవిగల జవరాలి ముఖాన్ని ముద్దాడే పుణ్యపురుషుడెవడో కదా!

**అవతారిక :** సంభోగానంతరం రాధాకృష్ణులు పరస్పరం అత్యంత ఆనందం పొందినవారైనారు. తరువాతి కృత్యాలను రాధకృష్ణునితో చెబుతున్నది.

**అథ సహసా సుప్రీతం సురతాం తే సా నితాంత ఖిన్నాంగీ ।**
**రాధా జగాద సాదర మిద మానం దేవ గోవిందమ్ ॥**

**తా :** రాధ సంభోగానంతరం ఎంతో బడలికపొంది కూడా శ్రీకృష్ణుడు మిక్కిలి ప్రీతితో ఉన్నట్లు తెలిసికొని అత్యంతానందంలో సాదరంగా ఇలా చెప్పసాగింది.



# అష్టపది - 24
## సుప్రీతపీతాంబరతాళశ్రేణి
### మంగళకౌశికరాగం - చాపుతాళం
### (రామక్రియారాగ యతితాళాభ్యాం గీయతే)

కురు యదునందన! చందన శిశిరతరేణ కరేణ పయోధరే!
మృగమద పత్రకమత్ర మనోభవ మంగళ కలశ సహోదరే ॥
నిజగాద సా యదునందనే క్రీడతి హృదయానందనే ॥ (ధ్రువమ్)
1

అళికుల గంజనమంజనకం రతి నాయక సాయక మోచనే ।
త్వదధర చుంబన లంబిత కజ్జల ఉజ్జ్వలయ ప్రియలోచనే ॥
నిజగాద ... ... ... ... ... నందనే ॥ 2

నయన కురంగ తరంగ వికాస నిరాస కరే శ్రుతి మండలే ।
మనసిజ పాశ విలాస ధరే శుభవేశ నివేశయ కుండలే ॥
నిజగాద ... ... ... ... ... నందనే ॥ 3

భ్రమర చయం రచయంతముపరి రుచిరం సుచిరం మమ సమ్ముఖే ।
జిత కమలే విమలే పరికర్మయ నర్మజనక మళకం ముఖే ॥
నిజగాద ... ... ... ... ... నందనే ॥ 4

మృగమద రసవలితం లలితం కురు తిలకమళిక రజనీ కరే ॥
విజిత కళంక కళం కమలాసన విశ్రమిత శ్రమ శీకరే ॥
నిజగాద ... ... ... ... ... నందనే ॥ 5

మమ రుచిచే చికురే కురు మానద మనసిజ ధ్వజ చామరే ।
రతి గలితే లలితే కుసుమాని శిఖండి శిఖండక డామరే ॥
నిజగాద ... ... ... ... ... నందనే ॥ 6

సరస ఘనే జఘనే మమ శంబర దారణ వారణ కందరే ।
మణిరశనా వసనాభరణాని శుభాశయ వాసయ సుందరే ॥
నిజగాద ... ... ... ... ... నందనే ॥ 7

శ్రీ జయదేవ వచసి రుచిరే సదయం హృదయం కురు మండనే ।
హరిచరణ స్మరణామృత నిర్మిత కలి కలుష జ్వర ఖండనే ॥
నిజగాద ... ... ... ... ... నందనే ॥ 8

ఇలా రాధ రతికేళికా విలాసాల ననుభవించి అలసి ఉన్నా, గోవిందుడు తన పట్ల కనబరచిన అనురాగ జ్యోత్స్నకు ఆశ్చర్యపడి ఇలా చెప్పింది.

ఓ యశోదానందనా! రాసక్రీడలో అలసిపోయిన నాకు, నీ తామర తూడులవంటి మృదువైన, చందనం వలె చల్లనైన హస్తాలతో నా కుచకలశాలకు కస్తూరిని పూసి అలంకరించు.

నీ చుంబనాల తీవ్రతకు నా కాటుక చెరిగిపోయింది. నా కళ్ళకు కాటుకరేఖలు దిద్దు. నేత్రాలనే జింకలు పారిపోకుండా పగ్గాల వలె రెండు వైపులా ఉన్న నా చెవులకు కుండలాలు పెట్టు.

వికసించిన పద్మం వలె వున్న నా ముఖంపై తుమ్మెదలా వుండే భూషణాలను అలంకరించు.

రతికేళిలో కలిగిన చెమటతో తడిసి, చెదిరిపోయిన తిలకాన్ని దిద్ది, ఈ చంద్ర బింబం వంటి ముఖసౌందర్యాన్ని అనుభవించు.

అభిమానవతుల ప్రేమానురాగాలను దొంగిలించేవాడా! రతి క్రీడలో విడిపోయిన నా కురులను ముడివేసి పుష్పాలతో అలంకరించు.

కొండల వంటి నా పిరుదులపై వస్త్రాలను సవరించి అలంకరించు.

శ్రీహరి చరణ స్మరణామృతుడైన ఈ జయదేవ కవి గీతం సకల జనుల హృదయాలను ఆనందపరచి, కలి కాలుష్యాన్ని హరించు గాక!!



**విశేష వర్ణన**

శ్రీకృష్ణా! నీ ఎడబాటుతో నన్ను మన్మథుడు వేధించగా, నిన్నే నా మనసులో తలచి, నీ చెంతకు చేరి, రతి క్రీడలో అలసిన నా స్తనాలపై మకరికా పత్రాన్ని అద్దు. నా చెక్కిళ్ళపై చిత్రలేఖనం చేయి. నా ఒడ్డాణం పట్టీ పట్టుకో. నా సిగలో పుష్పాలు తురుము. చేతులకు గాజులు, కాళ్ళకు అందెలు అలంకరించు.

అంతట పీతాంబరధారి శ్రీకృష్ణుడు రాధను శోభాయమానంగా అలంకరించి ఆమె సౌందర్య కాంతులను ఆశగా చూచి ఆనందించాడు.

## ఉపసంహారం

శ్రీవైష్ణవుడైన శ్రీ జయదేవ కవి పండితుడు శ్రీ కృష్ణ పరమాత్మపై గల స్థిర, పరిశుద్ధ భక్తిని, తన శ్రేష్ఠ రచనా వైదుష్యంతో, సంగీత, శృంగార సమ్మిళితమైన ఈ 'గీత గోవిందం' భక్తి శృంగార కావ్యాన్ని రచించి, లోక ప్రసిద్ధుడయ్యాడు.

శ్రీ భోజదేవ, రమాదేవి దంపతుల పుత్రుడైన శ్రీ జయదేవుని ఈ 'గీత గోవిందం' కావ్యం నా ప్రియతములైన పరాశరాదుల గళంలో ప్రతిధ్వనించు గాక!

సకల జనులకు శ్రేయోదాయకమైన, శృంగార రసభరితమైన భక్తి కావ్యం "గీత గోవిందం" లో చక్కెర ఎంతో కఠినమైనది. ద్రాక్ష పువ్వు కల దోషమున్నది. అమృతం మృతమైనది. పాలు నీరుగారిపోయింది. మామిడీ! నీలో టెంకె వుంది. కాంతాధరోష్ఠమా! మీకెవరూ సాటిరారు.

ఈ విధంగా యమునానదీతీరంలో రాధ స్తనాలను పట్టుకోవటంలో అనురక్తుడైన పురుషోత్తముని శృంగార కేళీ వినోదాలు గల ఈ కావ్యం చదివిన వారికి, విన్న వారికి సకల సౌభాగ్యాలు చేకూర్చుగాక!!

**అవతారిక :** పై అష్టపదిలో చెప్పబడిన విషయాలనే మరల ఒకసారి అనుసరించి చెబుతున్నాడు.

**రచయ కుచయోః పత్రం చిత్రం కురుష్వ కపోలయోః**
**ఘటయ జఘనే కంచీ మంచస్రజం కబరీ భరే ।**
**కలయ వలయ శ్రేణీం పాణౌపదే కురునూపురౌ**
**ఇతి నిగదితః ప్రీతః పీతాంబరోఽపి తథాఽకరోత్ ॥**

**తా :** ఓ కృష్ణా! నా స్తనాలపై మకరికా పత్ర రచనచేయి. చెక్కిళ్లపై చిత్రరేఖల్ని తీర్చు. మొలకు ఒడ్డాణాన్ని అమర్చిపెట్టు. జుట్టుముడిని సవరించి పూలదండను అలంకరించు. చేతులకు మురుగుల్ని పెట్టు. కాళ్లకు అందియలు తొడుగు. అని ఈ విధంగా రాధ చెబుతుండగా శ్రీకృష్ణుడు సంతోషించి అట్లే చేశాడు.

**అవతారిక :** గీతగోవింద కావ్యాన్ని ముగింపబోతూ గ్రంథాంతంలో విద్వత్ ప్రార్థనా నెపంచే గ్రంథగౌరవార్థమై ఆత్మప్రశంసను ఇలా చేస్తున్నాడు కవి.

**యద్గాంధర్వ కలాసుకౌశల మనుధ్యానం చ యద్వైష్ణవం**
**యచ్ఛృంగార వివేక తత్త్వరచనాకావ్యేషు లీలాయితం ।**
**తత్సర్వం జయదేవ పండితకవేః కృష్ణైకతానాత్మనః**
**సానందాః పరిశోధయంతు సుధియః శ్రీగీతగోవిందతః ॥**

**తా :** ఓ బుద్ధిమంతులారా! శ్రీకృష్ణుని చింతనమందే ఏకాగ్రమైన హృదయంగల శ్రీజయదేవుని యొక్క సంగీతవిద్యల్లోగల కౌశల్యం, విష్ణుపదచింతనం, శృంగారరస ప్రధానాలైన కావ్యాల రచనా నైపుణ్యం మొదలైన సామర్థ్యాలన్నీ ఈ గీతగోవింద కావ్యాన్నిబట్టి అత్యంతానందంతో తెలిసికొంటారు కదా!

**శ్రీభోజదేవ ప్రభవస్య – రామాదేవీసుత శ్రీజయదేవకస్య ।**
**పరాశరాది ప్రియవర్గ కంఠే శ్రీగీతగోవింద కవిత్వమస్తు ॥**



**తా :** శ్రీభోజదేవుడు, రమాదేవీ దంపతుల కుమారుడైన శ్రీ జయదేవుని గీతగోవిందమనెడి ఈ కావ్యం నామిత్రులైన పరాశరాదుల కంఠంలో నిలిచి ఉండుగాక!

**అవతారిక :** జయదేవుడు తన కావ్యంలోని మాధుర్యాది గుణాలు పండితుల కందరికీ తెలియడానికై ఈ కావ్యాన్ని ప్రశంసిస్తున్నాడు.

**సాధ్వీ! మాధ్వీక! చింతా న భవతి భవతశ్శర్కరే! కర్కశాసి**
**ద్రాక్షే! ద్రక్ష్యంతి కేత్వామమృత! మృత మసిక్షీర! నీరం రసస్తే ।**
**మాకంద! క్రంద కాంతాధరధర! సతులాంగచ్ఛయచ్ఛంతి భావం**
**యావచ్ఛృంగారసారం శుభమివ జయదేవస్య వైదగ్ధ్యవాచః ॥**

**తా :** ఓ ఇప్పపూదేనియా! (నేను జయదేవుని కవితతో సమానమగుదునని) నీవు చింతిల్లుట మంచిదికాదు. ఓ పంచదారా! నీవు మిక్కిలి కఠినస్వరూపం గలదానివి గదా! (కాబట్టి, కోమలస్వరూపం గలదానితో సాటిరావు ఓ ద్రాక్షా! నీ మొగం చూచేవారెవ్వరు? ఓ అమృతమా! నామమాత్రం చేతనే గర్వించవద్దు. నీవు మృతమైతివి. ఓ క్షీరమా! (నేను 'రస'మని పొగరుతో ఉన్నావా?) నీ రసమంతా నీళ్లపాలే కదా! ఓ తియ్యమామిడీ! నీవు ఏడ్వవలసిందే! ఓ కాంతాధరోష్ఠమా? నీవు సాటికి రావు పో! శ్రీ జయదేవుని చతురవాక్కులు మంగళాలనేగాక సమస్త శృంగార రససారంకూడా ప్రసాదించేవి సుమా!

**ఇత్థం కేళితతీ ర్విహత్య యమునాకూలే సమం రాధయా**
**తద్రోమావళి మౌక్తికావలియుగేస్యవేణీభ్రమం బిభ్రతి ।**
**తత్రాహ్లాది కుచప్రయోగ ఫలయోర్లిప్సా వతోర్వస్తమో**
**వ్యాపారాః పురుషోత్తమస్య దదతుస్ఫీతాం ముదాం సంపదమ్ ॥**

**తా :** ఈ విధంగా శ్రీకృష్ణుడు రాధతో కలసి యమునానదీ తీరాలలో అనేక క్రీడలలో విహరించిన తర్వాత, ఆ రాధయొక్క నూగారును, ముత్యాలహారాన్ని గంగాయమునానదుల ప్రవాహంవలె ప్రకాశింపగా, ఆ జలాలలో

రాధాస్తనద్వయం అందంగా మద్దిపండ్లలాగా తేలియాడుతుండగా, వాటిని పట్టుకోవడానికై ఆశతో ప్రవర్తించే శ్రీకృష్ణుని శ్రీహస్తాల చేష్టలు మనకు సమస్త సంతోష సమృద్ధుల్ని ప్రసాదించుగాక!

**ఇది శ్రీ జయదేవకృతే గీతగోవిందే సుప్రీత పీతాంబరోనామ ద్వాదశస్సర్గః.**

ఇది శ్రీ జయదేవ మహాకవి విరచితమైన గీతగోవింద మహాకావ్యంలో సుప్రీత పీతాంబరమనే పేరుగల పన్నెండవసర్గ సర్వం సంపూర్ణం.

## మంగళము

చిత్తజుని కన్నయకు జయ మంగళం
మదహరిభక్తికైన చిత్తవృత్తుదుత్తమునకు ॥చి॥

అందమైన చంద్రుని నిందించు ముఖారవింద
మిందిరానంద గోవింద నందనందనునికీ ॥చి॥

బలరామ రాముడై క్షేమమొసగు సకల గుణ
రాముడే మా పట్టాభిరామ స్వామి రూపునకు ॥చి॥

కోరి భక్తిమీర జేరి దారి కన్నవారి కలుషారి వారి
భూరివైభవ కస్తూరి రంగ శౌరికినీ ॥చి॥

మా రామభద్రునికి జయ మంగళం
గోపాల కృష్ణునకు జయ మంగళం
సద్గురుస్వామికి జయ మంగళం
ఆంజనేయ స్వామికి శుభ మంగళం

ముకుంద రాధే ముకుంద రాధే ముకుంద రాధే మాం పాహి
కళ్యాణ రాధే కళ్యాణ రాధే కళ్యాణ రాధే మాం పాహి ॥

**శుభం**